సోమవారం
23-09-2024
విజయవాడ ప్రచురణ
సంపుటి : 73, సంచిక : 93
పేజీలు : 6+8, వెల: రూ.5.00
Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

అమెరికాలో కాల్పులు: నలుగురి మృతి

వాషింగ్టన్: అమెరికాలో తుపాకీ సంస్కృతి నానాటికీ పెరిగిపోతోంది. ఎక్కడో ఒక చోట కాల్పులు కలకలం రేపుతూనే ఉన్నాయి. తాజాగా అల్బామా రాష్ట్రంలోని బర్మింగ్‌హామ్‌లో కొందరు దుండగులు కాల్పులకు తెగబడ్డారు. ఈ ఘటనలో నలుగురు ప్రాణాలు కోల్పోగా అనేక మంది గాయపడ్డారు. అల్బామా యూనివర్సిటీ సమీపంలోని ఫైవ్ పాయింట్స్ సౌత్ ఏరియాలో మగ్నోలియా అవెన్యూ- 2000 బ్లాక్‌లోని రద్దీగా ఉండే ప్రాంతంలో కాల్పులు జరిగినట్లు బర్మింగ్‌హామ్ పోలీసులు చెప్పారు. ముగ్గురు అక్కడికక్కడే చనిపోగా మరొకరు యూనివర్సిటీ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచినట్లు తెలిపారు. అనేక మంది తీవ్రంగా గాయపడ్డారన్నారు. ఎవరినీ అరెస్టు చేయలేదన్నారు.

అరకొర సాయం

- ప్రభుత్వ ప్రకటనపై అసంతృప్తి
- షెడ్లకే ఆటోలు పరిమితం
- ఇన్సూరెన్స్ కంపెనీల కోత
- వరద ముంపుతో డ్రైవర్ల జీవనం దయనీయం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి:
ప్రభుత్వ సాయం ఆదుకుంటుందని ఆశించిన ఆటో డ్రైవర్లకు నిరాశే మిగిలింది. రోజుల తరబడి నీటనాని దెబ్బతిన్న ఆటోలకు ప్రభుత్వం అరకొర సాయం ప్రకటించడంతో ఏమూలకూ చాలదని లబోదిబోమంటున్నారు. కనీసం రూ.30 వేలు ఆర్థికసాయం అందించాలని అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ ప్రభుత్వం పెడచెవిన పెట్టడంతో ఆందోళన చెందుతున్నారు. పైపెచ్చు ఇన్సూరెన్స్ కంపెనీలు మోసం చేస్తున్నాయని వాపోతున్నారు. ఉపాధి లేక ప్రభుత్వం ఆదుకోక రెంటికీ చెడ్డ రేవడిలా మిగిలామని కంటనీరు పెట్టుకున్నారు.

బుడమేరు వరద ముంపుతో నిరాశ్రయులైన ఆటో డ్రైవర్ల జీవనం ఇంకా గాడిలో పడలేదు. వరదలు తగ్గినప్పటికీ ఆటోలు పూర్తిగా రోడ్డెక్కలేదు. దాదాపు 12 రోజులపాటు వరదలోనే ఇళ్లు నానడిపోవడం, ఇతర ప్రాంతాలకు వెళ్లిపోవడంతో ఆటో డ్రైవర్ల ఉపాధి దూరమైంది. సాధారణ పరిస్థితులు అందుబాటులోకి వచ్చినప్పటికీ... ప్రస్తుతం చేతిలో డబ్బులు లేకపోవడం, ఆటోలు మరమ్మతులకు గురవ్వడంతో వారి నిత్యజీవనోపాధికి ఆటంకం ఎదురైంది. దానికితోడు ఇన్సూరెన్స్ కంపెనీల మోసాలకు బలై... పూర్తిగా రాకపోవడంతో ఆర్థికంగా చితికిపోతున్నారు. ఆటోలను షెడ్లకు తరలించినా... కనీసం నెల రోజులు సమయం ఉంచాలన్న గడువుతో రోజువారీ ఉపాధికి గండిపడుతోంది. కుటుంబాన్ని పోషించడం భారంగా మారింది. అప్పులు చేసి ఆటోలు కొనుగోలు చేసిన యజమానుల పరిస్థితి ఆందోళనకరంగా మారింది. భారీ వర్షాలు, వరదలతో ఇళ్లు మునగడంతోపాటు వారి ఆటోలూ రోజుల తరబడి నీటనాని దెబ్బతిన్నాయి. ప్రభుత్వం ఆటోలకు అరకొర సాయమే ప్రకటించడంపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ముంపు నష్టగణన సమయంలోనే ప్రభుత్వం, అధికారుల దృష్టికి రూ.30 వేలకు తగ్గకుండా (ఇన్సూరెన్స్ కాకుండా) ఆర్థిక సాయమందించాలని ఆటో డ్రైవర్లు, సంఘాల నేతలు విజ్ఞప్తి చేసినప్పటికీ... ప్రభుత్వం పెడచెవిన పెట్టిందని వాపోతున్నారు. దెబ్బతిన్న ప్రతి ఆటోకూ అరకొర సాయమే ప్రకటించడంతో... అది తమకు ఏ విధంగానూ ఉపయోగపడబోదని తెలుపుతున్నారు. ఇన్సూరెన్స్ కంపెనీలు ఒక నెల కట్టకపోతే, రద్దు చేస్తామని హెచ్చరిస్తున్నాయని, పూర్తి ఇన్సూరెన్స్ కల్పించకుండా బేరసారాలకు పాల్పడుతున్నారని ఆటో యజమానులు మండిపడుతున్నారు. రోజుకు 50 నుంచి 100 వరకు ఆటోలు షెడ్లకు వెళుతుంటే... అందులో కనీసం 10 ఆటోలూ బయటకు రావడం లేదని డ్రైవర్లు వాపోతున్నారు.

వరదలు రాకముందు విజయవాడ నగరంలో ఎక్కడ చూసినా కిక్కిరిసి ఆటోలు నడిచేవి. బస్టాండ్, రైల్వేస్టేషన్, లెనిన్ సెంటర్, పాత బస్టాండ్ సెంటర్, బెంజిసర్కిల్ సెంటర్, రామవరప్పాడు రింగ్, ఒన్‌టౌన్, సింగ్‌నగర్ తదితర ఆటో స్టాండ్లలో బారులు తీరి ప్రయాణికుల కోసం ఆటో డ్రైవర్లు వేచిఉండేవారు. ఇప్పుడు ఏ స్టాండు చూసినా అరకొరగా ఆటోలు కన్పిస్తున్నాయి. రోజువారీ ఫైనాన్స్‌తో అద్దెకు నడిపే ఆటోల యజమానులకు ఆర్థిక సమస్యలు ఎదురవుతున్నాయి. సొంతంగా ఆటోలు కొనుగోలు చేయలేని వారంతా ఫైనాన్స్‌కు ఆటోలను నడుపుకుంటారు. వాటిపై ఎంతోకొంత రోజువారీ సంపాదించి, కొంత ఫైనాన్స్‌కు కట్టి, మిగిలిన దానితో జీవిస్తుంటారు. సింగ్‌నగర్‌లో సీఎన్‌జీతో నడిచే ఆటో యజమానుల పరిస్థితి అధ్వానంగా మారింది. సీఎన్‌జీ ఆటోలు వేలాదిగా నీట మునిగి, ఇంజన్లోకి వరద నీరు చేరి దెబ్బతిన్నాయి. ఇంజన్లు పూర్తిగా మట్టిపట్టి, తప్పుపట్టి దర్శనమిస్తున్నాయి. సీఎన్‌జీ ఆటోలకు వైరింగ్ కిట్ మొత్తం పోగా, దానిని పూనే నుంచి వచ్చాకనే దానికి పనులు మొదలు పెడతారు. షెడ్లకు వెళ్తే నెల నుంచి రెండు నెలల సమయం పడుతుంది. ఇంజన్ మొత్తం పూర్తిగా విప్పి మరమ్మతులు చేయాల్సిన పరిస్థితి ఉంది. బ్యాటరీలు నీళ్లలో నాని పాడయ్యాయి. వేలాది రూపాయలు ఖర్చవుతాయని వాపోతున్నారు. ఈ ఆటోలకు ఇన్సూరెన్స్ ఉంటేనే క్లైమ్ అవుతుంది. లేకుంటే పూర్తిగా నష్టపోవాల్సిందే. ఈ తరుణంలో ఆటోల మరమ్మతులే చేయించాలా లేక జీవనమే సాగించాలో తెలియక డ్రైవర్లు, యజమానులు సతమతమవుతున్నారు. మరమ్మతులకు వెళ్లిన ప్రతి ఆటో డ్రైవర్‌కు అదనంగా కొత్త సామాన్ల కొనుగోలుకు, దెబ్బతిన్న ఆటోలు నడిచేందుకు కనీసం రూ.30 వేలకుపైగా ఖర్చులు తడచిమోపెడవుతున్నాయని గగ్గోలు పెడుతున్నారు.

'ఇన్సూరెన్స్' మోసాలు నియంత్రించాలి

కంపెనీల మోసాన్ని నియంత్రించి, పూర్తి స్థాయి ఇన్సూరెన్స్ కల్పించాలని ఆటో డ్రైవర్లు కోరుతున్నారు. ఇన్సూరెన్స్ వర్తించని ఆటోలకు సర్వీస్ సెంటర్లు సగం ధరకే మరమ్మతులు చేయాలని, బ్యాంకు, ఫైనాన్స్ కంపెనీలకు చెందిన ఆటోల రుణాలపై మూడు

- మిగతా 2 లో

శ్రీలంక అధ్యక్షుడిగా లెఫ్ట్ నేత

- 42.31శాతం ఓట్లతో దిశానాయకే చారిత్రక గెలుపు
- నేడు ప్రమాణ స్వీకారం

కొలంబో:
శ్రీలంకలో ఎర్ర జెండా ఎగిరింది. అధ్యక్షుడిగా ఎన్నికై లెఫ్ట్ నాయకుడు చరిత్ర సృష్టించారు. ద్వీప దేశంలో కొత్త శకానికి నాంది పలికారు. జనతా విముక్తి పెరమున (జేవీపీ) నాయకుడు అనుర కుమార దిశానాయకే (55) దేశ అత్యున్నత పదవికి ఎన్నికయ్యారు. దేశానికి తొమ్మిదో అధ్యక్షుడిగా నిలిచారు. ఈ పీఠాన్ని అధీష్టించే మార్క్సిస్టు నాయకుడిగా రికార్డు నెలకొల్పారు. 42.31 శాతం ఓట్లతో దిశానాయకే గెలిచినట్లు ఎన్నికల సంఘం ఆదివారం ప్రకటించింది. నూతన అధ్యక్షుడిగా దిశానాయకే సోమవారం ప్రమాణ స్వీకారం చేస్తారని తెలిపింది. రాజధాని కొలంబోలోని వలసవాద కాలం నాటి ప్రెసిడెంట్ సెక్రటేరియట్‌లో ప్రమాణ స్వీకారోత్సవం జరుగుతుందని ఎన్నికల కమిషన్ అధికారులు వెల్లడించారు.

కొత్త శకానికి నాంది - ఐక్యంగా ముందుకు

దేశ ఐక్యతకు దిశానాయకే పిలుపునిచ్చారు. శతాబ్దాల కల సాకారం కాబోతోందన్నారు. ఈ విజయం తనొక్కడి కృషి ఫలితం కాదని లక్షల మంది సమష్టికృషి ఫలితమని అన్నారు. శ్రీలంకలో కొత్త శకం మొదలైందని ఉద్ఘాటించారు. తన గెలుపునకు సహకరించిన ప్రతి

- మిగతా 2 లో

బంగాళాఖాతంలో అల్పపీడనం

తెలుగు రాష్ట్రాలకు వర్ష సూచన

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం:
ఇప్పుడిప్పుడే లోతట్టు ప్రాంతాలు వరద ముంపు నుండి తేరుకొని సాధారణ స్థితి నెలకొన్న నేపథ్యంలో మళ్లీ వర్షాలొస్తున్నాయన్న వార్తలు తెలుగు రాష్ట్రాల ప్రజలను ఆందోళనకు గురిచేస్తున్నాయి. బంగాళాఖాతంలో సోమవారం మరో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని విశాఖపట్నం వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. పశ్చిమ-మధ్య బంగాళాఖాతంలో ఎయిర్ సైక్లోనిక్ సర్క్యులేషన్ ఏర్పడిందని, థాయ్‌లాండ్ కు ఉత్తరం వైపున మరో సర్క్యులేషన్ ఏర్పడిందని...

- మిగతా 2 లో

aap
AAM AADMI PARTY

మారిన ఆప్ వ్యూహం

నిజాయితీపరుడిగా నమ్మితేనే ఓటేయాలని పిలుపు

న్యూఢిల్లీ:
'ముందు అవినీతి పరులుగా ముద్రవేస్తారు. ఆపై అదే నాయకులను తమ పార్టీకి చేర్చుకుంటారు. ఎన్నికైన ప్రభుత్వాలను కూల్చివేస్తారు. పార్టీలను చీల్చేందుకు కేంద్ర సంస్థలను అస్త్రాలుగా ప్రయోగిస్తారు. ఇది బీజేపీ రాజకీయ పంథా' అని ఆప్ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ ఘాటు విమర్శలు చేశారు. ఈ తరహా బీజేపీ రాజకీయాలతో ఆర్‌ఎస్‌ఎస్ ఏకీభవిస్తోందా అని ప్రశ్నించారు. దిల్లీ, జంతర్ మంతర్ వద్ద 'జనతా కీ అదాలత్' పేరిట నిర్వహించిన బహిరంగ సభలో కేజ్రీవాల్ కొత్త

- మిగతా 2 లో

ఏపీ టెట్ పరీక్షల షెడ్యూలు

హాల్‌టికెట్లు విడుదల

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి:
ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ అర్హత పరీక్ష (ఏపీటెట్)-2024 పరీక్షల షెడ్యూలు యథాతథంగా కొనసాగనున్నాయి. ఈనెల మూడో తేదీ నుంచి 21వ తేదీ వరకు టెట్ పరీక్షలను నిర్వహిస్తున్నారు. మొత్తం 17 రోజులపాటు పరీక్షలు జరగనున్నాయి. హాల్ టికెట్లు

- మిగతా 2 లో

లడ్డూ కల్తీపై సిట్ దర్యాప్తు

టీటీడీని రాజకీయ పునరావాసంగా మార్చారు

నేడు శాంతిహోమం: చంద్రబాబు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి:
ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వ హయాంలో తిరుమల ప్రతిష్టను దెబ్బతీశారని, రాజకీయ పునరావాసంగా మార్చారని సీఎం చంద్రబాబు ఆవేదన వ్యక్తం చేశారు. గత పాలకులెవ్వరూ తిరుమల పవిత్రత దెబ్బతీసే సాహసం చేయలేదని, ఎందరికో స్ఫూర్తిదాయకమైన పవిత్ర

- మిగతా 2 లో

అమెరికాతో కలిసి పనిచేస్తాం

సవాళ్లను దీటుగా ఎదుర్కొంటాం

గర్భాశయ కేన్సర్‌పై పటిష్ఠ పోరు: మోదీ

విల్మింగ్టన్/న్యూదిల్లీ:
అంతర్జాతీయ సవాళ్ల పరిష్కారానికి భారత్ కట్టుబడి ఉందని ప్రధాని మోదీ అన్నారు. అమెరికాతో కలిసి పనిచేసేందుకు సిద్ధమని తెలిపారు. గర్భాశయ కేన్సర్‌పై పోరాటాన్ని మరింత బలోపేతం చేసుకోవాలని సంకల్పించారు. ఇండో-పసిఫిక్‌లో ఈ వ్యాధిని గుర్తించడం, పరీక్షించడంతో పాటు స్క్రీనింగ్ కోసం 'కేన్సర్ మూన్‌షాట్'కు తమ వంతుగా 7.5 మిలియన్ డాలర్లు భారత్ ఇస్తుందని ప్రధాని మోదీ ప్రకటించారు. 'ఒకే భూమి... ఒకే ఆరోగ్యం' అనే భారత్ విజన్‌లో భాగంగా ఇందుకు సంకల్పించినట్లు చెప్పారు. రేడియోథెరపీ చికిత్సకు, కేన్సర్ నివారణ సామర్థ్యాన్ని పెంచుకునేందుకు భారత్ సహకరిస్తుందన్నారు. పేదల దేశాల పిల్లల కోసం వ్యాక్సిన్‌లను మెరుగుపర్చేందుకు ఏర్పడిన అంతర్జాతీయ సంస్థ గావిలో భాగంగా భారత్ నుంచి 40 మిలియన్ల డోసులు సరఫరా చేస్తామని, తద్వారా ఇండో-పసిఫిక్ దేశాలకు ప్రయోజనం ఉంటుందని మోదీ అన్నారు. అంతర్జాతీయ వ్యవస్థల సంస్కరణలకు సంబంధించిన చర్యలకు అమెరికా మద్దతు ఉంటుందని అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ అన్నారు. శాంతి సందేశంలో ఉక్రెయిన్‌లో మోదీ పర్యటించడాన్ని ప్రశంసించారు. సంస్కరించిన ఐరాస భద్రతా మండలిలో భారత్‌కు శాశ్వత సభ్యత్వం కల్పనకు మద్దతు తెలిపారు. అంతర్జాతీయ స్థాయిలో భారత్ గొంతుకు ప్రాధాన్యత ఉందన్నారు. తొలుత అధినేతలు ఇద్దరు ద్వైపాక్షిక చర్చలు జరిపారు. ఆపై రష్యా-ఉక్రెయిన్‌తో పాటు ఇండో పసిఫిక్ అంశాలను చర్చించారు. సెమీ కండక్టర్లు, స్వచ్ఛ విద్యుత్, రక్షణతో

- మిగతా 2 లో

పేదల సొంతింటి కల నెరవేరేనా?

విశాలాంధ్రబ్యూరో-ఏలూరు:

- లక్ష్యం 20 లక్షల ఇళ్లు
- పూర్తయినవి 6 లక్షలే
- వివిధ దశల్లో ఆగిపోయిన నిర్మాణం

సమాజంలో పేదలందరికీ అన్ని సదుపాయాలతో ఇళ్లు నిర్మించి ఇస్తామన్న పాలకుల ప్రకటనలు నీటిమీద రాతలయ్యాయి. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడకముందు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పేదలందరికీ ఇళ్ల నిర్మాణ కార్యక్రమం కార్యాచరణలో ఘోరంగా విఫలమైంది. గృహ నిర్మాణాలు ఒక అడుగు ముందుకు... పది అడుగులు వెనక్కు అన్న చందాన సాగుతున్నాయి. దీంతో పేదలందరికీ సొంత ఇంటికల ఇప్పట్లో నెరవేరేలా కనిపించడం లేదు. పేదలకు ఇళ్లు ఇచ్చేందుకు పీఎంఏవై-అర్బన్, పీఎంఏవై-గ్రామీణ, జగనన్న కాలనీల పేరుతో 2020 డిసెంబర్ లో జీఓ8, జీవో 9 లను విడుదల చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 26 జిల్లాల్లో 28.30 లక్షల ఇళ్లను పూర్తి చెయ్యాలన్నది లక్ష్యం. ఇందులో మొదటి దశలో 15.10 లక్షల ఇళ్లు, రెండవ దశలో 13.20 లక్షల ఇళ్లు నిర్మాణం పూర్తి చేయాలని నిర్ణయించారు. ఇందుకోసం

- మిగతా 2 లో

చిరంజీవికి విశిష్ట గౌరవం

'గిన్నిస్ బుక్'లో చోటు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి:
మెగాస్టార్ పద్మవిభూషణ్ చిరంజీవికి మరో అరుదైన గౌరవం లభించింది. నాలుగు దశాబ్దాలకు పైగా సినీ ప్రస్థానంలో కోట్లాది మంది అభిమానులను చిరంజీవి సొంతం చేసుకున్నారు. సినీ పరిశ్రమకు చేసిన సేవలకు గానూ ఇటీవలే కేంద్ర ప్రభుత్వం ఆయనకు పద్మవిభూషణ్ అవార్డుతో సత్కరించింది. తాజాగా చిరంజీవి గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ లో

- మిగతా 2 లో

ఇదీ లోకం!

అవతల 'మోదీ' చేసేవి చూడలేకపోతున్నాం! మీరు కూడా ఆయనకు తోడైతే ఎలా సామీ!

బీజేపీ పాలనలో దళితులకు రక్షణ కరువు

ఆ పార్టీ అధికారంలో ఉన్న రాష్ట్రాల్లోనే దురాగతాలు అధికం

అగ్రస్థానంలో యూపీ, రాజస్థాన్, మధ్యప్రదేశ్

న్యూఢిల్లీ:
బీజేపీ పాలిత రాష్ట్రాల్లో దళితులకు రక్షణ కరువైంది. చీటికిమాటికి వేధించడం పరిపాటిగా మారింది. షెడ్యూల్ కులాలు, షెడ్యూల్డ్ తెగలపై నేరాలు అధికంగా జరిగే రాష్ట్రాల్లో ఆ పార్టీ అధికారంలో ఉన్న ఉత్తరప్రదేశ్, రాజస్థాన్, మధ్యప్రదేశ్ అగ్రస్థానంలో ఉన్నాయని సాక్షాత్తు కేంద్రం విడుదల చేసిన నివేదికే తెలిపింది. 2022 నాటికి 13 రాష్ట్రాల్లో 98.91శాతం నేరాలు ఎస్సీలపై జరిగినట్లు ప్రభుత్వ నివేదిక

- మిగతా 2 లో

సర్వీస్ రోడ్డు కోసం రోడ్డెక్కిన రైతులు

- చిత్తూరు-తచ్చూరు హైవేపై వంటావార్పు
- రహదారి దిగ్బంధించి నిరసన
- భూములిచ్చిన రైతుల సమస్య పరిష్కరించే వరకు ఉద్యమం: సీపీఐ కార్యదర్శి డాక్టర్ కె నారాయణ

2లో

సోషలిజమే మన భవిష్యత్తు

ఘనంగా ఒడిగిటిస్ ఉత్సవం

ఏథెన్స్: సోషలిజమే మన భవిష్యత్ అంటూ యువ కమ్యూనిస్టులు నినదించారు. గ్రీస్ రాజధాని ఏథెన్స్‌లో ఒడిగిటిస్ ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించుకున్నారు. యువజనోత్సవానికి ప్రపంచ నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో యువతీ యువకులు హాజరయ్యారు. కమ్యూనిస్ట్ యూత్ ఆఫ్ గ్రీస్ (కేవెన్‌సీ) అధ్వర్యంలో నాలుగు రోజుల వేడుకల్లో భాగంగా రాజకీయ, సంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. రాజకీయ చర్చలు, సంగీత విభావరి, ప్రదర్శనలు, నాటకాలు తదితరాలు చేపట్టారు. ప్రముఖ గాయనీ గాయకులు పాల్గొన్నారు. 44 మంది కమ్యూనిస్టు యువజన సంఘాల ప్రతినిధులతో పాటు పలస్తీనా, ఇజ్రాయిల్, ఉక్రెయిన్, రష్యా నుంచి కమ్యూనిస్టు నాయకులు హాజరయ్యారు. ముగింపు సభలో గ్రీస్ కమ్యూనిస్టు పార్టీ (కేకేఈ) ప్రధాన కార్యదర్శి దిమిత్రిస్ కౌట్సోంబస్ ప్రసంగించారు. రాజకీయ పరిణామాలను వివరించారు. ప్రారంభ ఉపన్యాసాన్ని కేఎన్ఈ కేంద్ర సమితి కార్యదర్శి థోడోరిస్ కొట్సాంటిస్ చేశారు. ఒడిగిటిస్ ఉత్సవానికి 45 ఏళ్ల చరిత్ర ఉంది.

సర్వీస్ రోడ్డు కోసం రోడ్డెక్కిన రైతులు

విశాలాంధ్ర-పుత్తూరు: చిత్తూరు-తచ్చూరు ఎక్స్‌ప్రెస్ హైవే కోసం రైతాంగం స్వచ్ఛందంగా భూములు ఇస్తే... ఉపరితల రవాణా శాఖ అధికారులు రైతుల నోట్లో మట్టికొట్టి...వేడుక చూస్తున్నారని సీపీఐ కార్యదర్శి డా.కె.నారాయణ ధ్వజమెత్తారు. ఆదివారం నింద్ర మండలం పాదిరి వద్ద అధికారుల మొండి వైఖరికి నిరసనగా ఎక్స్‌ప్రెస్ హైవే పై రైతులు వంటా -వార్పు కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా నారాయణ మాట్లాడుతూ మూడు సంవత్సరాలకు మునుపు చిత్తూరు- తచ్చూరు ఎక్స్‌ప్రెస్ రహదారి కోసం రైతుల భూములను కారు చౌకగా కొట్టేయాలని ప్రయత్నిస్తే...సీపీఐ రైతు సంఘాల ఆధ్వర్యంలో పోరాడిన ఫలితంగానే ఎకరాకు రూ.18 లక్షల వరకు పొంద గలిగారని పేర్కొన్నారు. అయితే రైతులతో కుదిరిన అవగాహన మేరకు సర్వీస్ రోడ్డు వేయకుండానే నిబంధనలకు విరుద్ధంగా అడ్డగోలుగా రైతుల భూముల పక్కనే స్తంభాలు నాటేస్తున్నారని పేర్కొన్నారు.

రోడ్డు పక్కన ఎత్తైన గోడలు నిర్మిస్తే... రైతులు పంట పొలాలకి ఎలా వెళ్లాలని ప్రశ్నించారు.. అలాగే చెరువు నుండి పంట భూములకు కాలువలు తీయకుం డా రోడ్డు నిర్మిస్తున్నారని తెలిపారు. కరూర్ వద్ద ఊరి పక్క బ్రిడ్జి కట్టాల్సిన అవసరం ఉన్నా దానిని విస్మరించడం... కూలీల బతుకుపై కొట్టడమేనన్నారు. అడవి వైపున ఉన్న భూమిలో సాగు చేసు కోవాలన్నా, కట్టెలు, పశు వుల మేతకు వెళ్లాలన్నా... వారికి దినదిన గండమ పుతుందని తెలియజేశారు. సత్వరం కరూర్ వద్ద బ్రిడ్జి నిర్మించాలని డిమాండ్ చేశారు. రైతాంగ సమస్యలు పరిష్కారం అయ్యే వరకు ఉద్యమం కొనసాగిస్తామని రహదారిని దిగ్బంధిస్తామని హెచ్చరిం చారు. కరూర్ వద్ద కొండలు తవ్వి మట్టి అక్రమంగా తరలిస్తున్న ఘటనపై సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గసభ్యులు ఏ రామా నాయుడు, రైతు సంఘ నేత డాక్టర్ టి.జనార్ధన్. సీపీఐ చిత్తూరు, తిరుపతి కార్యదర్శులు ఎస్.నాగరాజు, పి.మురళి, ఇరు జిల్లాల సీపీఐ నేతలు చిన్ని రాజు, రాధాకృష్ణ, విశ్వనాథ్, రమాదేవి చంద్రరావు, రఘు, నగరి నియోజకవర్గ సీపీఐ కార్యదర్శి కోదండన్ వేలన్, భాషా, పుత్తూరు కార్యదర్శి మహేష్, రైతు సంఘ నాయ కులు చిరంజీవి నాయుడు, గోపాల్, కృష్ణారెడ్డి, రవి, పురుషోత్తం, సునీల్, ఏసీఎఫ్ గురుమూర్తి, జయచంద్ర తదితరులు పాల్గొన్నారు.

రైతుల ఆందోళన నేపథ్యంలో నగరి రూరల్ సీఐ ఆధ్వర్యాన పెద్ద ఎత్తున బందోబస్తు నిర్వహించారు. హైవేపై ఆందోళన నేపథ్యంలో జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ డా.నారాయణతో ఫోన్‌లో మాట్లాడారు. రోడ్డును పరిశీలించి రైతుల సమస్య పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.

115 రాకెట్లతో హెజ్బుల్లా దాడి

జెరూసలేం: ఇజ్రాయిల్‌కు, హెజ్బుల్లాకు మధ్య ఉద్రిక్తత పెరిగింది. ఆదివారం ఇజ్రాయిల్‌పై రాకెట్లతో హెజ్బుల్లా దాడి చేసింది. దాదాపు 115 రాకెట్లను గతంలో లక్ష్యంగా చేసుకొని ప్రాంతాలపైకి ప్రయోగించింది. వీటిలో కొన్ని ఉత్తర నగరమైన హైఫానూ చేరుకున్నట్లు తెలుస్తోంది. ఉత్త జెజ్‌రీల్ లోయలోని సైనిక విమానాశ్రయంతో పాటు గోలన్ హైట్స్, అప్పర్ గలిలీ ప్రాంతాలపై హెజ్బుల్లా దాడి చేసినట్లు ఇజ్రాయిల్ మీడియా పేర్కొంది. హైఫా దగ్గర భవనాలు దెబ్బతిన్నాయని, కార్లు తగలబడ్డాయని, నలుగురికి గాయాలయ్యాయని తెలిపింది. హెజ్బుల్లా రాకెట్లు పౌర క్షేత్రాలను లక్ష్యంగా చేసుకున్నట్లు ఇజ్రాయిల్ సైనిక ప్రకటన వెల్లడించింది. తమ రక్షణ వ్యవస్థలు ఆయా ప్రాంతాల్లో అత్యంత అప్రమత్తంగా ఉండి, ముప్పును నివారించేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలిపింది. ఈ దాడులకు హెజ్బుల్లా బాధ్యత వహించింది. ఆయుధ సంస్థ రఫేల్‌కు చెందిన సైనికపరమైన పారిశ్రామిక కంపెక్స్‌ను లక్ష్యంగా చేసుకున్నట్లు తెలిపింది. మంగళ, బుధవారాల్లో ఇజ్రాయిల్ జరిపిన కిరాతక మారణహోమానికి ప్రతీకారంగా ఈ దాడులు చేసినట్లు వెల్లడించింది. మరోవైపు లెబనాన్‌పై ఇజ్రాయిల్ దాడులు ఆగలేదు. హెజ్బుల్లాపై దాడుల తీవ్రతను మరింతగా పెంచుతామని ఇజ్రాయిల్ సంకల్పించింది. లెబనాన్‌పై వైమానిక దాడులను కొనసాగిస్తోంది. పేజర్లు, వాకీటాకీల పేలుళ్లకు ఇజ్రాయిల్ పాల్పడగా దాదాపు 40 మంది ప్రాణాలు కోల్పోయారు.

బీజేపీ పాలనలో దళితులకు రక్షణ కరువు

(మొదటిపేజీ తరువాయి)

తెలిపింది. ఎస్సీ, ఎస్టీలపై దురాగతాల నియంత్రణ చట్టం కింద నమోదైన నేరాల మీద ఈ నివేదిక విడుదల చేసింది. 2022లో ఎస్సీలపై నేరాలకు సంబంధించి 51,656 కేసులు నమోదయ్యాయి. ఉత్తరప్రదేశ్‌లోని యోగి పాలనలో దళితులపై అఘాయిత్యాల కేసులు ఎక్కువగా నమోదవుతున్నాయి. ఎనిమిదిన్నర వేలకు పైగా కేసులు నమోదైన రాజస్థాన్ రెండో స్థానంలో ఉంది. నగటున రోజుకు 12 మంది దళిత మహిళలు లైంగికదాడికి గురవుతున్నట్టు గణాంకాలు కూడా చెబుతున్నాయి. యూపీలో 12,287 కేసులు (23.78శాతం) నమోదయ్యాయి. రాజస్థాన్‌లో 8,651 (16.75శాతం), మధ్యప్రదేశ్‌లో 7,732 (14.97శాతం), బీహార్‌లో 6,799 (13.16శాతం), ఒడిశాలో 3,576 (6.93శాతం), మహారాష్ట్రలో 2,706 (5.24శాతం) కేసులు చొప్పున నమోదయ్యాయి. 13 రాష్ట్రాల్లో 9,735 కేసులు ఎస్టీలపై నేరాలకు సంబంధించినవి కాగా అధికంగా 2,979 (30.61శాతం) కేసులు మధ్యప్రదేశ్‌లో, 2,498 (25.66శాతం) కేసులు రాజస్థాన్‌లో, ఒడిశాలో 773 (7.94శాతం), మహారాష్ట్రలో 691 (7.10శాతం), ఆంధ్రప్రదేశ్‌లో 499 (5.13శాతం) కేసులు చొప్పున నమోదైనట్లు ప్రభుత్వ నివేదిక వెల్లడించింది. ఎస్సీలపై నేరాల 60.38శాతం కేసుల్లో చార్జిషీట్లు దాఖలు కాగా 2022 ముగిసే నాటికి 17,166 కేసులు విచారణ దశలో ఉన్నాయి. అలాగే ఎస్టీలపై నేరాలకు సంబంధించి చార్జిషీట్లు దాఖలైన కేసులు 63.32శాతంగా ఉంటే, 14.71 శాతం కేసులు పరిష్కారమయ్యాయి. 2022 ముగిసే నాటికి 2,702 కేసులు విచారణ దశలో ఉన్నాయి. అట్రాసిటీ చట్టం కింద కన్విక్షన్ రేటు 2022లో 32.4శాతానికి పడిపోయింది. 2020లో అది 39.2శాతంగా ఉంది. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద ప్రత్యేక కోర్టులు సముచితంగా లేవని నివేదిక పేర్కొంది. 13 రాష్ట్రాల్లోని 498కుగాను 194 జిల్లాల్లో మాత్రమే ప్రత్యేక కోర్టులు ఉన్నాయి. అట్రాసిటీ కేసులు ఎక్కువగా నమోదయ్యే ఉత్తరప్రదేశ్‌లోనే 'నో అట్రాసిటీ ప్రోన్' ప్రాంతాలు గుర్తించలేదు. అయితే కులాధారిత హింస నివారణకు ఈ జిల్లాల్లో తగు చర్యలు తీసుకోవడం, బలహీన వర్గాలకు పటిష్ఠ భద్రత కల్పించడానికి హామీ ఇవ్వడం అవసరమని నివేదిక నొక్కిచెప్పింది. ఎస్సీ/ఎస్టీ రక్షణ సెల్స్‌ను ఆంధ్రప్రదేశ్, అసోం, బీహార్, చత్తీస్‌గఢ్, గుజరాత్, హర్యానా, హిమచల్‌ప్రదేశ్, జార్ఖండ్, కర్నాటక, కేరళ, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, మేఘాలయ, మిజోరం, ఒడిశా, పంజాబ్, రాజస్థాన్, సిక్కిం, తమిళనాడు, తెలంగాణ, త్రిపుర, ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్, పశ్చిమ బెంగాల్, అండమాన్ & నికోబర్ ద్వీపాలు, చండీగఢ్, ఢిల్లీ ఎన్‌సీటీ, జమ్మూకశ్మీర్, లడాఖ్, పుదుచ్చేరిలో ఏర్పాటు చేసినట్లు నివేదిక పేర్కొంది. అలాగే బీహార్, చత్తీస్‌గఢ్, జార్ఖండ్, కేరళ, మధ్యప్రదేశ్ రాష్ట్రాల్లో ఎస్సీలు, ఎస్టీలపై నేరాలను ఫిర్యాదు చేసేందుకు ప్రత్యేక పోలీసు స్టేషన్లు ఉన్నాయి.

పేదల సొంతింటి కల నెరవేరేనా?

(మొదటిపేజీ తరువాయి)

నవరత్నాలు-పేదలందరికీ ఇళ్లు పేరుతో మొదటి దశలో 9,90,476 మంది లబ్ధిదారులను ఎంపిక చేశారు. వీరి కోసం 16,196 జగనన్న కాలనీలను ఏర్పాటు చేశారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు 70శాతం- 30శాతం ఖర్చు భరించే విధంగా ఒక్కొక్క లబ్ధిదారునికి 48 గజాల స్థలాన్ని, ఇంటి నిర్మాణానికి రూ.1 లక్ష80వేల నగదు అందజేశారు. 2025 మార్చి నెలలోగా పీఎంఏవై-1.0 కాలపరిమితి ముగుస్తుంది.ఈ లోగా గృహనిర్మాణాలు పూర్తి చేసి లబ్ధిదారులకు అందజేయాలి. ప్రభుత్వ సహాయంతో పాటు బ్యాంకుల రుణాలు కూడా కూడా ఇప్పించాలి. వీటితోపాటు గృహ నిర్మాణానికి అవసరమైన ఐరన్, ఇసుక ,సిమెంట్ వంటి నిర్మాణ సామగ్రిని మార్కెట్ రేట్ కంటే తక్కువ రేటుకు పంపిణీ చేయాలని ప్రభుత్వం జీవోలలో పేర్కొంది. అలాగే జగనన్న కాలనీలలో రోడ్లు, డ్రైన్లు, తాగునీరు, కరెంట్ సరఫరా వంటి సౌకర్యాలు ఏర్పాటు చేయాల్సి ఉంది. ఈ రకంగా పేదలందరికీ ఇళ్లు విషయంలో పాలకుల మాటలు కోటలు దాటినా... ఇళ్లు మాత్రం పునాదుల దశను నేటికీ దాటలేదు.

లక్ష్యం ఘనం...

కొద్ది రోజుల క్రితం ప్రకటించిన అధికారిక లెక్కలు వివరాలు పరిశీలిస్తే...ఈ ఏడాది సెప్టెంబర్ 15 వరకు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 26 జిల్లాల్లో 20,48, 276ఇళ్లు పూర్తి చేయాలని లక్ష్యం కాగా 6,82,056 ఇళ్ల నిర్మాణం మాత్రమే పూర్తయింది. 13,66 ,214 ఇళ్ల నిర్మాణం అసంపూర్తిగానే ఉంది. వీటిలో 2,38,322 ఇళ్ల నిర్మాణం అసలు ప్రారంభించనే లేదు. 3, 32, 615ఇళ్లు పునాదుల స్థాయికి కూడా చేరలేదు. 3,19,545ఇళ్లు పునాదుల స్థాయిలో ఉన్నాయి. 1,44,397 ఇళ్లు రూఫ్ లెవెల్ లో ఉన్నాయి. 1,26,519 ఇళ్లు రూఫ్ కంప్లీటెడ్ లెవెల్ లో ఉన్నాయి. దీన్ని బట్టి చూస్తే కేవలం 35శాతం ఇళ్లు మాత్రమే ఐదేళ్ల కాలంలో పూర్తి అయ్యాయి. ఇంకా 65శాతం ఇళ్లు వివిధ దశలలో ఉన్నట్లు స్పష్టమవుతోంది. గత కొంతకాలంగా జగనన్న కాలనీలలో ఇళ్ల నిర్మాణ పనులు నిలిచిపోయాయి. ప్రభుత్వ సహాయం రూ.1 లక్ష80వేలు కనీసం పునాది ఖర్చులకు కూడా సరిపోదన్నది బహిరంగ రహస్యం. కొంతమంది సొంతంగా పెట్టుబడులు పెట్టుకుని ఇళ్ల నిర్మాణాన్ని పూర్తి చేసుకున్నారు.

అసంపూర్తిగా నిర్మాణాలు

పేద ,బడుగు, బలహీన వర్గాలకు చెందిన ప్రజలు పెట్టుబడులు పెట్టలేక ఇంటి నిర్మాణాలను సగం లోనే వదిలేశారు. అద్దె ఇళ్లలోనే ఉంటున్నారు.ఈ కారణంగా క్షేత్రస్థాయిలో ఎక్కువ చోట్ల పునాది దాటని ఇళ్లే దర్శనమిస్తున్నాయి. రహదారులు, నీరు,డ్రైన్లు, విద్యుత్ సదుపాయం గురించి అడగక పోవడమే మంచిదని ఆ ప్రాంతాల ను పరిశీలిస్తే స్పష్టంగా తెలుస్తోంది.వివిధ దశలలో ఉన్న ఇళ్ల ముందు తుమ్మ చెట్లు, పిచ్చి చెట్లు పెరిగిపోయి జగనన్న కాలనీలు కీకారణ్యాన్ని తలపిస్తున్నాయి. గృహ నిర్మాణాలు అంతంతమాత్రంగా ఉండట ంతో ప్రస్తుతం ఈ కాలనీలన్నీ అసాంఘిక కార్యకలాపాలకు నిలయాలుగా మారాయి. నాలుగేళ్ల క్రితం జిల్లా కేంద్రమైన ఏలూరు శివారు పోణంగి గ్రామంలో 250 ఎకరాల్లో అతిపెద్ద లే అవుట్ ను రూపొందించారు. ఈ గ్రామంలో 11,050 ఇళ్లు మంజూరయ్యాయి.

ప్రస్తుతం ఈ కాలనీలో 4 -5 ఇళ్లు మాత్రమే ఉపయోగంలో ఉన్నాయి. కొన్నింటికి స్లాబులు పూర్తయ్యాయి. కొన్ని స్లాబ్ వరకు పూర్తి చేసి సిమెంట్ గడపలు , కిటికీలు అమర్చి ఉన్నాయి. చాలావరకు ఇళ్లు పునాది దశలోనే ఆగిపోయాయి. రోడ్లు, డ్రైన్లు, తాగునీరు,విద్యుత్ సరఫరా వంటి మౌలిక సౌకర్యాలు లేనేలేవు. కాగా రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన విధంగా అన్ని ఇళ్లకు కేంద్ర ప్రభుత్వం తన వంతు నిధులను పూర్తిగా చెల్లించినట్లు తెలుస్తోంది. 2025 మార్చిలోగా రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన విధంగా అన్ని ఇళ్ల నిర్మాణాలు పూర్తి చెయ్యాల్సి ఉంది. లేకపోతే సుమారు రూ.7వేల కోట్లు కేంద్ర ప్రభుత్వానికి రాష్ట్ర ప్రభుత్వం వెనక్కి చెల్లించాల్సిన పరిస్థితి ఉందని సమాచారం. రాష్ట్ర ప్రభుత్వం వెనక్కి చెల్లించకపోతే కేంద్రం నుంచి విడుదల అయ్యే గ్రాంట్ ల నుంచి మినహాయించుకో వచ్చు. మొత్తం మీద తమకు ఉచితంగా ఇళ్లు నిర్మించి ఇస్తామని పాలకులు అరచేతిలో వైకుంఠం చూపించి, మధ్యలోనే వదిలేశారని లబ్ధిదారులు గగ్గోలు పెడుతున్నారు. కూటమి ప్రభుత్వం సగం లో మిగిలిపోయిన ఈ ఇళ్ల నిర్మాణానికి ఎటువంటి చర్యలు తీసుకుంటుందో వేచి చూడాలి.

శ్రీలంక అధ్యక్షుడిగా లెఫ్ట్ నేత

(మొదటిపేజీ తరువాయి)

ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. 'అమరుల త్యాగాలు, పోరాట స్ఫూర్తితో ముందుకెళుతూ వారి ఆశయ సాధనకు కట్టుబడి పనిచేద్దాం. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకోవడమే కాకుండా వారి ఆశలు ఆకాంక్షలను నిజం చేద్దాం. కలిసికట్టుగా శ్రీలంక చరిత్రను తిరగరాద్దాం' అని దిశానాయకే పిలుపునిచ్చారు. శ్రీలంకకు కొత్త పొద్దు పొడిచిందన్నారు. సిన్హలీలు, తమిళులు, ముస్లింలు, మొత్తంగా శ్రీలంక ప్రజలు ఐక్యంగా, ఉమ్మడి విజన్‌తో ముందుకెళ్లినప్పుడే గొప్ప విజయాలు సాధ్యమని దిశానాయకే అన్నారు. కలిసి కట్టుగా దేశ భవిష్యత్‌ను నిర్మిద్దామని పిలుపునిచ్చారు. శ్రీలంక అధ్యక్ష ఎన్నికలు శనివారం ప్రశాంతంగా జరిగి 75శాతం పోలింగ్ నమోదైంది. అభ్యర్థుల్లో ఎవరికీ 50శాతం కంటే ఎక్కువ ఓట్లు రాని క్రమంలో ప్రాధాన్యత ఓట్ల (ప్రిఫరెన్స్ కౌంట్) లెక్కింపునకు ఎన్నికల అధికారులు చేపడతారు. శ్రీలంకలో ఇదే జరిగింది. గతంలో ఇలా జరగలేదని ఎన్నికల సంఘం చైర్మన్ ఆర్ఎల్ఏఎం రత్ననాయకే తెలిపారు. అనుర కుమార దిశానాయకే విజేతగా నిలవగా ప్రతిపక్ష నాయకుడు -సమగి జన బాలవేగయా (ఎస్‌జేపీ) అభ్యర్థి సంజిత్ ప్రేమదాస 32.76శాతం ఓట్లతో రెండవ స్థానంలో నిలిచారన్నారు. ప్రస్తుత అధ్యక్షుడు రణిల్ విక్రమసింఘె స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసిన ఆయనకు 17.27శాతానికి మించి ఓట్లు రాలేదు. మాజీ అధ్యక్షుడు మహీంద్ర రాజపక్స తనయుడు నమల్‌కు 2.4శాతం ఓట్లు మాత్రమే పోలయ్యాయి. ఇదిలావుంటే అధ్యక్ష ఎన్నికల్లో 17.1 మిలియన్ల (1.7కోట్లు) మంది ఓటేశారు. 38 మంది పోటీ చేశారు. పోలింగ్ ముగిసిన వెంటనే పోస్టల్ ఓట్ల లెక్కింపు, ఆపై సాధారణ ఓట్ల లెక్కింపు జరిగాయి. శానాయకేను ఏకేడీగా వ్యవహరిస్తారు.

బంగాళాఖాతంలో అల్పపీడనం

(మొదటిపేజీ తరువాయి)

ఈ రెండు సర్క్యులేషన్లు అల్పపీడనానికి దారితీస్తాయని అంచనా వేసింది. దీని ఫలితంగా తెలంగాణ, రాయలసీమ, కోస్తాంధ్ర, యానాంలలో వారం రోజుల పాటు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అధికారులు తెలియజేశారు. సోమవారం ఆంధ్రప్రదేశ్, యానాంలో, ఈ నెల 23 నుంచి 25 వరకు తెలంగాణలో, 24, 25న రాయలసీమలో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. కాగా ఆదివారం సాయంత్రం ఉత్తరాంధ్ర జిల్లాల్లో అనేక చోట్ల చిరుజల్లులు కురిశాయి.

మారిన ఆప్ వ్యూహం

(మొదటిపేజీ తరువాయి)

శైలిని అనుసరించారు. ఆర్ఎస్ఎస్ అధ్యక్షుడు మోహన్ భగవత్ నుంచి ఐదు సమాధానాలను డిమాండ్ చేశారు. ఆయన ప్రశ్నలు రాజకీయంగా సున్నిత అస్త్రాలుగా కనిపించినప్పటికీ భగవత్‌ను తెరమీదకు తేవడంతో అసాధారణ పంథాను కేజ్రీవాల్ అనుసరించడం, రాజకీయ వ్యూహాన్ని మార్చడం అర్థమవుతోంది.

బీజేపీ పెట్టిన పదవీ విరమణ నిబంధన ఎల్‌కే అద్వాణీ తరహాలో మోదీకీ వర్తిస్తుందా? 75ఏళ్లకు రిటైరయ్యేందుకు ఆయన సిద్ధమా? ముందు అవినీతిపరులుగా ముద్రవేసిన నేతలనే తర్వాత పార్టీలో చేర్చుకోవడంపై మీరు ఏమంటారు? బీజేపీ రాజకీయంతో ఏకీభవిస్తారా? తమ పార్టీకి ఆర్ఎస్ఎస్ అవసరం లేదని బీజేపీ అధ్యక్షుడు జేపీ నడ్డా అన్నప్పుడు మీకు ఎలా అనిపించింది? వంటి ప్రశ్నలకు భగవత్ సమాధానం చెప్పాలని కేజ్రీవాల్ డిమాండ్ చేశారు. ఆర్ఎస్ఎస్ నుంచి పుట్టిన బీజేపీ తీరు నచ్చుతుందా, అద్వాణీ వలే మోదీ 75ఏళ్లకు రిటైర్ అవుతారంటారా అని భగవత్‌ను ప్రశ్నించారు. తల్లినే ఎదిరించే స్థాయికి కొడుకు ఎదిగాడా అని ప్రధాని మోదీ వైఖరిని ఉద్దేశించి కేజ్రీవాల్ వ్యాఖ్యానించారు. ఆప్ నేతలను అవినీతిపరులుగా ముద్రవేసేందుకు మోదీ కుట్రపన్నారని ఆరోపించారు. రాజకీయాల్లో మార్పు తేవాలన్న ఉద్దేశంతోనే రాజకీయాల్లోకి వచ్చాను తప్ప పదవులను ఆశించి కాదని కేజ్రీవాల్ అన్నారు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టి పదేళ్లు అవుతున్నా ఢిల్లీలో సొంతిల్లు లేదని చెప్పారు. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు తనకు అగ్నిపరీక్ష వంటివన్నారు. తాను నిజాయితీపరుడినని నమ్మితేనే తనకు ఓటు వేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. అవినీతిపరుడని అనుకుంటే ఓటు వేయవద్దన్నారు. అవినీతి ఆరోపణలతో కలత చెంది పదవికి రాజీనామా చేశానని, పదేళ్లలో గౌరవ మర్యాదలు సంపాదించానే తప్ప డబ్బు కాదని చెప్పారు. నవరాత్రి సమయంలో 'శ్రాద్' సమయం ముగిశాక ముఖ్యమంత్రి అధికార నివాసాన్నీ ఖాళీ చేస్తానన్నారు. తనకు వసతి కల్పించే వారితో కలిసి ఉంటానని ప్రకటించారు. 'నేను దొంగనా లేక నన్ను జైలుకు పంపిన వారు దొంగలా? ఉచితంగా బస్సు, విద్యుత్, వైద్యం, విద్య వంటి సౌకర్యాలు బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఉన్నాయా?' అని సభనుద్దేశించి కేజ్రీవాల్ ప్రశ్నించారు. ఇదిలావుంటే కేజ్రీవాల్ సభకు భారీ సంఖ్యలో మద్దతుదారులు హాజరయ్యారు. కేజ్రీవాల్‌పై తమ నమ్మకాన్ని చాటుకున్నారు. 'మాలో ఒకరు కేజ్రీవాల్' అంటూ బ్యానర్లు ప్రదర్శించారు. సభా ప్రాంగణం ఆప్‌కు చిహ్నమైన నీలం, పశు పు రంగులతో నిండిపోయింది. కేజ్రీవాల్ వేదికపైకి వెళ్లినప్పుడు 'నా రుకేగా, నా ఝుకేగా' (తగ్గేదే లేదు.. తలొగ్గేదే లేదు) అన్న నినాదం మార్మోగింది. 'హమారే కేజ్రీవాల్ ఇమాందార్ హై' (మా కేజ్రీవాల్ నిజాయితీపరుడు) పోస్టర్లు కనిపించాయి. ఇదిలావుంటే జంతర్ మంతర్ వద్ద కేజ్రీవాల్ సభ జరుగుతుండగానే ఆయనపై అవినీతి ఆరోపణలు చేస్తూ కన్నాట్ ప్లేస్, రాజ్‌ఘాట్ వద్ద బీజేపీ అధ్వర్యంలో ఆందోళనలు జరిగాయి.

ఏపీ టెట్ పరీక్షల షెడ్యూలు

(మొదటిపేజీ తరువాయి)

విడుదలయ్యాయి. అభ్యర్థులు ఏపీటెట్.ఏపీసీఎఫ్ఎస్ఎస్.ఇన్ వెబ్‌సైట్‌లోకి వెళ్లి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. 11, 12 తేదీల్లో సెలవు దినాలు కావడంతో పరీక్షలు ఉండవు. రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 4.27లక్షల మందికిపైగా అభ్యర్థులు దరఖాస్తు చేశారు. టెట్‌కు గట్టి పోటీ ఏర్పడింది. అభ్యర్థులు ఎంచుకున్న జిల్లాల ఆప్షన్లకు అనుగుణంగా ప్రాధాన్యతాక్రమంలో పరీక్షా కేంద్రాలను ఎంపిక చేశారు. ఇప్పటికే ఏపీ డీఎస్సీకి 16 వేల పోస్టులు ప్రకటించిన నేపథ్యంలో టెట్ పరీక్షలకు ప్రాధాన్యత ఏర్పడింది. టెట్‌లో 20 శాతం వెయిటేజీ, డీఎస్సీ పరీక్షలో వచ్చిన మార్కులను కలిపి అభ్యర్థులను ఎంపిక చేస్తారు. దీంతో గతంలో టెట్‌లో అర్హత పొందిన అభ్యర్థులు మళ్లీ అదనంగా వెయిటేజీ పెంచుకునేందుకుగాను టెట్‌కు దరఖాస్తు చేసుకున్నారు. రాష్ట్రంలోని జిల్లాలతోపాటు హైదరాబాద్‌లోనూ టెట్ పరీక్షా కేంద్రాలను ప్రతి రోజూ రెండు సెషన్లుగా ఏర్పాటు చేశారు.

తేదీ	సెషన్-1	సెషన్ -2
అక్టోబరు 3	పేపర్-2ఏ లాంగ్వేజ్ తెలుగు, కన్నడం, తమిళం, ఒరియా, ఉర్దూ, సంస్కృతం	పేపర్-2ఏ (తెలుగు)
అక్టోబరు 4:	పేపర్-2ఏ లాంగ్వేజ్ లిటరేచర్ తెలుగు	పేపర్-2ఏ(లాంగ్వేజ్) ఇంగ్లీషు
అక్టోబరు 5	పేపర్-2ఏ-లాంగ్వేజ్ ఇంగ్లీషు +పేపర్-2ఏ లాంగ్వేజ్ హిందీ	పేపర్ 2ఏ లాంగ్వేజీ హిందీ
అక్టోబరు 6:	ఎస్జీటీ పేపర్1-ఏ+పేపర్ 1బి	ఎస్జీటీ పేపర్-1ఏ
అక్టోబరు 7:	ఎస్జీటీ పేపర్-1ఏ	ఎస్జీటీ పేపర్-1ఏ
అక్టోబరు 8:	ఎస్జీటీ పేపర్-1ఏ	ఎస్జీటీ పేపర్-1ఏ
అక్టోబరు 9	ఎస్జీటీ పేపర్-1ఏ	ఎస్జీటీ పేపర్-1ఏ
అక్టోబరు 10:	ఎస్జీటీ పేపర్-1ఏ	ఎస్జీటీ పేపర్-1ఏ
అక్టోబరు 13:	ఎస్జీటీ పేపర్-1ఏ	ఎస్జీటీ తెలుగు, హిందీ, కన్నడ, ఒరియా, తమిళం, ఉర్దూ విభాగాల్లో పరీక్షలు
అక్టోబరు 14:	ఎస్జీటీ తెలుగు	పేపర్-2-ఏ (మేథమేటిక్స్ అండ్ సైన్స్)
అక్టోబరు 15:	పేపర్-2ఏ మేథమేటిక్స్ అండ్ సైన్స్	పేపర్-2-ఏ మేథమేటిక్స్ అండ్ సైన్స్
అక్టోబరు 16:	పేపర్-2ఏ మేథమేటిక్స్ అండ్ సైన్స్	పేపర్ 2-ఏ, ఎంఎస్ విభాగాల్లో తెలుగు, హిందీ, ఉర్దూ, కన్నడం, ఒరియా,తమిళం, ఇంగ్లీషు
అక్టోబరు 17:	పేపర్-2-ఏ (మేథమేటిక్స్, సైన్స్)	పేపర్-2(ఏ) మేథమేటిక్స్ అండ్ సైన్స్
అక్టోబరు 18:	పేపర్-2-ఏ మేథమేటిక్స్ అండ్ సైన్స్	పేపర్-2ఏ సోషల్ స్టడీస్
అక్టోబరు 19:	పేపర్-2ఏ సోషల్‌స్టడీస్	పేపర్-2ఏ సోషల్ స్టడీస్
అక్టోబరు 20:	పేపర్-2ఏ సోషల్ స్టడీస్ తెలుగు, ఉర్దూ, హిందీ, కన్నడ, ఒరియా, తమిళం, ఇంగ్లీషు విభాగాలు	పేపర్-2-ఏ సోషల్ స్టడీస్
అక్టోబరు 21:	పేపర్-2ఏ సోషల్ స్టడీస్	పేపర్-2బి

అరకొర సాయం

(మొదటిపేజీ తరువాయి)

నెలల మారిటోరియం విధించాలని డిమాండ్ చేస్తున్నారు. నగరంలో ఆటోలు నడిపే డ్రైవర్లు అత్యధికంగా సింగ్‌నగర్ ప్రాంతంలోనే జీవిస్తుంటారు. ప్రభుత్వం మాత్రం అన్ని రకాల వాహనాలు...10వేలు మాత్రమే ఉన్నట్లు నష్టం గణనలో లెక్కించింది. అందులో ఇప్పటికే ఆరువేల అన్ని రకాల వాహనాలకు బీమా కల్పించినట్లు తెలిపింది.

ఇందులో ఆటోలు ఎన్ననేదీ లెక్కతేల్చలేదు. విజయవాడ నగరం పరిసర ప్రాంతాల్లో చాలా అద్దె ఆటోలు నడుస్తున్నాయి. ఈనెల 25 నుంచి వరద బాధితులకు నష్టపరిహారం అందజేసేందుకు సీఎం చంద్రబాబు అధ్యక్షతన జరిగిన సమీక్షలో కీలక నిర్ణయం తీసుకున్నారు. వరద నీట మునిగిన ద్విచక్ర వాహనాలకు రూ.మూడు వేలు, మూడు చక్రాల వాహనాలకు రూ.10 వేల నష్టపరిహారంగా ప్రభుత్వం నిర్ణయించింది.

ఈ నష్టం అంచనాలు చాలవని, దెబ్బతిన్న ఆటో డ్రైవర్లకు ఇన్సూరెన్స్‌తో సంబంధం లేకుండా రూ.30 వేల నష్టపరిహారం ఇవ్వాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఇన్సూరెన్స్ థర్డ్ పార్టీకి అయితే రూ.ఏడు వేలు, పూర్తిస్థాయి ఇన్సూరెన్స్ అయితే రూ.10వేలు ఇవ్వాలని ఆటో యజమానులు కోరుతున్నారు.

అమెరికాతో కలిసి పనిచేస్తాం

(మొదటిపేజీ తరువాయి)

పాటు కీలక రంగాల్లో సహకారాన్ని మరింత పెంచుకోవాలని బైడెన్, మోదీ సంకల్పించారు. జీఎఫ్ కోల్‌కతా పవన్ సెంటర్ తయారు చేసిన గ్లోబల్ ఫౌండ్రీస్ (ఎఫ్) ద్వారా సుస్థిరమైన, సురక్షితమై, స్వీయసమృద్ధి అయిన సెమీకండక్టర్ సరఫరా గొలుసుల ఏర్పాటుకు సమష్టి కృషి చేయాలని ఇద్దరు నేతల మధ్య ఏకాభిప్రాయం కుదిరింది. ఇంటర్నేషనల్ టెక్నాలజీ సెక్యూరిటీ & ఇన్నోవేషన్ (ఐటీఎస్ఐ) నిధితో ఎలక్ట్రానిక్స్, ఐటీ శాఖ, భారత సెమీకండక్టర్ మిషన్, అమెరికా మధ్య కొత్త వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని అధినేతలు వేడుక చేసుకున్నారని అధికార ప్రకటన తెలిపింది. అంతర్జాతీయ ఆటోమొబైల్ మార్కెట్లు, సరఫరా గొలుసుల పటిష్ఠతకు ఇద్దరు కట్టుబడి ఉన్నట్లు పేర్కొంది.

ఐపీఈఎఫ్ ఒప్పందాలు-డ్రోన్ల కొనుగోళ్లు

ప్రధాని నరేంద్రమోదీ అమెరికా పర్యటన సందర్భంగా మూడు కీలక ఇండో-పసిఫిక్ ఆర్థిక కార్యాచరణ (ఐపీఈఎఫ్)తో పాటు అవగాహన ఒప్పందాలు, డ్రగ్ విధాన కార్యచరణపైనా ఒప్పందం జరిగాయి. విల్మింగ్టన్‌లో జరిగిన భారత్-అమెరికా ద్వైపాక్షిక సమావేశంలో భాగంగా రెండు దేశాల మధ్య అనేక అంశాలపై అవగాహన కుదిరినట్లు ఎంఈఏ అధికార ప్రతినిధి రణదీప్ జైశ్వాల్ 'ఎక్స్'లో తెలిపారు. ఈ ఏడాది ఆగస్టులో జరిగిన అమెరికా-భారత్ కేన్సర్ చర్చలను ఇద్దరు అధినేతలు స్వాగతించారు. కేన్సర్‌పై పోరులో పురోగతికి ఇది దోహదమైనట్లు తెలిపారు. ఫార్మా సరఫరా గొలుసులపై సహకార బంధాన్ని మరింత పటిష్ఠం చేసుకుంటూ అమెరికా, భారత్, ఆర్‌టకే, జపాన్, ఈయూ మధ్య బయో5 భాగస్వామ్యాన్ని కొనియాడారు. అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన కిల్లర్ డ్రోన్‌లను అమెరికా నుంచి భారత్ కొనుగోలు చేయనుంది. ఈ ఒప్పందాన్ని మోదీ, బైడెన్ ఖరారు చేశారు. అమెరికా నుంచి 16 స్కై గార్డియన్, 15 సీ గార్డియన్ డ్రోన్‌లను భారత్ కొనుగోలు చేయబోతోంది. ఈ డ్రోన్ల ధర దాదాపు 3 బిలియన్ డాలర్లు.

లడ్డూ కల్తీపై సిట్ దర్యాప్తు

(మొదటిపేజీ తరువాయి)

క్షేత్రంలో వైసీపీ ప్రభుత్వం అపవిత్ర కార్యక్రమాలు చేపట్టిందని ఆరోపించారు. ఉండవల్లిలోని నివాసంలో చంద్రబాబు ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ, గత వైసీపీ ప్రభుత్వ పాలనపై తీవ్ర విమర్శలు చేశారు. ఎంతో పవిత్రమైన శ్రీవారి ప్రసాదంలో జంతుకొవ్వు వినియోగించారని, లడ్డూ ప్రసాదాన్ని అపవిత్రం చేసి ప్రజల మనోభావాలను దెబ్బతీశారని మండిపడ్డారు. వైసీపీ ప్రభుత్వం శ్రీవారినీ వదల్లేదని అన్నారు. తిరుమలలో ఆగస్టు 15న జరిగిన తప్పున ఇప్పటికే యాగం చేశారన్నారు. టీటీడీ ఆగమ సలహా మండలి శాంతి హోమం నిర్వహించాలని నిర్ణయించిందన్నారు. సోమవారం ఉదయం 6 గంటల నుంచి 10 గంటల వరకు శాంతి హోమం, పంచగవ్యప్రోక్షణ చేస్తారని తెలిపారు. తిరుమల అన్నదానంలో భోజనం చేస్తేనే ఓ ప్రత్యేక అనుభూతి కలిగేలా కూటమి ప్రభుత్వంలో కార్యక్రమాలు చేపట్టామని చంద్రబాబు చెప్పారు. తిరుమల ప్రక్షాళనకు దేవుడు తనకు ఒక అవకాశం ఇచ్చారని, శ్యామలరావుకు చెప్పి, అందుకనుగుణంగా పనిచేయాలని ఈవోగా నియమించినట్లు వివరించారు. తిరుమల లడ్డూ అక్రమాలపై ఐజీ, ఆపై స్థాయి అధికారితో సిట్ ఏర్పాటు చేస్తామని, దాని నివేదిక ఆధారంగా చర్యలు తీసుకుంటామని స్పష్టంచేశారు. స్వామి వారి పవిత్రతను ఎవరూ మలినం చేయలేరని, మొత్తం ప్రక్షాళన చేసి తిరుమలకు పూర్వవైభవం తీసుకువస్తామని చంద్రబాబు చెప్పారు. ప్రపంచ వ్యాప్తంగా తిరుమలకు ఎంతో విశిష్టత ఉందని చెప్పారు. స్వామి మహత్యం ఉన్నందునే ఎంతో మంది లడ్డూని కాపీ చేయాలనుకున్నా చేయలేకపోయారని చెప్పారు. అంతటి విశిష్టత ఉన్న లడ్డూ తయారీకి వాడే పదార్థాలకు రివర్స్ టెండరింగ్ పెట్టి నాణ్యతను దెబ్బతీశారన్నారు. నాసిరకం వారికి గేట్లు తెరచినట్లుగా రివర్స్ టెండరింగ్ నిబంధనలు మార్చేశారని, ఫలితంగా ప్రధాన సంస్థలేవీ టెండర్లో పాల్గొనలేకపోయాయని అన్నారు. అన్యమతస్తులను టీటీడీ చైర్మన్‌గా చేశారని, తప్పు చేసిన వారి అకౌంట్లను ఎప్పటికప్పుడు స్వామి వారు సెటిల్ చేస్తారని, అది ఆయన మహత్యం అని సీఎం అన్నారు. నాటి ముఖ్యమంత్రి రాజశేఖర్‌రెడ్డి ఏడు కొండలను రెండు కొండలు అంటేనే ఎంతో పోరాటం చేశామని గుర్తుచేశారు. తనకు వ్యక్తిగతంగానూ తిరుమల శ్రీవారంటే చిన్నప్పటి నుంచి ఎంతో నమ్మకమని సీఎం చెప్పారు. టీటీడీ ప్రసాదం మంచి వాసనతో ఉంటుందని, తిరుమల వంటలు రుచికరంగా ఉంటాయని చెప్పారు. తిరుమల లడ్డూకు చాలా డిమాండ్ ఉంటుందని, ఒక్కో లడ్డూకు 40గ్రాముల ఆవునెయ్యి వాడతారని చెప్పారు. స్వామి వారి ప్రసాదాన్ని ఎవరూ కూడా కాపీ చేయడానికి వీలు లేదని, అలాంటి ప్రత్యేకత ఉండే వెంకటేశ్వర స్వామి దగ్గర వైసీపీ అధికారంలోకి రాగానే ఇష్టానుసారంగా చేశారని, కొండపై వ్యాపారాలు చేశారని మండిపడ్డారు. అన్యమతస్తులను టీటీడీ చైర్మన్‌గా చేశారని, రాజకీయ కేంద్రంగా టీటీడీని వాడుకున్నారని సీఎం చెప్పారు. తిరుమల లడ్డూ నాణ్యత, సువాసనలో ఎంతో విశిష్టత ఉందన్నారు. స్వామి వారి మహత్యం ఉంది కాబట్టే ఎంతో మంది లడ్డూని కాపీరైట్ చేయాలనుకున్నా చేయలేకపోయారని, అంతటి విశిష్టత ఉన్న లడ్డూకి వాడే పదార్థాలకు రివర్స్ టెండరింగ్ పెట్టి నాణ్యత దెబ్బతీశారని మండిపడ్డారు.

చిరంజీవికి విశిష్ట గౌరవం

(మొదటిపేజీ తరువాయి)

చోటు దక్కించుకున్నారు. 156 సినిమాలు..537 పాటలు..24వేల స్టెప్పులతో అలరించినందుకు గాను ఆయనకు ఈ అరుదైన రికార్డు లభించింది. ఈ మేరకు గిన్నిస్ బుక్ ప్రతినిధులు, బాలీవుడ్ నటుడు అమిర్ ఖాన్ ఈ అవార్డును చిరంజీవికి ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ దర్శకులు రాఘవేంద్రరావు, బి.గోపాల్, కోదండరామిరెడ్డి, గుణశేఖర్, బాబితో పాటు నిర్మాతలు అల్లు అరవింద్, అశ్వనీదత్, శ్యామ్ ప్రసాద్ రెడ్డి, సురేశ్ బాబు, జెమిని కిరణ్, మైత్రి రవిశంకర్, తమ్మారెడ్డి భరద్వాజ, కేఎస్ రామారావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిరంజీవికి సినీ రాజకీయ ప్రముఖులు, అభిమానుల నుండి సోషల్ మీడియా వేదికగా అభినందనలు వెల్లువెత్తాయి. పునాదిరాళ్లు సినిమాతో తెరంగ్రేటం చేసిన చిరంజీవి తొలినాళ్లలో అనేక సవాళ్లు ఎదుర్కొని నిలబడి స్టార్ హీరోగా ఎదిగారు.

తన దైన నటన, డ్యాన్స్‌లతో యువతను ఉర్రూతలూగించారు. తొమ్మిది ఫిలింఫేర్, మూడు నంది అవార్డులతో పాటు ఎన్నో ప్రతిష్టాత్మక పురస్కారాలను చిరంజీవి అందుకున్నారు. సినీ రంగానికి, సామాజిక పరంగా ఆయన చేస్తున్న సేవలను గుర్తించిన ప్రభుత్వం 2006లో పద్మభూషణ్, 2024లో పద్మవిభూషణ్ అవార్డులతో సత్కరించింది.

భూ సమస్యలు పరిష్కరించాలి

జల్లి విల్సన్ డిమాండ్

విశాలాంధ్ర -మైలవరం: రాష్ట్రంలో వ్యవసాయ కార్మికుల భూసమస్యలు పరిష్కరించి న్యాయం చేయాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం మైలవరం సీపీఐ కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ఎన్టీఆర్ జిల్లా విస్తృత కౌన్సిల్ సమావేశం జిల్లా అధ్యక్షులు ఉప్పె నరసింహారావు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన జల్లి విల్సన్ మాట్లాడుతూ... ఎన్నికల ముందు సూపర్ సిక్స్ తో పాటు ఇచ్చిన అనేక హామీలను కూటమిప్రభుత్వం అమలు చేయాలని, రాష్ట్రవ్యాప్తంగా పేదల సాగులో ఉన్న ప్రభుత్వ భూములకు అన్ని హక్కులు కల్పించాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే లక్షల ఎకరాల అసైన్డ్ భూములు అన్యాక్రాంతం అయ్యాయని, భూ సమస్యలు రోజుకు రోజుకు అధికమవుతున్నాయన్నారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించాలన్నారు. గత ప్రభుత్వంలో ఏర్పాటు చేసిన జగనన్న కాలనీలు చాలా ప్రాంతాలలో నిరుపయోగంగా ఉన్నాయని... వాటిని రాష్ట్ర ప్రభుత్వం పరిశీలించి పేదల ఇళ్ల స్థలాలకు ఉపయోగపడే విధంగా ప్రణాళిక రూపొందించాలని కోరారు. ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాలలో మూడు సెంట్లు, పట్టణ ప్రాంతాలలో రెండు సెంట్లు చొప్పున ఇళ్ల స్థలాలు ఇచ్చి పేదలకు రూ.5 లక్షలతో గృహ నిర్మాణం చేపట్టాలని అన్నారు కూటమిప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రాష్ట్రవ్యాప్తంగా క్షేత్రస్థాయి ఉపాధి హామీ సిబ్బందిపై అధికార పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు రాజకీయ ఒత్తిళ్లకు గురిచేస్తున్నారని... ఆ విధమైన రాజకీయ జోక్యాన్ని ఆపాలని డిమాండ్ చేశారు. వారికి ఉద్యోగ భద్రత కల్పించి ఉపాధి హామీ చట్టం సక్రమంగా అమలయ్యేలా కృషి చేయాలని కోరారు.

వ్యవసాయ కూలీలకు భూములు పంచాలి: సీహెచ్ కోటేశ్వరరావు

ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సీహెచ్ కోటేశ్వరరావు మాట్లాడుతూ... అనేక జిల్లాల్లో సీపీఐ వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో లక్షలాది ఎకరాలు పేదల సాగులో ఉన్నాయని వాటికి సాగు హక్కు కల్పించి, రైతులతో సమానంగా వ్యవసాయ కూలీలకు పంటల బీమా, నష్టపరిహారాలను ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. ఇక రాష్ట్రంలో సాగుకు అనువుగా ఉన్న లక్షలాది ఎకరాల ప్రభుత్వ బంజరు, అటవీ, పోరంబోకు తదితర భూములను గుర్తించి భూమిలేని పేద వ్యవసాయ కూలీలకు పంచాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో వ్యవసాయ కార్మిక సంఘం అధ్వర్యంలో గ్రామీణ శ్రమ జీవులను సమీకరించి భూ పోరాటాలు నిర్వహిస్తామన్నారు. సమావేశంలో అనేక కీలక నిర్ణయాలపై తీర్మానం చేశారు. ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం అధ్వర్యంలో అన్ని నియోజకవర్గాల్లో మండల, గ్రామ కమిటీలు ఏర్పాటు, గ్రామస్థాయిలో సభ్యత్వాలు చేర్పించి సంఘాన్ని బలోపేతం చేయడం. జిల్లాలో పడావుగా ఉన్న అటవీ, ప్రభుత్వ బంజర భూముల్ని గుర్తించి భూపోరాటానికి సంసిద్ధం కావడం. గ్రామాల్లో మౌలిక సమస్యలపై ఉద్యమాలు నిర్వహించడం తదితర తీర్మానాలు చేసినట్లు వ్యవసాయ కార్మిక సంఘం ఎన్టీఆర్ జిల్లా ప్రధాన కార్యదర్శి చిలుకూరి వెంకటేశ్వర రావు తెలిపారు. ఈ సమావేశంలో ఎన్టీఆర్ జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం సీనియర్ నాయకులు తూము కృష్ణయ్య, ఎన్టీఆర్ జిల్లా సీపీఐ సహాయ కార్యదర్శి బుడ్డి రమేష్, ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షురాలు సీహెచ్ దుర్గా కోటేశ్వరరావు, గిరిజన సమాఖ్య జిల్లా నాయకులు బాలునాయక్, మైలవరం వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు గూడూరు శ్రీనివాస్ రెడ్డి, ఎన్టీఆర్ జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు షేక్ నాగుల్ మీరా తదితరులు పాల్గొని మాట్లాడారు. జిల్లా నలుమూలల నుండి పెద్ద ఎత్తున వ్యవసాయ కూలీలు పాల్గొన్నారు.

వరద బాధితుల సహాయార్థం

సీపీఐ గుంటూరు జిల్లా సమితి లక్ష విరాళం

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్: విజయవాడ వరద బాధితుల సహాయార్థం విరాళంగా గుంటూరు జిల్లాలో సేకరించిన రూ.లక్ష రూపాయలను సీపీఐ గుంటూరు జిల్లా కార్యదర్శి జంగాల అజయ్ కుమార్ చేతులమీదుగా సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణకు విజయవాడలోని రాష్ట్ర పార్టీ కార్యాలయం దాసరి భవన్‌లో ఆదివారం అందజేశారు. సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు, కార్యదర్శి వర్గ సభ్యులు జల్లి విల్సన్, కేవీవీ ప్రసాద్, గుంటూరు నగర కార్యదర్శి కోట మాల్యాద్రి, జిల్లా కార్యవర్గ సభ్యులు చిన్ని తిరుపతయ్య, పుప్పాల సత్యనారాయణ, రాష్ట్ర కార్యాలయ కార్యదర్శి వై.చెంచయ్య ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

అసైన్డ్ భూముల రైతులకు న్యాయం

ప్రభుత్వానికి అమరావతి జేఏసీ వినతి

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లోనే రాజధాని అమరావతిలో అనేక సమస్యలకు పరిష్కారం చూపడం శుభపరిణామమని అమరావతి ఐక్య కార్యాచరణ సమితి (ఐకాస) నేతలు అన్నారు. సీఎం చంద్రబాబు, మంత్రి నారాయణ దృష్టికి తీసుకెళ్లగానే అమరావతి రైతుల కౌలు బకాయిలను ప్రభుత్వం 90 శాతం విడుదల చేసిందన్నారు. అసైన్డ్ భూముల రైతుల సమస్యలపైనా ప్రభుత్వం అలోచించి న్యాయం చేయాలని ఐకాస ప్రతినిధి మాదల శ్రీనివాసరావు కోరారు. అమరావతి ప్రాంతంలో తాగునీరు, భూగర్భ డ్రెయినేజీ సమస్యకు శాశ్వత పరిష్కారంతో పాటు కొండవీటి వాగు నుంచి ముప్పు లేకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. అమరావతి ఉద్యమంలో గత ప్రభుత్వం పెట్టిన అక్రమ కేసుల వల్ల రైతులు, మహిళలు కోర్టుల చుట్టూ తిరుగుతున్నారని, సీఎం చంద్రబాబు ఈ అంశంపై దృష్టి సారించాలని కోరారు.

పేదలకిచ్చిన హామీలు అమలు చేయాలి

ఆవుల శేఖర్ డిమాండ్

విశాలాంధ్ర-ఒంగోలు: ఎన్నికలకు ముందు పేదలకిచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం అమలు చేయాలని, రాష్ట్రంలో నెలకొన్న భూ సమస్యలు పరిష్కరించి పేదలకు న్యాయం చేయాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆవుల శేఖర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రకాశం జిల్లా ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కౌన్సిల్ సమావేశం జిల్లా అధ్యక్షుడు యస్‌డి మౌలాలి అధ్యక్షతన ఒంగోలు లోని మల్లయ్య లింగం భవన్ లో జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన ఆవుల శేఖర్ మాట్లాడుతూ ఎన్నికలకు ముందు పేదలకిచ్చిన అనేక హామీలను కూటమి ప్రభుత్వం అమలు చేయాలన్నారు. భూ సమస్యలు రోజురోజుకు అధికమవుతున్నాయని వాటిని తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్లు, పట్టణ ప్రాంతాల్లో రెండు సెంట్ల చొప్పున ఇళ్ల స్థలాలు ఇచ్చి పేదలకు రూ.5 లక్షల తో గృహ నిర్మాణం చేపట్టాలని కోరారు. ఉపాధి హామీ చట్టంలో పనిచేస్తున్న క్షేత్రస్థాయి సిబ్బందిపై రాజకీయ ఒత్తిళ్లను నివారించి... వారికి ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు.పేదలందరికీ పనులు లభించేలా ఉపాధి హామీ పథకాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం ఉప ప్రధాన కార్యదర్శి ఆర్ వెంకట్రావు, సీపీఐ జిల్లా కార్యదర్శి యమ్ యల్ నారాయణ మాట్లాడుతూ ప్రకాశం జిల్లాలో చాలా ప్రాంతాల్లో ప్రభుత్వ భూములు పేదవారికి పంచడానికి అనుకూలంగా ఉన్నాయని... తక్షణమే ఆ భూమిని గుర్తించి భూమి లేని నిరుపేదలకు పంచాలని వారు డిమాండ్ చేశారు. ఈ సమావేశం లో రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆర్ విజయ, జిల్లా ఆఫీస్ బేరర్లు రామారావు, ఆర్ లక్ష్మి, పి. ప్రభాకర్, జె కోటేశ్వరరావు, గద్దల రవి, దాసరి శేఖర్ బాబు, కే కోటేశ్వరరావు, మండల నాయకులు, గ్రామాల నుండి కార్యదర్శులు పాల్గొన్నారు. ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం నిర్మాణ సదస్సును నవంబర్‌లో కనిగిరిలో జరపాలని, గ్రామ సంఘాలు ఏర్పాటు చేయాలని, సంఘ సభ్యత్వం 40 వేలు చేర్పించాలని, జిల్లాలో ఉన్న భూ సమస్యలను గుర్తించి పోరాటానికి సిద్ధం కావాలని సమావేశంలో తీర్మానించడం జరిగిందని జిల్లా కార్యదర్శి ఆర్ వెంకట్రావు, మౌలాలి తెలియజేశారు.

బ్రహ్మోత్సవాలకు రండి

చంద్రబాబుకు టీటీడీ ఆహ్వానం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: తిరుమలలో అక్టోబర్ 4వ తేదీ నుంచి జరిగే బ్రహ్మోత్సవాలకు హాజరు కావాలని సీఎం చంద్రబాబును తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) ఆహ్వానించింది. ఆదివారం ఉండవల్లిలోని చంద్రబాబు నివాసానికి వచ్చిన దేవస్థానం ఈవో జె.శ్యామలరావు, అడిషనల్ ఈవో వెంకయ్య చౌదరి ముఖ్యమంత్రికి బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రిక అందించి, ఆహ్వానించారు. ఈ సందర్భంగా అర్చకులు, వేదపండితులు చంద్రబాబుకు ఆశీర్వచనం ఇచ్చి, తీర్థ ప్రసాదాలు అందించారు.

భక్తుల మనోభావాలు దెబ్బతీయొద్దు

టీటీడీ ఈవోతో పవన్ కల్యాణ్

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: భక్తుల మనోభావాలకు విఘాతం కలగ కుండా చూడాలని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ సూచించారు. టీటీడీ ఈవో జె.శ్యామల రావు ఆదివారం ఉప ముఖ్య మంత్రితో సమావేశమయ్యారు. లడ్డూ తయారీలో వినియోగించిన కల్తీ నెయ్యిపై ఆయనకు వివరించారు. గత పాలక మండలి హయాంలో నెయ్యి సరఫరాదారును ఎంపిక చేసిన ప్రక్రియను, ల్యాబ్ పరీక్షల్లో వెల్లడైన ఫలితాలను వెల్లడించారు. ప్రస్తుతం లడ్డూ ప్రసాదం తయారీలో నిబంధనలను, శాస్త్రోక్తమైన నియమాలను పకడ్బందీగా అమలు చేస్తున్నామని ఈవో తెలిపారు. టీటీడీ సంప్రోక్షణ కార్యక్రమాన్ని చేపడుతోందని చెప్పారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి పలు సూచనలు చేస్తూ ధార్మిక అంశాలలో రాజీ వద్దని స్పష్టం చేశారు.

దళిత వైద్యుడిపై దాడి చేసిన వారిని శిక్షించండి: డీహెచ్‌పీఎస్

విశాలాంధ్ర-విజయవాడ: దళిత వైద్యుడిపై దాడి చేసిన వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలని డీహెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు జేవీ ప్రభాకర్, ప్రధాన కార్యదర్శి కరవది సుబ్బారావు, కార్యనిర్వాహక కార్యదర్శి బుట్టి రాయప్ప ఆదివారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. కాకినాడ రంగరాయ వైద్య కళాశాల ఆవరణలోకి ఆకతాయిలు రావద్దని, వైద్య విద్యార్థులకు ఇబ్బందులు జరుగుతున్నాయని అని చెప్పినందుకు దళితుడైన డాక్టర్ ఉమామహేశ్వరరావుపై కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ, ఆయన అనుచరులు దాడికి పాల్పడ్డారని పేర్కొన్నారు. విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకుపోగా, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆదేశాల మేరకు కలెక్టర్, ఎస్పీల ఎదుట దళిత వైద్యుడికి కేవలం క్షమాపణలు చెప్పించి వదిలివేయడం దుర్మార్గమని అన్నారు. కులం పేరుతో దుర్భాషలాడి, దాడికి పాల్పడి ప్రభుత్వ పెద్దలు చెప్పారన్న నేపంతో కేవలం క్షమాపణలు చెప్పి చేతులు దులుపుకోవడం ఎంతవరకు సబబు అని ప్రశ్నించారు. చట్టపరంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఒక ఎమ్మెల్యే స్థాయి వ్యక్తి దళితులపై వ్యక్తిగతంగా బూతు పురాణం అందుకోవడమే కాకుండా, తన అనుచర గణంతో దాడి చేయించడం హేయమైన చర్య అన్నారు. గత ప్రభుత్వంలో ప్రజా ప్రతినిధులు దళితులుపై అరాచకాలకు పాల్పడిన నేపథ్యంలో ఆ ప్రభుత్వాన్ని ఇంటికి పంపారనే విషయం గుర్తు చేసుకోవాలని హెచ్చరించారు. ఇప్పటికైనా ప్రభుత్వం చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో గత ప్రభుత్వానికి పట్టిన గతే పడుతుందని హెచ్చరించారు. ఎమ్మెల్యే ... ఆయన అనుచరగణంపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

ఆ పాపం గత పాలకులదే

లడ్డూ కల్తీపై ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్

విశాలాంధ్ర- పెదకాకాని: తిరుపతి లడ్డూ ప్రసాదం కల్తీ పాపం గత ప్రభుత్వ పాలకులదేనని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఆరోపించారు. గుంటూరు జిల్లా పెదకాకాని మండల పరిధిలోని దశావతార వేంకటేశ్వర స్వామి దేవస్థానాన్ని ఆదివారం ఆయన సందర్శించారు. ప్రాయశ్చిత్త దీక్ష చేపట్టారు. స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పవన్ మాట్లాడుతూ గతంలో అనేకసార్లు టీటీడీలో అవకతవకలు జరుగుతున్నాయని హెచ్చరించినా గత ప్రభుత్వం పట్టించుకోలేదని అన్నారు. నేడు వారు చేసిన పాపం పండిందని అన్నారు. భక్తుల మనోభావాలను గత ప్రభుత్వం దెబ్బతీసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. తాను ఎంతో కలత చెందానని, దీనికి అప్పటి టీటీడీ బోర్డు కమిటీ, ప్రభుత్వమే బాధ్యత వహించాలని అన్నారు. మిమ్మల్ని అక్కడ మెంబర్లుగా కూర్చోబెట్టింది మీ మనుషులకు కాంట్రాక్టులు ఇచ్చుకోవటానికి కాదని అన్నారు. ఇటువంటి దుర్మార్గానికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆ స్వామివారి సన్నిధిలో ఉద్యోగం చేస్తూ... ఆ స్వామివారి సొమ్ము తింటూ... ఆ స్వామి వారిపై జరుగుతున్న కుట్రలను అక్కడి ఉద్యోగులు వైసీపీ ప్రభుత్వానికి భయపడి బయట పెట్టలేకపోయారన్నారు. బాధతో 11 రోజులు ప్రాయశ్చిత్త దీక్ష కొనసాగించి అనంతరం కలియుగ వైకుంఠ వేంకటేశ్వరుని దర్శించుకుంటానని డిప్యూటీ సీఎం తెలిపారు.

విజన్‌తో రాష్ట్ర భవిష్యత్‌కు చంద్రబాబు కృషి

సీఎంకు నటుడు సోనూసూద్ అభినందనలు

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: తొలి వంద రోజుల్లోనే సీఎం చంద్రబాబు తన విశిష్ట పాలనతో ఆంధ్రప్రదేశ్ ప్రజలు సుఖ సంతోషాలతో ఉండేలా చర్యలు తీసుకున్నారని ప్రముఖ నటుడు సోనూసూద్ అన్నారు. ఏపీలో చంద్రబాబు పాలన వంద రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆయనకు అభినందనలు తెలియజేస్తూ సోనూసూద్ వీడియో సందేశం ఇచ్చారు. ప్రస్తుతం ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది. సుదీర్ఘ పాలనానుభవం ఉన్న సీబీఎన్ సర్... తన విజన్‌తో రాష్ట్ర భవిష్యత్తు కోసం చర్యలు తీసుకుంటున్నారు. ఆయనను ప్రజలు విశ్వసిస్తున్నారు అని ప్రశంసించారు. చంద్రబాబును చూసి గర్వపడుతున్నానని తెలిపారు. త్వరలోనే ఆయనను కలవాలనుకుంటున్నట్లు చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌ను మరింత ప్రత్యేకంగా తీర్చిదిద్దేందుకు తన వంతు సాయం అందిస్తానని పేర్కొన్నారు.

కాంగ్రెస్ జిల్లా ఇంచార్జులు వీరే...

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: కాంగ్రెస్ పార్టీ జిల్లా ఇంచార్జిలను నియమించారు. ఈ మేరకు ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు షర్మిల ఆదివారం జాబితా విడుదల చేశారు. మన్యం, అల్లూరి సీతారామరాజు జిల్లా ఇంచార్జిగా కొత్తూరి శ్రీనివాస్, శ్రీకాకుళం-జి.వెంకట త్రినాథ్‌రావు, విజయనగరం-గనిశెట్టి ఉమా శంకర్, విశాఖపట్నం-డాక్టర్ నూతన్‌నాయుడు, అనకాపల్లి-వలిబోయిన గుర్నాథం, కాకినాడ-మేడా సురేశ్, అమలాపురం-జె.శ్రీనివాస్, రాజమండ్రి-కొలనుకొండ శివాజీ, నర్సాపురం-బి.నాగేశ్వరరావు, ఏలూరు-వినీత సంజీవరెడ్డి, మచిలీపట్నం-మర్నీడి శేఖర్, ఎన్టీఆర్-మొవ్వ మోహన్‌రావు, గుంటూరు-శ్రీపర్తి ప్రకాశమ్, బాపట్ల-గెడ్డంపౌల్ విజయ్‌కుమార్, నరసారావుపేట-మదన్‌మోహన్‌రెడ్డి, ఒంగోలు-ఎన్వీ సత్యేంద్రబాబు, నంద్యాల-పటన్ మహ్మద్ అలీఖాన్, కర్నూలు-అంబటి రామకృష్ణ యాదవ్, అనంతపురం-టి.వెంకట నరసింహులు, వైఎస్ఆర్ కడప-ముసాని శ్రీనివాసరెడ్డి, హిందూపురం-పాట్నా శ్రీనివాసులురెడ్డి, రాజంపేట-సరిబాల ప్రతాప్‌రెడ్డి, నెల్లూరు-మాగంటి గోపాల్‌రెడ్డి, తిరుపతి-ఈదా సుధాకర్‌రెడ్డి, చిత్తూరు-డాక్టర్ రామ్‌భూపాల్‌రెడ్డిని జిల్లా ఇంచార్జిలుగా నియమించారు.

వైద్య వ్యవస్థ మార్పునకు అడుగులు

- మల్టీపర్పస్ కిట్లతో ఆరోగ్య సమస్యలకు పరిష్కారం
- విజయవంతంగా ముగిసిన సౌత్‌జోన్ ఫిజీషియన్ల సదస్సు

విశాలాంధ్ర-విశాఖపట్నం: మూడు రోజుల పాటు స్థానిక సిరిపురంలోని వీఎం ఆర్డీఏ చిల్డ్రన్ ఎరిన వేదికగా నిర్వహించిన ఇండియన్ సౌత్ జోన్, సౌత్ మిడ్ జోనల్ అసోసియేషన్ ఫిజీషియన్స్ వార్షిక సదస్సు ఆదివారం ముగిశాయి. ఈ సందర్భంగా మీడియా సమావేశంలో ఫిజీషియన్ల సంఘ రాష్ట్ర అధ్యక్షుడు, విశాఖ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్ (విమ్స్) డైరెక్టర్, సదస్సు కన్వీనర్ డాక్టర్ కే రాంబాబు మాట్లాడుతూ మూడు రోజులపాటు నిర్వహించిన సదస్సు విజయవంతమైందన్నారు. వివిధ రాష్ట్రాల నుంచి 1200 మంది ఫిజీషియన్స్ హాజరయ్యారని చెప్పారు. 67 మంది వైద్య నిపుణులు ప్రసంగించా రన్నారు. కేంద్ర ప్రభుత్వ వైద్య పరిరక్షణ కమిటీ సభ్యుడు డాక్టర్ నాగేశ్వర రెడ్డి, ప్రముఖ వైద్యులు శాకిర్ హుస్సేన్, సతీశ్ చంద్ర... తమ పరిశోధనలు, అనుభవాలు నూతనతరం వైద్యులతో పంచుకున్నారని తెలిపారు. లండన్ కు చెందిన నిక్ స్మాల్ వుడ్ అనే వైద్యుడు వర్చువల్ విధానం ద్వారా ప్రసంగించారని రాంబాబు వివరించారు.

మూడు వేదికలుగా జరిగిన సమావేశాల్లో కర్నాటక, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కేరళ రాష్ట్రాల నుంచి వైద్యులు, వైద్య విద్యార్థులు విచ్చేసినట్టు తెలిపారు. డెంగీ, మలేరియా, గుండె నొప్పి ఎలా గుర్తించాలి, ప్రమాదకర స్థితిలో రోగి వస్తే ఏ విధంగా వైద్య సేవలు ఇవ్వాలో సదస్సులో నిపుణులు వివరించారు. సదస్సు ప్రధాన అంశాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు తెలియజేస్తామని చెప్పారు. ప్రధానంగా వైద్య పరీక్షలకు మల్టీపర్పస్ కిట్‌లు ... జ్వరం నుంచి గుండె నొప్పి వరకు అనేక వైద్య సేవలకు ఉపయోగపడ తాయని, అనేక టెస్ట్‌ల అవసరం లేకుండా ఒక్క టెస్ట్ కిట్‌తోనే అనేక వైద్య ఇబ్బందులు తొలగిపోతాయని పలువురు వైద్య ప్రముఖులు సూచించా రన్నారు. నూతన టెక్నాలజీ అంది పుచ్చు కోవటం, టేలిమెడిసిన్, డిజిటల్ ల్యాబ్ రిపోర్ట్‌లు, డిజిటల్ ల్యాబ్ రిపోర్ట్‌లు భద్ర పరచడం... సీఎంఎస్ కంటిన్యూ మెడిసిన్ సిస్టమ్, వైద్య వ్యవస్థ మార్పునకు వైద్యులు అడుగులు వేయాలని ,ఇతర వైద్య నిపుణులతో సంప్రదింపులు జరపాలన్నారు. తద్వారా రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించవచ్చునని సూచించినట్టు పేర్కొన్నారు. కొవిడ్, ఇతర వైరస్‌లు విజృంభించినప్పుడు ప్రజలకు సేవ చేయడానికి వైద్యులు సిద్ధంగా ఉంటామని, రాష్ట్ర ప్రభుత్వానికి సహాయ సహకారాలు అందిస్తామన్నారు.

జగన్ ఇంటి వద్ద బీజేవైఎం హల్‌చల్

ప్రధాన గేటు ఎక్కి రాళ్లు, రంగు డబ్బాలతో బీభత్సం

లడ్డూ అపవిత్రతను నిరసిస్తూ దిష్టిబొమ్మల దహనం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: తిరుమల లడ్డూ ప్రసాదం అపవిత్రతను నిరసిస్తూ తాడేపల్లిలోని మాజీ సీఎం వైఎస్ జగన్ ఇంటికెళ్లే మార్గంలో ఆదివారం బీజేపీ యువమోర్చా నిరసనకు దిగింది. వైసీపీ కార్యాలయం ఎదుట, జగన్ ఇంటి గేటు ముందు దిష్టిబొమ్మలు దహనం చేశారు. జగన్, టీటీడీ మాజీ చైర్మన్ వైవీ సుబ్బారెడ్డికి వ్యతిరేకంగా ఫ్లెక్సీలు చేతబట్టి నినదించారు. దీంతో జగన్ ఇంటికెళ్లే మార్గంలో కొద్దిసేపు ఉద్రిక్తత చోటు చేసుకుంది. తిరుమల లడ్డూను అపవిత్రం చేశారంటూ గేట్ వద్ద బైఠాయించారు. వీరిని పోలీసులు అడ్డుకునే ప్రయత్నం చేయడంతో ఉద్రిక్త పరిస్థితులు చోటు చేసుకున్నాయి. పోలీసులు, యువమోర్చా నేతల మధ్య వాగ్వాదం, తోపులాట జరిగాయి. జగన్ క్షమాపణ చెప్పాలంటూ బీజేపీ యువమోర్చా నేతలు డిమాండ్ చేశారు. పోలీసుల వలయాన్ని ఛేదించి ప్రధాన రోడ్డు గేట్‌ను దాటుకుని వైసీపీ కార్యాలయం వరకు బీజేవైఎం నేతలు దూసుకుపోయారు. వైసీపీ కేంద్ర కార్యాలయ గోడలపై రాళ్లు, రంగు డబ్బాలను విసిరివేశారు. ఆ తర్వాత జగన్ ఇంటి లోపలికి వెళ్లేందుకు ఆందోళనకారులు యత్నించారు. మూసిఉన్న గేటుపైకి ఎక్కి విచ్చలవిడిగా ఎర్రరంగు పోసి హడావుడి చేశారు. గతంలోని క్యాంప్ కార్యాలయం వైపు నుంచి లోపలి దూసుకెళ్లేందుకు ప్రయత్నించారు.

చంద్రబాబు నీచరాజకీయాలు: అంబటి, మల్లాది, సుధాకర్‌బాబు

చంద్రబాబు నీచ రాజకీయాలకు పాల్పడుతున్నారని, ఇది కేవలం విశాఖ ఉక్కు డైవర్షన్ పాలిటిక్స్ అని వైసీపీ నేతలు ధ్వజమెత్తారు. వైసీపీ కేంద్ర కార్యాలయంపై దాడిని ఆ పార్టీ నేతలు అంబటి రాంబాబు, మల్లాది విష్ణు, లేళ్ల అప్పిరెడ్డి, మొండితోక అరుణ్‌కుమార్, పీజేఆర్ సుధాకర్‌బాబు, దేవినేని అవినాశ్ ఖండించారు. దాడి యత్నం జరిగిందన్న సమాచారంతో పార్టీ కేంద్ర కార్యాలయానికి నేతలు హుటాహుటిన చేరుకున్నారు. జగన్ ఇంటి గేట్ దగ్గర అంబటితోపాటు పలువురు నేతలు మీడియా సమావేశం నిర్వహించారు. అంబటి మాట్లాడుతూ, వేంకటేశ్వర స్వామి సాక్షిగా చంద్రబాబు నీచరాజకీయాలకు పాల్పడుతున్నారంటూ మండిపడ్డారు. లడ్డూ తయారీకి వినియోగించే నెయ్యిలో జంతు కొవ్వు కలిసిందన్న దానిపై ఎలాంటి ఆధారాలు లేకుండా చంద్రబాబు, పురందేశ్వరి, లోకేశ్, పవన్ కల్యాణ్ దారుణ ఆరోపణలు చేస్తున్నారన్నారు. ప్రజల దృష్టి మరల్చడానికే టీడీపీ, బీజేపీ డైవర్షన్ పాలిటిక్స్‌కు పాల్పడుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు.

జగన్‌పై హైదరాబాద్‌లో కేసు

తిరుపతి లడ్డూ తయారీలో అపవిత్రత అనే ఆరోపణలపై మాజీ సీఎం జగన్‌పైన, గత టీటీడీ పాలక మండలి చైర్మన్‌తోపాటు సభ్యులపైన హైదరాబాద్‌లోని సైదాబాద్ పోలీస్ స్టేషన్‌లో హైకోర్టు న్యాయవాది కె.కరుణ్ సాగర్ ఫిర్యాదు చేశారు. ఇది గత ప్రభుత్వ కుట్రలో భాగమని, తిరుమలలో శ్రీవారి ప్రసాదంగా అందించే లడ్డూ దైవత్వానికి ప్రతీక అని పేర్కొన్నారు. పవిత్రతతోపాటు నాణ్యతలో లడ్డూ ప్రపంచ ప్రసిద్ధి పొందిందని కరుణ్ సాగర్ గుర్తుచేశారు.

A.P. CAPITAL REGION DEVELOPMENT AUTHORITY
Lenin Centre, Governorpet, Vijayawada - 520 002 (A.P.)
NIT No. MAU61-ADMN0IS(INET)/4/2024-IS Dt. 21.09.2024
E PROCUREMENT SHORT TENDER NOTICE
Name of Work : "Supply & Installation of Analog Phones, Digital Phones and IP Phones @ various departments of AP Secretariat, Amaravati" – **Estimate Contract Value: Rs.4,09,304/- (Excl. of all taxes).**
The bid can be downloaded on AP e-procurement portal from **23.09.2024 to 30.09.2024 up to 14.00 Hrs.** Due date for submission of Bid **30.09.2024 up to 15.00 Hrs,** Technical bid opening **30.09.2024 @16.00 Hrs.** For further details please refer to **www.apeprocurement.gov.in** and **www.crda.ap.gov.in.**
Sd/- Commissioner, APCRDA, Vijayawada

ఆత్మగౌరవమై రెపరెపలాడే కవిత్వం

సాహితి

మనిషికీ మనిషికీ మధ్య మానవత్వం జీవనదిలా సాగితే అది పూలసుగంధాలతో అలరారే సుభిక్షపు పచ్చదనాల నేల అవుతుంది. ఒంటరి జీవితాలను చేసేస్తూ రెండు హృదయాల మధ్య అమానుషత్వపు వివక్ష లావాలా పెల్లుబికితే అది బీళ్లువారిన ఎడారి అయిపోతుంది. అధికారదర్పాలతో ఎన్నెన్నో కాంక్షల్ని కాలరాసే ఆంక్షల కనుసన్నల్లోనే ఆ జీవితాలు కునారిల్లుతుంటాయి. అప్పుడు మనుషుల మధ్య, మనసుల మధ్య సామాజికయుద్ధాలు ప్రారంభమవుతాయి. వివక్ష మనిషి ఇంకో మనిషికి వేసే బందీఖానా. అది అస్తిత్వాన్నీ, ఆత్మ గౌరవాన్నీ కాపాడుకోవడానికి మనిషిలో జరిగే నిరంతర సంఘర్షణ. అది బహుజన బహురూప బాధల కార్ఖానా. అసమానత రాజేసే మనిషి అస్తిత్వపు కొలిమిలో ఆత్మగౌరవం రగులుతూనే వుంటుంది. జీవితాల్ని శాసించే గొంతుల్ని ప్రశ్నించేందుకు అది నిప్పుకణమవుతూనే వుంటుంది. అందుకే మనిషిని నిరంతరం అప్రమత్తుడిని చేస్తూ అతడిలో చైతన్యకెరటాల్ని వుప్పొంగించే ఆత్మగౌరవం కవిత్వానికి ప్రియనేస్తమైపోయింది.

మనిషిని సంస్కరించే దిశగా కవిత్వం తానే ఆత్మగౌరవమై నినదిస్తుంది. మనిషిని మనిషికి దూరం చేసే సామాజిక దౌష్ట్యాన్ని దునుమాడుతుంది. ఆత్మగౌరవపతాకాన్ని రెపరెపలాడించిన బహుజన కవితాప్రవంతి పీడితుడి దశాబ్దాల వేదనాంతరంగపు తరంగాల్ని ఎన్నెన్నో పార్శ్వాల్లో అక్షరాలుగా ఆవిష్కరించింది. 'నావి అగ్ని పాదాలు/నా కాళ్లను ఏ తాళ్లూ కట్టిపడేయలేవు/నా శిరస్సు సగర్వ పతాక/నన్నెవరూ అవనతం చేయలేరు' అంటూ ఎండ్లూరి సుధాకర్ తనను తాను చైతన్యపు అగ్నిపర్వతంగా ప్రకటించుకునే పీడితుడి ఆత్మగౌరవాన్ని ఎవ్వరూ అవనతం చేయలేని జెండాతో పోలిస్తే, 'నేనూ నా వేసబాసలు వెక్కిరింతలైన చోట/నా ఇల్లు ఊరవతల కాలనీగా మొలుస్తున్న పూట/ నన్ను ఎక్కడికక్కడ వేరుచేస్తున్నచోట/జివ్వుమనే నొప్పితో నవ్వులతోటనెలా అవుతాను/ఎవరితోనో చేరి తొక్కుడుబిల్లాట ఎలా ఆడతాను' అంటూ యువకవి పల్లిపట్టు నాగరాజు తన ఉనికిని తననుంచి వేరుచేసే దుర్మార్గపు పరిస్థితుల్ని ప్రశ్నించే పీడితుడి ఆత్మగౌరవాన్ని కవిత్వీకరిస్తాడు.

'నక్కలకే బొరియలుండి
నరరూపరాక్షసులకే గూళ్లుండి
వాలడానికి ఒక కొమ్మయినా లేని ఈ ఎడారి గొంతులోకి
ఈ కాకి/ఎన్నిసార్లు వానచినుకై జాలువారిందనీ
అవమానాల భూకంపాలకు నెర్రెలిచ్చిన కళ్లలో
ఎన్ని పచ్చటి చేలని స్వప్నించిందీ
--------- ---------- ---------
తెగుతున్న సహనపు కంఠాన్ని కూడదీసుకొని
ఎన్ని దిగంతాలని పలకరించిందీ
ఎన్ని పోరుపాటలని ప్రతిధ్వనించిందీ
నిశ్శబ్దాన్ని తప్ప/బతుకు సంగీతాన్ని వినలేనోళ్లంతా చేరి
ముక్తకంఠంతో దీనిదసలు గొంతేకాదన్నారు
పాటకాదుకదా ఇది కాకిగోలని చెవులు మూసుకున్నారు
------ ---------- ----------
ఈ అలగాపిట్ట ఈ మధ్య
ఏ వీరుడి సమాధిపై మొలిచిన ఏ చిగురు కొరికిందో కానీ
ఇప్పుడు/తన రెక్కలకెత్తుకు కొత్త ఆకాశాన్ని మోసుకొస్తుంది
తన రెప్పలు తెరచి కొత్త దేశాన్ని ఆవిష్కరిస్తుంది
హంసలా ఆర్నెల్లు కాదు
బతికితే కాకిలాగే కలకాలం బతకాలంటుంది

('కాకి' ఖండిక నుంచి)

ఆశ్రయం కోరడానికి ఒక్క చెట్టుకూడా లేని మోడువారిన ఎడారిని ఎన్నోసార్లు తానే వానచినుకై సేదదీరుస్తూనే అవమానాల భూకంపాలతో కళ్ల పగుళ్లు దీస్తూనే వున్నా భవిష్యత్తు పచ్చదనపు కలల్ని కనడం మానకుండా తిరిగే కాకి వేదనను అమానుషత్వపు వడగాడ్పుల మధ్య ఒక్క ఆనందపు తొలకరి చినుకు కూడా కురవని వివక్ష ఎడారిలో తిరుగాడుతూ ఒయాసిస్సుల కలలు గనే పీడితుడి దుఃఖంలో సంలీనం చేసింది కవిత్వం. తనను ఏకాకిని చేసేసిన ఆధిపత్యపు గుంటనక్కల బొరియల్ని చూస్తూ సహనానికి హద్దులు చెరిపేసుకోలేక దిగులుదిగులుగా దిక్కుల్ని పరామర్శిస్తూ, పోరుపాటలతో హోరెత్తిస్తూ కాకి వినిపించే జీవన వేదనాస్వరాలు ఇక్కడ కవిత్వమైపోయాయి. కాకి వినిపించే ఎన్నెన్నో బాధల, గాధల బతుకు సంగీతాన్ని బేఖాతరు చేస్తూ వాటిని అలగాపిట్ట కాకిగోలగా చిత్రించేసిన ఆంక్షల్నీ, ఆధిపత్యాల్నీ ఎత్తిచూపించింది కవిత్వం, మధురమైన మావిచిగురు తినగానే కోయిల కొత్తపాట ఎత్తుకుంటుంది. ఆ ఎలమావినే ఇక్కడ వీరుడి సమాధిలో సంలీనం చేసింది కవిత్వం. అనంతమైన ఆత్మవిశ్వాసాన్నీ, శౌర్యపరాక్రమాల్నీ నింపుకున్న ఆ సమాధిపై మొలిచే చిగురు కాకిలో కొత్త ఉత్సాహాన్ని నింపింది. దాని ఆత్మగౌరవపు రెక్కలపై కొత్త గగనాన్ని మోయించింది. దాని రెప్పలతో కొత్తలోకాన్ని ఆవిష్కరింపజేసింది. పీడితుడి దశాబ్దాల దుఃఖానికి కాకి ప్రతీక అయింది. అస్తిత్వలేమితో ఒంటరివాడిని చేసిన ఆటవిక సామాజికన్యాయం ఇక్కడ తడారిపోయిన ఎడారి అయిపోయింది.

'నాయనెప్పుడు తెల్లంగీ వేసుకున్నా/ఇంట్లో పున్నమి తచ్చాడేది
చాకిరేవుబల్ల ఎంతరిగేదో తెలీదు
నాయనుతుకులో తెల్లంగీలు/మల్లెతోటను గుబాళించేవి
తెల్లంగీ మా కల/కొప్పుగారే తాటాకిల్లే మాది
సందుకలో రెండుమూడు తెల్లంగీలుంటే
మా గుండెల్నిండా ఆనందమే
శ్రమసమయాలన్నీ బరొంటివే
పండగ సమయాల్లో తెల్లంగీ ధరించడం
మా ఆత్మగౌరవమే
ఎన్నాళ్లు మసిబారిపోయుంటాం
చిరుగుల్ని దాచిపెట్టుకొని
సిగ్గుసిగ్గుగా కాలాన్ని దాటిస్తుంటాం
తెల్లంగీ కొనుక్కుంటామందుకే
నెత్తురుని చిందించి/బతుకుబట్టగా దాన్ని ఊరేగిస్తాం
నన్ను తెల్లంగీలో చూస్తే/ఆధిపత్యపు కండ్లు కోపాలు పోతాయి
నలుగిపోయే కనబడాల వాండ్లకు
తెల్లంగీలో వెలిగితే కుతకుతలాడతారెందుకో
బీదబీక్కి నక్కి నక్కి బతకాలా యికా
ఒక్క తెల్లంగీ మెట్టుకెక్కి మురిపెం పోకూడదా
---- ---------- -----------
ఊరికి హంసపర్వాన్ని రెక్కలకుంచెతో లిఖించాక
మేమూ తెల్లనితావిలో తులతూగడం మా కాంక్ష
దానిపై ఎవరి ఆక్షల్ని సహించం!
మురికి బట్టల్నే దబిడి దబిడి చేసినోళ్లం
మాకు తెల్లంగీని దూరం చేయాలనుకుంటే
ఉతుకుడు ఉద్యమమవుతుంది/కావరం రాలిపండుతుంది
మా అస్తిత్వం వెలుగులు ప్రజ్వరిల్లితే/అదే మా తెల్లంగీ'

('తెల్లంగీ మా కల' ఖండిక నుంచి)

అంటూ తమ జీవనయానాన్ని వివక్ష వలయాల్లోకి తోసేస్తూ తమపై వహించే ఆధిపత్యపు పెత్తనాన్ని ప్రశ్నిస్తూ, అత్మవిశ్వాసపు అక్షరాల స్వరాలతో ఆత్మగౌరవపు శంఖారావాన్ని వినిపిస్తాడు వర్తమానకవి మెట్టా నాగేశ్వరరావు. చాకిరేవు బల్ల అరిగేంత స్వచ్ఛమైపోయి మల్లెతోటల పరిమళంతో పీడితుడి ఆకాంక్ష అయిపోతుంది తెల్లంగీ. అతని జీవనరాగమయ్యే తెల్లంగీని అతడి ఆత్మగౌరవపు వస్త్రాన్ని చేసింది కవిత్వం. చిరుగుల వేదనలో మసకబారిన బతుకులకు శ్రమజీవన సౌందర్యమౌతుంది తెల్లంగీ. అది వృత్తిలోని ప్రేమకూ, నిబద్ధతకూ సంకేతం.అది పండగ సమయాల్లో అతడికి హుందాతనమౌతుంది. ఆధిపత్యపు మంటల సెగలకు అతడి తెల్లంగీ ఎంతగా మసిబారిపోతుందో, అతడి తెల్లంగీ వెలుగును అమావాస్యపు వివక్ష చీకట్లుఎంతగా హరించివేస్తాయో విడమరచిచెప్పిన కవిత్వం ఊరంతటినీ తెలుపు తెలుపుగా ఉతికి ఉతికి ఆరేసే తానూ తెలుపు మధురిమల్లో పురకలెయ్యాలనే అతని తపనకు ఎదురొచ్చే సామాజిక అడ్డంకుల్నీ, ఆంక్షల్నీ ప్రశ్నిస్తుంది. అతడికి తెల్లంగీని దక్కకుండా చేయడానికి యత్నించే మనుషుల మనసుల్ని ఉతికి ఉతికి మురికిని పోగొట్టే ఉతుకుడు ఉద్యమానికి ఊతమిస్తూ అతడి నిలువెత్తు అస్తిత్వపు తెల్లంగీ తానే అయిపోతుంది. దుఃఖిస్తూ నక్కినక్కి బతికే క్షణాలకు తిలోదకాలిస్తూ తెల్లంగీ శిఖరాలను అధిరోహించాలంటూ ఆత్మగౌరవ చైతన్య దుందుభిని మోగిస్తుంది కవిత్వం. తెల్లంగీ వెలుగుల్లో ఆ జీవితాలను దర్శించాలని తపించిపోతుంది.

డాక్టర్ కొత్వాలు అమరేంద్ర, సెల్: 9177732414

అంతర్మథనం

రాలే బిందువుకి
తెలియదు
తాను కాంక్రీట్‌పై కురుస్తున్నానని
నేలనుకునే భ్రాంతిలో బిందువు
చినుకు చినుకు
ఇంకి పోతాననుకునే భ్రమలో
ఎంకి మరదలు చినుకు
ఇంకే అవకాశమేలేని నేల
సిమెంట్‌తో కప్పబడిందని ఎరుగని చినుకు
పలు చినుకుల ప్రవాహం సాఫీగా సాగుతుందనే ఆశలో
సాగే ప్రవాహ పరిధి కుంచించుకుపోతుంటే
అయోమయంలో ప్రవాహం
ఒడ్డున తన కోతను ఆపే చెట్లు కానరాక వరద నిరాశ
ఒడ్డును దాటి ముందుకు చొచ్చుకొచ్చిన ఇళ్లను చూసి కోపంలో తాను
అటూ ఇటూ తన దారిని తనను పోనీయని
మనిషి జ్ఞానియా?! అజ్ఞానియా?!
నీ చోటులోకి నేను రాల్లే
నా చోటులోకి నువ్వొచ్చి విపత్కర పరిస్థితికి బీజం వేస్తున్నావ్
ఏది ఏరు ఏది చెరువు ఏది నాలా ఎరుగవా నీవు!
నేలను నీవు చెరబడితే నేనేం చేయగలను?!
నా దారిన నేను పోతున్నా అనాదిగా!
నా తీరాన నీ నాగరికత నాడు
నేడు నా గర్భంలోకి నువ్వు
తెలిసి నువ్వు చిచ్చు పెడుతుంటే
నేనేం చేస్తా! నేను ప్రకృతి ధర్మాన్ని పాటిస్తూ నా దారిన నేను!
నువ్వు ప్రకోపం అనుకుంటున్నావ్
నేనంటున్నా అది నువ్వు కోరి తెచ్చుకుంటున్న ఉపద్రవమని!

- గిరి ప్రసాద్ చెలమల్లు, 9493388201

'లోపలివాన' కవితాసంపుటి ఆవిష్కరణసభకు ఆహ్వానం

యువకవి కుడికాల వంశీధర్ రచించిన 'లోపలివాన' కవితాసంపుటి ఆవిష్కరణ సభ 29 సెప్టెంబర్ 2024 ఆదివారం ఉదయం 10 గంటలకు రవీంద్రభారతి సమావేశ మందిరం (మొదటి అంతస్తు), హైదరాబాద్‌లో జరుగుతుంది. ముఖ్య అతిథి డా. ఎన్. గోపి ఆవిష్కరిస్తారు. ఆచార్య సూర్యా ధనుంజయ్ అధ్యక్షత వహిస్తారు. డా. ఎస్. రఘు విశిష్ట అతిథిగా పాల్గొంటారు. డా. గిన్నారపు ఆది నారాయణ గ్రంథ సమాలోచన చేస్తారు. కిన్నెర ఆర్ట్ థియేటర్స్ అధినేత మద్దాళి రఘురాం ఆధ్వర్యంలో కార్యక్రమం జరుగుతుంది. అందరూ ఆహ్వానితులే.

మద్దాళి రఘురాం, కుడికాల వంశీధర్

గంటా కమలమ్మ సాహితీ పురస్కారం-2024

శ్రీమతి గంటా కమలమ్మ సాహితీ పురస్కారం -2024 కొరకు, 2022 & 2023 సంవత్సరాలలో ప్రచురితమైన కవితా సంపుటాలను ఆహ్వానిస్తున్నాము. మీ కవితా సంపుటాలను మూడుప్రతులను, అక్టోబరు 15, 2024 లోపు మాకు అందేలా పంపవలెను. ఎంపికైన ఉత్తమ కవితా సంపుటానికి 10,000/- నగదుతో పాటు, పురస్కార ప్రదానం జరుగును.

మీ కవితా సంపుటాలను మాకు పంపవలసిన చిరునామా:

గంటా మోహన్, టీచర్, ప్రభుత్వ ఉన్నత పాఠశాల,
బంగారుపాళ్యం, బంగారుపాళ్యం మండలం,
చిత్తూరు జిల్లా. - 517416
అవార్డు వ్యవస్థాపకులు : గంటా మోహన్
వివరాలకు : 9440467311

మురిసిపోతున్న వాన

కాసిన్ని చినుకులు పువ్వులై రాలుతున్నాయి
మెరుపులై దుముకుతున్నాయి
అలసి ఆరాటపడుతున్న మనసుపై
ముద్దు ముద్దుగా ముత్యాల్లా దొర్లుతున్నాయి.

నా కనురెప్పలపై నాట్యమాడే
నెమళ్ళు పుట్టుకొస్తున్నాయి.

మనం మనసు పడాలే కానీ
మబ్బుల సరస్సును వొంచి
ఎర్ర కాలువల్లోంచి వానని వొంపి
మరో లోకం లోకి తీసుకుపోతాయ్.

మురిసిపోతున్న ఓ వాన
నా మట్టి పరిమళానికి
మాతృకవి నువ్వే కదా
నా నాగలి కదిలికకు
దారిదీపం నువ్వే కదా.
నీ కాసింత ప్రేమకు
ఆకుపచ్చని వసంతం
మేమేకదా.

నీ అనంత కోపానికి
వరదలై కొట్టుకుపోయేదీ మేమే.

మేమంతా
వానకు చిగురించే మొక్కలం
వానకు కువకువలాడే పిట్టలం
వానకు కొట్టుకుపోయే మనుషులం.

మట్టినీ మమకారాన్ని
వాననీ వెన్నెలనీ ప్రేమించే
మట్టి మనుషులం....!

- గవిడి శ్రీనివాస్, 7019278368

దళితుల సామాజిక జీవన దృశ్యకావ్యం

గ్రంథ సమీక్ష

డాక్టర్ కత్తి పద్మారావు జీవిత చరిత్ర 'అస్పృశ్యుని యుద్ధ గాథ' ప్రచురితమవుతూ భారతీయులు, ఆంధ్రుల చరిత్రలో దళిత పోరాటాలు, జీవన సంస్కృతులు, వారిలో దాగిన తత్వశాస్త్రాన్ని, జ్ఞాన శాస్త్రాన్ని, కవిత వైదుష్యాన్ని, ప్రకృతితో వారికున్న మమేకతను వర్ణిస్తూ దేశ చరిత్రను తన చరిత్రగా లిఖిస్తూ వెళ్తున్నారు. తరతరాలుగా రాతకు నోచుకోని అనేక జీవన గాథలు, వ్యథలు, ఊసులు, బాసలు, మన ఎదురుగా వచ్చి ఆయన మనతో సంభాషిస్తున్నట్టుగా ఈ గ్రంథాలు చదువుతున్నప్పుడు అనిపిస్తుంది.

సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ కె వై రత్నం అన్నట్టు కత్తి పద్మారావు స్వీయ చరిత్రలో సత్య జీవనావిష్కారం ఉంటుందని, అదొక మానవతా దర్శనమని, అది మానవ సంబంధాల సాంఘిక చరిత్ర అని, నిజమైన దేశచరిత్ర చదవాలంటే అస్పృశుని యుద్ధగాథ ఇప్పటికి వచ్చిన మూడు భాగాలను చదవాలని తెలుస్తుంది. మహాభారతం 18 పర్వాల్లో రాసినట్లే, దళితుల యుద్ధ గాథను కూడా 18 పర్వాలుగా రాయాలని కత్తి పద్మారావు అభిలాష. ఆయన జీవిత చరిత్ర చదువుతుంటే అంబేద్కర్, మహాత్మ పూలే, పెరియార్ రామస్వామి నాయకర్, భక్తి కవులు సంత్ రవిదాస్, కబీర్, వేమన, జాషువా, ఖలీల్ జిబ్రాన్ వీరంతా మనతో వచ్చి మాట్లాడుతున్నట్టు ఉంటుంది.

అస్పృశ్యుని యుద్ధగాథగా స్వీయ జీవన పోరాట తాత్విక, రాజకీయ, సాంస్కృతిక, కవితా ప్రయాణాన్ని డాక్టర్ కత్తి పద్మారావు ఏడు భాగాలు రాయాలని సంకల్పించారు. మొదటిభాగం, రెండవ భాగాలలో బాల్యం గురించి, కారంచేడు పోరాట సంఘటనల గురించి ప్రస్తావించడం జరిగింది. ఇక ఒక అస్పృశ్యుని యుద్ధగాథ మూడో భాగంలో కత్తి పద్మారావు సామాజిక, సాంస్కృతిక, కవిత్వ, తాత్విక జీవిత యానాన్ని మనకు దృశ్యీకరింపజేశారు. పద్మారావు ప్రకృతిని ఎక్కువగా ఇష్టపడతారు. వీరి కవిత్వం మొత్తంగా ప్రకృతి ప్రధాన పాత్రగా ఉంటుంది.

పల్లెల్లో కత్తి పద్మారావు అనుభవాల్ని ఈ మూడవ భాగంలో చెప్తున్నారు. కత్తి పద్మారావు ప్రతి చిన్న విషయాన్ని గమనిస్తూ గ్రామాల్లో చదువు సోమరులు ఎక్కువయ్యారని, తల్లిదండ్రులు బిడ్డల భవిష్యత్తు గురించి ఆవేదన చెందినంతగా పిల్లలు రెస్పాండ్ కారని, స్వార్థపూరితమైన ఆలోచనలతో సోషల్ అవేర్ నెస్ లేకుండా, ఆత్మీయ మానవ సంబంధాలకు దూరంగా, దళితులు స్వార్థపరులుగా ఉండడాన్ని తమ పరిశీలన ద్వారా గమనించిన అనేక విషయాలను తెలియజేస్తూ అంబేద్కర్ గారు పల్లెల్లోని దళితులు ఏ విధంగా ఉండాలో చెప్పిన విధానాన్ని ఈ మూడవ భాగంలో చర్చించారు.

కుళ్ళు, ద్వేషం, కపటం లేకుండా ఉండాలంటే మనుషులు ప్రేమ కలిగి ఉండాలి. ముఖ్యంగా వృద్ధుల మీద, శిశువుల మీద, వికలాంగుల మీద ప్రేమ కలిగి ఉండాలి. దళితుల నూతన వస్త్రాలు ధరించడమే కాకుండా ఇతరులకి కూడా నూతన వస్త్రాలు ఇవ్వగలగాలి. ఇలాంటి సాంస్కృతిక సామాజిక వ్యవస్థను అంబేద్కర్ కోరుకున్నారని చెప్తూ పద్మారావుకి చిన్నతనం నుంచి పాఠం చెప్పటం అంటే ఎంత ఇష్టమో, చిన్నతనములో వారి కుటుంబ సభ్యులతో గడిపిన జ్ఞాపకాలను నెమరు వేసుకుంటారు. వీరు పాఠం చెప్పే సందర్భంలో పిల్లలందరి చేతుల్లో తప్పనిసరిగా పాఠ్య పుస్తకం ఉండాలి. లేకపోతే వీరికి బహు కోపం వచ్చేది. వీరు పాఠాలు చెప్పేప్పుడు ఎక్కువ నిశ్శబ్దాన్ని ఇష్టపడేవారు. పుస్తకం చదవని వారితో ఎక్కువగా మాట్లాడేవారు కాదు. వీరికి వీరి కుమార్తె సృజన అంటే ఎంతో ఇష్టం. కారణం ఆమె ఎక్కువగా పుస్తకాలు చదువుతూఉండేది. అందుకే వీరి కుమార్తె సృజనతో ఉన్నంత స్నేహపూర్వకంగా మరెవరితోనూ ఉండేవారు కాదు. వీరిది బౌద్ధగమనం. బౌద్ధ ధర్మంలో ప్రజ్ఞకు, కరుణకు గల వివాదాల్ని పరిష్కరించుకుంటూ బుద్ధుడు స్వయంగా ప్రవచించిన బౌద్ధ ధర్మానికి మూల స్తంభాలైన ప్రజ్ఞ, కరుణ కూడా ఒక మూలస్తంభమే అన్నది వీరు తేటతెల్లం చేస్తారు. బుద్ధిజం గురించి ఎక్కువగా రాసిన వారిలో లక్ష్మీ నరసు గారంటే పద్మారావు గారికి ఎక్కువ ఇష్టం. లక్ష్మీ నరసు గారినే డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కూడా చదివారు. లక్ష్మీనరసు తన "ఎసెన్స్ ఆఫ్ బుద్ధిజం" అనే గ్రంథంలో 'వుమెన్ ఇన్ బుద్ధిజం' అనే విభాగంలో స్త్రీలు బుద్ధిజంలోకి విరివిగా చేరారని రాశారు. అందువల్ల ఈ గ్రంథాన్ని పద్మారావు గారు పదేపదే చదవడం జరిగింది. అంబేద్కర్ గారికి కూడా ఈ గ్రంథమే మార్గదర్శకం అవ్వడం, పద్మారావు గారు ఈ గ్రంథాన్ని మరిన్నిసార్లు చదవటానికి దోహదపడింది. పద్మారావుకి గుడిపాటి చలం రచనలన్నా ఎక్కువ ఇష్టం. వీరు సంస్కృత కాలేజీలో పనిచేసేటప్పుడు బ్రాహ్మణ వీధుల్లో ఉండడంవల్ల ఎంతోమంది బ్రాహ్మణస్త్రీలు ఆచారాలచేత, సంప్రదాయాల చేత, పురుషాధిపత్యం చేత అణచివేసిన సంఘటనలను ఆయన కళ్లతో చూశారు.

పద్మారావు బుద్ధిజాన్ని స్త్రీవాద కోణం నుంచి అధ్యయనం చేశారు. సాంఖ్య, యోగ దర్శనాల గురించి వివరిస్తూ ఇవి రెండును ఒకే దర్శనం యొక్క రెండు విభాగాలు, ఒకటి సిద్ధాంత భాగం, రెండోది అనుష్టాన భాగం అని, సాంఖ్య దర్శన ద్రష్ట కపిల మహర్షి అని ఈ దర్శనం మిగుల ప్రాచీనమైనదని, ఈ కపిల మహర్షి 'సాంఖ్య ప్రవచన సూత్రం'లనే వేరే గ్రంథం కూడా రాశారని తెలియజేస్తారు. సాంఖ్యము అతి భౌతికవాదమును ద్వైత వాస్తవికతవాదమని వర్ణించవచ్చని, ప్రకృతి అని రెండు చరమ తత్వములను ఈ వాదం అంగీకరించును. అనేక పల్లెల్లో అత్తమామలు స్త్రీలను వేధించటాన్ని గమనించారు పద్మారావు. అటు గ్రామీణ ఇటు ఉద్యోగ దళిత స్త్రీలు కూడా హిందూ స్త్రీలతో సమానంగా బ్రాహ్మణ వాదాన్ని ఆచరిస్తున్నారు. హిందూ మతం మళ్లీ పునర్జీవనం కావడానికి అనేక సంస్థలు చేస్తున్న ప్రయత్నానికి కొన్ని దళిత వాడలు దోహదకరంగా ఉన్నాయి. ఈ రివైవలిజం 10శాతం దళిత ఉద్యోగుల్లో, దళిత వాడల్లో జరుగుతుంది. ఇది దక్షిణ భారతంలో కంటే ఉత్తర మధ్య భారతంలో ఎక్కువగా ఉంది. పీసీ జైన్ షెడ్యూల్ కాస్ట్ ఉమెన్‌లో చెప్పిన అంశాల్ని పద్మారావు ఇక్కడ కూలంకషంగా చర్చించారు.

వీరి అమ్మానాన్నలే గురువులని ఘంటాపథంగా కత్తి పద్మారావు వివరించారు. వాళ్ళ అమ్మానాన్న చెప్పిన విషయాల్లో ముఖ్యంగా నీకు నచ్చిన పని రోజు చేసుకో. పని ఆపవద్దు. ఉద్యోగాలు ఇవాళ వస్తాయి, రేపు పోతాయి. పని మాత్రం శాశ్వతం. అని పద్మారావులో వాళ్ళ తల్లిదండ్రులు తెచ్చిన నూతన ఉత్తేజాన్ని గురించి గుర్తు చేసుకుంటారు. ఉద్యోగానికి రాజీనామా చేసినప్పుడు నేను దిగులు పడింది జీతం గురించి కాదు పాఠం చెప్పే అవకాశం పోయింది అని ఆ జ్ఞాపకాలన్నీ నెమరు వేసుకుంటారు. క్లాసులు చెప్పే అవకాశం పోయిందని బాధపడినా ఆ తరువాత , క్లాసుల్లో చెప్పే పాఠాలకు మించిన విషయాల్ని వేలాది సభల్లో, విశ్వవిద్యాలయాల్లో, సదస్సుల్లో మాట్లాడగలిగానని, అది వారి తల్లిదండ్రులు ఇచ్చిన ఆత్మ విశ్వాసం అని అనేకసార్లు మరణం అంచుకు వెళ్ళినప్పటికీ భయపడకుండా అమరత్వాన్ని ఆహ్వానించి, ఆత్మస్థైర్యం వల్ల నిలబడి పుస్తకాలు కొనుక్కోవడం, అది ఎప్పుడు కొన్నాను తారీకుతో సహా నోట్ చేసుకోవడం, మొదటి పేజీలో పేరు రాసుకోవటం, నా పుస్తకాలన్నీ వారి సహచరిణీతో, పిల్లలతో కలిసి చదవటం ఉమ్మడి కుటుంబం అవడం వల్ల, తమ పిల్లలతో కలిసి పెరగడం, ఇవన్నీ కూడా ఈ మూడవ భాగంలో అనేక ఉప అంశాలను కూలంకషంగా చర్చిస్తూ అనేక చారిత్రక సంఘటనలను దృశ్యీకరించటమే కాకుండా భావితరాలకు విజ్ఞానవంతమైన ఒక చారిత్రక ఆధారంగా వాస్తవ సంఘటనలను చరిత్రగా కూర్చి రాబోయే తరాలకు చరిత్రలోని సత్యాసత్యాలను అందించారు. అనేక విషయాలను తర్కబద్ధంగా హేతుదృష్టితో, తాత్విక చింతనతో, చారిత్రక ఆధారాలతో రాజకీయ, ఆర్థిక, సామాజిక, సాంస్కృతిక చరిత్రను తమ జీవన చరిత్రగా అందించారు.

అనేక సామాజిక అంశాలను అనేకమంది చరిత్రకారుల, మేధావుల, తత్వవేత్తల రచనాధారాలతో పాఠకులకు అర్థమయ్యే సులభరీతిలో, ఏకబిగిన చదివించేలా ఆసక్తికరంగా తమ జీవిత అనుభవాలను, విశేషాలను, సమాజంలో జరుగుతున్న అనేక అసమానతలు, వివక్షతలు, అణచివేతలు, జెండర్ సమస్యలు, కులమత వైషమ్యాలు, వ్యవస్థీకృత లోపాలు, ప్రత్యామ్నాయ భావజాలం పరిష్కార మార్గాలను తమ అనుభవాన్ని రంగరించి అందించిన మహోత్కృష్ట గ్రంథం ఇది. దళిత బహుజన మైనారిటీలే కాక, ప్రతి ఒక్కరూ చదివి తెలుసుకోవలసిన, విజ్ఞానవంతులు కావలసిన, సత్యాసత్యాలను గ్రహించవలసిన గ్రంథంగా కత్తి పద్మారావు రచించిన అస్పృశ్యుని యుద్ధగాథ మూడో భాగం కనిపిస్తుంది. వీరి నిరంతర అధ్యయన క్రమం నుంచి ఆయన వెలికి తీసిన సామాజిక జీవన సత్యాలు ఈ గ్రంథంలో మనల్ని కదిలిస్తాయి. ఆయన గొప్ప కవిత్వ శిల్ప నిర్మాత. తాత్విక నిధి. త్యాగపూరితమైన జీవన గమనం ఆయనది. ప్రపంచమంతా తిరిగిన సుదీర్ఘ ప్రయాణ వీక్షణం, బౌద్ధ జీవన గమనం, పూలే, అంబేద్కర్ సిద్ధాంతాల వెలుగులతో ఆయన భారతీయ తత్వ శాస్త్రాన్ని కూలంకషంగా అధ్యయనం చేసిన క్రమం మనకు కనిపిస్తుంది.

ఈ గ్రంథం చదువుతుంటే మనకు ఎన్నో విలువైన పుస్తకాలు, వ్యక్తిత్వాలు, కవితా ప్రవాహికలు, పోరాట శక్తులు మనల్ని ప్రజ్వలింప చేస్తాయి. డాక్టర్ కత్తి పద్మారావు స్వీయ చరిత్ర అంటే సమకాలీన భారతదేశ చరిత్రే. ఆంధ్రుల పోరాట గాథే. ఆంధ్ర సాహిత్య సామాజిక సాంస్కృతిక చరిత్రే. ఆయన వ్యక్తిగా ఎప్పుడూ జీవించలేదు. సంఘ సంస్కృతి, నైతిక శక్తి, నిజాయితీ, ధీరోదాత్తత, ఆయన విలువలు. రూసో, బెర్ట్రాండ్ రస్సెల్, ఇంగర్ సాల్ వలె కత్తి పద్మారావు కూడా ఒక యుగ సంకేతమని ఈ గ్రంథం నిరూపిస్తుంది. ఈ గ్రంథంలోకి వెళ్లి మనము సామాజిక సాంస్కృతిక రాజకీయ యోధులమవుదాం. పెద్ద కౌశలాన్ని నేర్చుకుందాం. అస్పృశ్యుని యుద్ధ గాథ మన జీవితంలో పోరాట స్ఫూర్తిని నింపుతుంది. మనకు జ్ఞాన తృష్ణను కలిగిస్తుంది. వినూత్న భావనా సంపత్తిని మనకు కలగజేస్తుంది. మనలో అధ్యయన స్ఫూర్తిని నింపుతుంది. నిరంతర కవితా సృజన వల్ల, రచనా సృష్టి వల్ల మనల్ని మనం పునరుజ్జీవింప చేసుకోవచ్చు అనే ఒక జీవన సత్యాల్ని నేర్పుతుంది. అస్పృశ్యుని యుద్ధ గాథ చదువుతున్నప్పుడు మనలో అనేకమైన నూతన భావాల వెల్లువలొస్తాయి. జ్ఞాన ప్రవాహములో మనం ప్రపంచ వ్యక్తిత్వాల దర్శనం చేసుకుంటాము. కుల నిర్మూలనా భావనా చైతన్యం, ఆచరణా సంస్కృతి మనలో కలుగుతుంది. ముఖ్యంగా పద్మారావు సహచరిణి స్వర్ణ కుమారి, ఆయన కుటుంబం రచన వ్యవస్థగా ఏర్పడి భారతదేశానికి అందించిన వెలుగులు మనల్ని వెలిగిస్తాయి. మన జీవితం మనకు అనేక సందర్భాల్లో అద్దంలో కనిపిస్తుంది. అనేక వాస్తవ జీవన దృశ్యాలు మనల్ని కదిలిస్తాయి. మన మెదడుకు పదును పెడతాయి. మన హృదయాంతరాళాల్లో దాగిన ప్రేమ సముద్రాలు పొంగుతాయి. ఇవి అక్షరాలు కాదు, ఆత్మీయతలు, అనురాగాలు, ఉత్తేజాలు, ప్రేరణలు.

ఈ గ్రంథం చదవడం ద్వారా మనలో దాగిన అనేక శక్తులు మన నుంచి బయటకు వస్తాయి. మనల్ని యుద్ధవీరులుగా మారుస్తాయి. అందుకే అస్పృశ్యుని యుద్ధగాథ గ్రంథాలను మన కరదీపికలుగా చేసుకుందాం. భారతదేశ మరో స్వాతంత్ర్యపోరాట మార్గంలో మనమూ యుద్ధ యోధులమవుదాం. ధరించండి పుస్తక మంజీరాలను, పుస్తక ఆయుధాలను.

బండి రుక్మిణీ ప్రసన్న, 8985358149

'చైల్డ్ పోర్న్' అంశంపై నేడు సుప్రీం తీర్పు

న్యూఢిల్లీ: పిల్లల అశ్లీల చిత్రాలను ప్రైవేట్‌గా చూడటం... లైంగిక నేరాల నుంచి పిల్లల రక్షణ (పోక్సో) చట్టం కింద నేరంగా పరిగణించబడుతుందా లేదా అనే ప్రశ్నపై సుప్రీంకోర్టు సోమవారం తన తీర్పును వెలువరించనుంది. పిల్లల అశ్లీల చిత్రాలను డౌన్‌లోడ్ చేయడం, చూడటం పోక్సో చట్టం, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ చట్టం ప్రకారం నేరం కాదని మద్రాస్ హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌పై ప్రధాన న్యాయమూర్తి డివై చంద్రచూడ్, న్యాయమూర్తులు జెబి పార్దివాలా, మనోజ్ మిశ్రాలతో కూడిన ధర్మాసనం తీర్పు వెలువరించే అవకాశం ఉంది. జనవరి 11న, తన మొబైల్ ఫోన్‌లో పిల్లలతో కూడిన అశ్లీల కంటెంట్‌ను డౌన్‌లోడ్ చేశాడని అభియోగాలు మోపిన 28 ఏళ్ల వ్యక్తిపై క్రిమినల్ చర్యలను మద్రాస్ హైకోర్టు రద్దు చేసింది.

నేడు స్పీకర్ల సదస్సు ప్రారంభించనున్న ఓంబిర్లా

న్యూఢిల్లీ: కామన్వెల్త్ పార్లమెంటరీ అసోసియేషన్ ఇండియా రీజియన్ రెండు రోజుల సదస్సును లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా సోమవారం ప్రారంభించనున్నారు. రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల శాసనసభల స్పీకర్లు, అధికారులు ఈ సమావేశానికి హాజరవుతారు. 'సుస్థిర, సమ్మిళిత అభివృద్ధిని సాధించడంలో శాసన సభల పాత్ర' అనే అంశంపై చర్చిస్తారని లోక్‌సభ సెక్రటేరియట్ ఒక ప్రకటనలో తెలిపింది. నలుగురు చైర్‌పర్సన్‌లు, 25 మంది స్పీకర్లు, ముగ్గురు డిప్యూటీ చైర్‌పర్సన్‌లు, 14 మంది డిప్యూటీ స్పీకర్లు ఈ సదస్సుకు హాజరుకానున్నారు. ఈ సదస్సుకు ముందు కామన్వెల్త్ పార్లమెంటరీ అసోసియేషన్ యొక్క ఇండియా రీజియన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ సమావేశం జరుగుతుంది. అసోసియేషన్ ఇండియన్ రీజియన్ 2004లో ఏర్పాటైంది.

రక్తదానంపై బీజేపీ నేత పోజు

లక్నో: ప్రధాని మోదీ పుట్టిన రోజును పురస్కరించుకుని ఈ నెల 17న నిర్వహించిన రక్తదాన శిబిరం అభాసుపాలైంది. ఉత్తర ప్రదేశ్‌లోని మొరాదాబాద్ బీజేపీ కార్యాలయంలో నిర్వహించిన ఈ శిబిరంలో ఆ పార్టీ సీనియర్ నేత, స్థానిక మేయర్ వినోద్ అగర్వాల్ రక్తదానం చేయకపోయినప్పటికీ చేసినట్టుగా కెమెరా ముందు నటించి అందరినీ నమ్మించే ప్రయత్నం చేశారు. ఆయన రక్తపోటును పరిశీలించేందుకు ఓ ఆరోగ్య సంరక్షణ కార్యకర్త సిద్ధమవడంతో ఆ ప్రక్రియను కొనసాగించవద్దని ఆయన వైద్యుడిని కోరారు. ఆ తర్వాత ఆ వైద్యుడు సూదిని బయటకు తీయగానే అగర్వాల్ మంచం దిగి ఆ గది నుంచి వెళ్లిపోయారు. కెమెరా కోసం నకిలీ రక్తదానం చేశారంటూ పలువురు ఆయనపై విమర్శలు గుప్పించారు.

భారీ చోరీ... రూ.2 కోట్ల నగదు ఎత్తుకెళ్లిన దొంగలు

హైదరాబాద్: నగరశివారు పోచారం ఐటీ కారిడార్ పోలీస్‌స్టేషన్ పరిధిలో దొంగతనం జరిగింది. మక్త గ్రామంలోని నాగభూషణం అనే వ్యక్తి ఇంట్లో రూ.రెండు కోట్లకు పైగా నగదును దుండగులు చోరీ చేశారు. ఇంటి తాళాలను పగులగొట్టి బీరువాలో ఉంచిన నోట్ల కట్టలను ఎత్తుకెళ్లారు. బాధితుడు ఫిర్యాదు చేయడంతో పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని పరిశీలించి విచారణ చేపట్టారు. పోలీసుల వివరాల ప్రకారం... నాగభూషణం ఇటీవల శంకర్‌పల్లిలో 10 ఎకరాల భూమి విక్రయానికి ఒప్పందం చేసుకున్నారు. కొనుగోలుదారులు అడ్వాన్స్‌గా రూ.రెండు కోట్ల రెండు లక్షల నగదు ఇవ్వడంతో ఇంట్లో ఉంచారు. ఆ నగదుతో పాటు 28 తులాల బంగారు నగలను దొంగలు ఎత్తుకెళ్లారు. నాగభూషణం వద్ద డ్రైవర్‌గా పనిచేస్తున్న వ్యక్తిపై అనుమానంతో పోలీసులు అతడిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

పని ఒత్తిడితో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఆత్మహత్య!

చెన్నై: పని ఒత్తిడి తట్టుకోలేక సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు ఆత్మహత్యలకుపాల్పడుతున్న ఘటనలు ఇటీవల పెరుగుతున్నాయి. తీవ్రమైన ఒత్తిడితో బాధపడుతున్న 38 ఏళ్ల సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ చెన్నైలోని తన ఇంట్లో ఆత్మహత్యకు చేసుకున్నాడు. పని ఒత్తిడి కారణంగానే తన భర్త ఆత్మ హత్య చేసుకొని ఉంటాడని ఆయన భార్య అనుమానం వ్యక్తం చేసినట్లు పోలీసులు తెలిపారు. తమిళనాడులోని తేని జిల్లాకు చెందిన కార్తికేయన్ భార్య, ఇద్దరు పిల్లలతో చెన్నైలో నివసిస్తున్నారు. గత 15 ఏళ్లుగా ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీలో కార్తికేయ టెక్కీగా పని చేస్తున్నారు. తీవ్రమైన పని ఒత్తిడితో ఇబ్బంది పడుతున్నారు. రెండు నెలలుగా ఆయన ఒత్తిడికి చికిత్స పొందుతున్నారని పోలీసులు తెలిపారు. ఘటన సమయంలో కార్తికేయ ఇంట్లో ఒంటరిగా ఉన్నాడు.

మణిపూర్‌ను మరో అఫ్గాన్ చేస్తారా?

కేంద్రానికి కాంగ్రెస్ ఎంపీ ప్రశ్న

న్యూఢిల్లీ: ఈశాన్య రాష్ట్రం మణిపూర్ రగిలిపోతుంటే కేంద్రం చోద్యం చూస్తోందని కాంగ్రెస్ ఎంపీ విమల్ అకోయిజమ్ ఆగ్రహం వ్యక్తంచేశారు. మణిపూర్‌ను అఫ్గనిస్థాన్ దేశంలా మారుస్తారా అని మండిపడ్డారు. ఉత్తరప్రదేశ్, రాజస్థాన్, బీహార్, మధ్యప్రదేశ్‌లో ఇలా జరిగివుంటే ప్రేక్షక పాత్రే పోషించేవారా? మణిపూర్ అంటే చిన్నచూపా? ఇది భారత్‌లో భాగం కాదా? బనానా రిపబ్లిక్‌లో ఉందా? అంటూ కేంద్రాన్ని నిలదీశారు. సమస్యను పరిష్కరించకుండా చోద్యం చూస్తారా అని దుయ్యబట్టారు. 60వేల బలగాలు మణిపూర్‌లో ఉన్నాగానీ సంక్షోభాన్ని నివారించకపోగా, ఇంత కాలం కొనసాగనివ్వడం కేంద్రప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని వ్యాఖ్యానించారు. ఎంపీ బిమల్ పీటీఐకి ఇచ్చిన ఇంటర్వ్యూలో కేంద్రం తీరును విమర్శించారు. 2022 మే 3వ తేదీ నుంచి మణిపూర్ అట్టుడికిపోతోందని, రాష్ట్ర ప్రభుత్వ సమస్యలను పరిష్కరించే చిత్తశుద్ధి కేంద్రానికి లేదని అన్నారు. బీజేపీ ఎమ్మెల్యేల రెండు నాల్కెల ధోరణిని తప్పుపట్టారు. మణిపూర్ సంక్షోభానికి కేంద్రమే కారణమన్నారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు క్షీణిస్తుండటంపై ఆవేదన వ్యక్తంచేశారు. మణిపూర్... మరో అఫ్గాన్‌గా మారుతోందా అని కాకుండా అందుకు కేంద్రప్రభుత్వం అనుమతిస్తోందా అని ప్రశ్నించడమే సబబుగా ఉంటుందని అన్నారు.

మణిపూర్ అస్థిరతకు కుట్ర జరిగిందని, రాష్ట్రాన్ని చీల్చే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. తెర వెనుక నుంచి ఏదో శక్తి ఈ వ్యవహారాన్ని నడిపిస్తోందన్నారు. పోలీసులతో పాటు భద్రతా దళాలపై, రాష్ట్ర వ్యవస్థలపై నమ్మకం పోయిందని, రాష్ట్ర చట్టబద్ధత ప్రశ్నార్థకమైందని అన్నారు. తాజా హింస మినహా మణిపూర్ ప్రశాంతంగా ఉందని హోంమంత్రి అమిత్‌షా అనడాన్ని బిమల్ ఖండించారు. ప్రభుత్వ ప్రకటనలతో స్పష్టత రాకపోగా మరింత గందరగోళం నెలకొంటోందని విమర్శించారు.

గతంలో ఎన్నడూ జరగని భీకర పోరు, తీవ్ర పరిస్థితుల దృష్ట్యా కుకీ, మయితే వర్గాల మధ్య శాంతి నెలకొల్పడం కష్టసాధ్యమన్న అభిప్రాయాన్ని ఆయన వ్యక్తంచేశారు. భద్రతపై అనుమానాలు ఉన్నాయని, కొన్ని సాయుధ దళాలే హింసనే ప్రేరేపించాయని, పోరులకు ఆయుధాలు ఇచ్చాయని ఆరోపణలు ఉన్నట్లు తెలిపారు. ఆ వర్గాలపై నిందలు మోపడంతో పరిస్థితి మరింత జఠిలమవుతోందన్నారు. మణిపూర్‌లో శాంతి-సుస్థితకు యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టి భవిష్యత్‌కు హామీనివ్వడం కేంద్రప్రభుత్వ బాధ్యతని బిమల్ నొక్కిచెప్పారు.

బీజేపీలో చేరకుంటే జైల్లోనే చంపేస్తామన్నారు

మనీశ్ సిసోడియా

న్యూఢిల్లీ: తాను అనుభవించిన జైలు జీవితం గురించి దిల్లీ మాజీ డిప్యూటీ సీఎం మనీశ్ సిసోడియా తాజాగా వెల్లడించారు. పార్టీ మారకపోతే తనను జైల్లోనే చంపేస్తామన్న బెదిరింపులు వచ్చాయన్నారు. ఆప్ అధ్వర్యంలో దిల్లీ జంతర్ మంతర్ వద్ద జరిగిన 'జనతాకీ అదాలత్' కార్యక్రమంలో సిసోడియా మాట్లాడారు. 'జైల్లో నన్ను బెదిరించేందుకు ప్రయత్నాలు జరిగాయి. మద్యం కేసులో కేజ్రీవాలే నా పేరు చెప్పి... ఇరికించారని చెప్పేవారు. కోర్టు ముందు కేజ్రీవాల్ గురించి చెబితే... నన్ను కాపాడతామని అన్నారు. తమ పార్టీలో చేరాలని బీజేపీకి చెందిన వ్యక్తుల నుంచి ఒత్తిడి వచ్చింది' అని సిసోడియా ఆరోపించారు. 'జైల్లోనే నన్ను మానసికంగా కుప్పకూల్చేందుకు ప్రయత్నించారు. బీజేపీలో చేరకుంటే చంపేస్తామన్నారు. నువ్వు చనిపోతే నీ గురించి ఆలోచించేవారేవరూ లేరని చెప్పేవారు. అనారోగ్యంతో ఉన్న నీ భార్య గురించి ఆలోచించుకోవాలని, కుమారుడి భవిష్యత్తు దృష్టిలో పెట్టుకుని నిర్ణయం తీసుకోవాలన్నారు. మొత్తానికి నాపై ఒత్తిడి పెంచేందుకు తీవ్రంగా ప్రయత్నించారు. కానీ, ఏమీ చేయలేకపోయారు. కేజ్రీవాల్ పదవికి రాజీనామా చేయడంతో ప్రజలంతా ఆందోళన చెందుతున్నారు. వచ్చే ఎన్నికల్లో తప్పకుండా ఆయనే మరోసారి సీఎంగా బాధ్యతలు స్వీకరిస్తారు' అని గెలుపుపై ధీమా వ్యక్తం చేశారు. తాను జైల్లో ఉన్నప్పుడు తన కుటుంబం ఎదుర్కొన్న ఇబ్బందుల గురించి సిసోడియా తెలిపారు.

'తాను జర్నలిస్టుగా పని చేసినప్పుడు 2002లో రూ.ఐదు లక్షలతో ఒక ఫ్లాట్ కొన్నా. నా బ్యాంకు ఖాతాలో రూ. 10 లక్షలు ఉండేవి. వాటిని నా కుమారుడి ఫీజు కోసం దాచా... ఈడీ అకౌంట్‌ను స్తంభింపజేసింది. అలాంటి సమయంలో ఫీజు కోసం చాలా మందిని సహాయం అడగాల్సి వచ్చింది' అని వివరించారు. కాగా, మద్యం కుంభకోణం కేసులో సిసోడియా దాదాపు 17 నెలలు జైల్లో ఉన్నారు. బెయిల్‌పై విడుదలైన ఆయన తాను ఎదుర్కొన్న సమస్యలను తాజాగా వివరించారు.

పండుగ సీజన్‌లో ప్రత్యేక 'టికెట్ చెక్ డ్రైవ్'

రైల్వేశాఖ నిర్ణయం

న్యూఢిల్లీ: రానున్న పండుగ సీజన్‌ను దృష్టిలో పెట్టుకుని పోలీసులతో సహా రైళ్లలో టికెట్ లేకుండా ప్రయాణించేవారి భరతం పట్టేందుకు రైల్వేశాఖ సిద్ధమైంది. అక్టోబర్ 1 నుండి 15 వరకు, అక్టోబర్ 25 నుండి నవంబర్ 10 వరకు టికెట్ లేని ప్రయాణికులను పట్టుకునేందుకు ప్రత్యేక డ్రైవ్ ప్రారంభించాలని, 1989 రైల్వే చట్టంలోని నిబంధనలకు అనుగుణంగా ఉల్లంఘనదారులపై తగిన చర్యలు తీసుకోవాలని మంత్రిత్వ శాఖ సెప్టెంబర్ 20 న 17 జోన్ల జనరల్ మేనేజర్‌లకు లేఖ రాసింది. పండుగ రద్దీలో సాధారణ ప్రజలతో పాటు పోలీసులు కూడా తమ దృష్టిలో ఉంటారని వివిధ రైల్వే డివిజన్లలో కొనసాగుతున్న రెగ్యులర్ డ్రైవ్‌లో భాగమైన రైల్వే కమర్షియల్ అధికారులు చెబుతున్నారు. టికెట్ లేకుండా ప్రయాణం చేస్తున్నవారిలో పోలీసులే అగ్రస్థానంలో ఉన్నారని వారంటున్నారు. 'ఘజియాబాద్-కాన్పూర్ మధ్య ఇటీవల మా ఆకస్మిక తనిఖీలో, వివిధ ఎక్స్‌ప్రెస్, మెయిల్ రైళ్లలో ఏసీ కోచ్‌లలో వందలాది మంది పోలీసులు ఎలాంటి టికెట్ లేకుండా ప్రయాణిస్తున్నట్లు కనుగొన్నాము. మేము వారికి జరిమానా విధించగా... మొదట వారు చెల్లించడానికి నిరాకరించారు. తీవ్రస్థాయిలో మమ్మల్ని బెదిరించారు' అని రైల్వే అధికారి ఒకరు తెలిపారు. అయితే మేము ఏమాత్రం భయపడకుండా వారినుంచి జరిమానా చెల్లింపచేశాం. పోలీసు సిబ్బందిపై చర్యలు తీసుకోవడంతో ప్రయాణికులు కూడా చాలా సంతోషించారు. వారి ప్రతిస్పందన బాగుందని తెలిపారు. చెల్లుబాటు అయ్యే టిక్కెట్‌లతో ప్రయా ఇబ్బందిని సృష్టిస్తున్నందున పోలీసులు, ఇతర అనధికార ప్రయాణికులపై దృష్టి పెట్టాలని వారు కోరుతున్నారని తెలిపారు. ఇటీవలి కాలంలో టికెట్ లేకుండా ప్రయాణిస్తూ పట్టుబడిన పోలీసుల సంఖ్య గురించి ప్రశ్నించగా... 'మేము పోలీసుల కోసం ప్రత్యేక డేటాను నిర్వహించడం లేదు, అయితే, గత మూడు నెలల్లో అంటే... జూన్, జులై, ఆగస్టులో ఎన్‌సిఆర్ జోన్ పరిధిలోని ప్రయాగ్‌రాజ్ డివిజన్‌లో టికెట్ లేని 1,17,633 మంది ప్రయాణికులకు రూ. 9,14,58,171 జరిమానా విధించబడింది' అని ప్రయాగ్‌రాజ్ డివిజన్‌కు చెందిన రైల్వే ప్రతినిధి వెల్లడించారు.

తమిళనాడులో కుప్పకూలిన ఫ్లైఓవర్

చెన్నై: తమిళనాడులో నిర్మాణంలో ఉన్న ఫ్లైఓవర్ కుప్పకూలింది. శిథిలాల కింద వందలాది మంది కార్మికులు చిక్కుకున్నారు. ఘటనా స్థలంలో సహాయక చర్యలు ముమ్మరంగా జరుగుతున్నాయి. వివరాల్లోకి వెళితే... తమిళనాడులోని తిరుపత్తూరు జిల్లాలో అంబూర్ బస్టాండ్ ఎదురుగా చెన్నై-బెంగళూరు జాతీయ రహదారిపై నిర్మాణంలో ఉన్న ఫ్లైఓవర్ శనివారం అర్ధరాత్రి ఒక్కసారిగా కూలిపోయింది. ఈ క్రమంలో వందలాది మంది కార్మికులు శిథిలాల కింద చిక్కుకున్నారు. ఘటనా స్థలంలో రాత్రి నుంచి సహాయక చర్యలు ముమ్మరంగా జరుగుతున్నాయి. రక్షణ బృందం ఇప్పటి వరకు 22 మందిని కాపాడింది. వారిలో ఆరుగురి పరిస్థితి విషమంగా ఉన్నట్టు తెలిసింది.

కెంపన్న కమిషన్ నివేదిక సమర్పించండి

కర్నాటక సీఎస్‌కు గవర్నర్ లేఖ

బెంగళూరు: నగరంలోని అర్కావతి లేఅవుట్‌లోని 541 ఎకరాల భూమిని అక్రమంగా డీనోటిఫై చేశారన్న ఆరోపణలకు సంబంధించి కెంపన్న కమిషన్ నివేదిక తనకు పంపవలసిందిగా కర్నాటక గవర్నర్ థావర్‌చంద్ గెహ్లాట్ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు చీఫ్ సెక్రటరీ షాలినీ రజనీష్‌కు గవర్నర్ లేఖ రాశారు. అయితే రాష్ట్ర ప్రభుత్వం నుంచి తమకు నివేదిక అందలేదని రాజ్‌భవన్ వర్గాలు వెల్లడించాయి. 2013 నుంచి 2018 వరకు సిద్ధరామయ్య ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో బెంగళూరు డెవలప్‌మెంట్ అథారిటీ (బీడీఏ) ద్వారా లేఅవుట్ ఏర్పాటు చేసేందుకు సేకరించిన భూముల డీనోటిఫికేషన్‌లో జరిగిన అక్రమాలపై విచారణ జరిపేందుకు 2014లో రిటైర్డ్ హైకోర్టు న్యాయమూర్తి హెచ్‌ఎస్ కెంపన్న నేతృత్వంలో కమిషన్‌ను ఏర్పాటు చేశారు. సిఎంగా సిద్ధరామయ్య తొలివిడత పదవీకాలం ముగియకముందే 2017లో కమిషన్ తన నివేదికను సమర్పించింది. ఈ నివేదికను బయటపెట్టాలని కొందరు బీజేపీ నేతలు డిమాండ్ చేసినా బహిరంగంగా వెల్లడించలేదు. 'కొంతమంది గవర్నర్‌కు ఫిర్యాదు చేసిన తర్వాతే ఆయన వివరాలు కోరడం జరిగింది. రాష్ట్ర ప్రభుత్వ స్పందన కోసం మేము ఎదురుచూస్తున్నాము' అని రాజ్‌భవన్ అధికారి వెల్లడించారు. మైసూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (ముడా)లో భూ కుంభకోణంలో ముఖ్యమంత్రి సిద్ధరామయ్యను విచారించడానికి గవర్నర్ అనుమతించిన నేపథ్యంలో తాజాగా ఈ అంశం వెలుగులోకి రావడం ప్రాధాన్యత సంతరించుకుంది. కాగా కొప్పల్‌లో విలేకరులతో ముఖ్యమంత్రి సిద్ధరామయ్య మాట్లాడుతూ కెంపన్న కమిషన్ నివేదికను కోరుతూ గవర్నర్ రాసిన లేఖను తమ ప్రభుత్వం పరిశీలిస్తుందని చెప్పారు.

వరద బాధితులకు తక్షణమే నిధులు

ప్రధాని మోదీకి మమత రెండో లేఖ

కోల్‌కతా: వరద బాధితులకు వెంటనే నిధులు మంజూరు చేయాలని పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ప్రధాని నరేంద్ర మోదీకి విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో సంభవించిన వరదలపై దీదీ మోదీకి రెండో లేఖ రాశారు. 50 లక్షల మంది ప్రజలు వరదల బారిన పడి తీవ్రంగా నష్టపోయారన్నారు. తక్షణం కేంద్రం నిధులు మంజూరు చేయాలని ఆమె ఆ లేఖలో కోరారు. తమ ప్రభుత్వ అనుమతి లేకుండా దామోదర్ వ్యాలీ కార్పోరేషన్ రిజర్వాయర్ల నుంచి నీటిని విడుదల చేయడంతో అనేక జిల్లాలు నీట మునిగాయని పేర్కొన్నారు. ప్రధానికి రాసిన తొలి లేఖపై కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్ స్పందిస్తూ... డీవీసీ రిజర్వాయర్ల నుంచి నీటి విడుదలపై ప్రతి దశలోనూ రాష్ట్ర అధికారులకు తగిన సమాచారం ఇచ్చామని వివరణ ఇచ్చారు. దీనిపై మమత స్పందిస్తూ...'డీవీసీ డ్యామ్‌ల నుంచి నీటి విడుదల అనేది దామోదర్ వ్యాలీ రిజర్వాయర్ రెగ్యులేషన్ కమిటీ అనుమతి, సహకారంతో జరుగుతుంది. పశ్చిమ బెంగాల్ ప్రభుత్వ ప్రతినిధులతో కూడా సంప్రదించాల్సి ఉంటుంది. అయితే... అలా జరగలేదు. అన్ని కీలక నిర్ణయాలను కేంద్ర జల కమిషన్ ప్రతినిధులు, జలశక్తి మంత్రిత్వశాఖ, కేంద్రం ఎటువంటి సంప్రదింపులు జరపకుండా ఏకపక్షంగా తీసుకున్నారు' అని ఆరోపించారు. కొన్ని సందర్భాల్లో రాష్ట్రప్రభుత్వానికి ఎటువంటి నోటీసులు లేకుండా నీటిని విడుదల చేశారని మమత తప్పుపట్టారు. రాష్ట్ర అభిప్రాయాలను కనీసం గౌరవించలేదన్నారు. ఇక రిజర్వాయర్ల నుంచి నీటిని తొమ్మిది గంటల పాటు ఏకధాటిగా విడుదల చేయడానికి ముందు స్వల్ప వ్యవధిలో సమాచారం ఇచ్చారన్నారు. ఆ కొద్దిసేపట్లో అత్యవసర సహాయక చర్యలు తీసుకోవడం సాధ్యం కాలేదన్నారు.

రైలు పట్టాలపై గ్యాస్ సిలిండర్

తప్పిన పెను ప్రమాదం

లక్నో: రైలు పట్టాలపై గ్యాస్ సిలిండర్ అమర్చిన ఘటన ఆదివారం ఉత్తర్ ప్రదేశ్‌లోని కాన్పూర్‌లో చోటుచేసుకొంది. ప్రేమ్‌పుర్ రైల్వే స్టేషన్ సమీపంలో దిల్లీ-హౌరా రైలు మార్గంపై దీనిని గుర్తించారు. రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్, రైల్వే పోలీసులు అక్కడకి చేరుకుని పరిశీలిస్తున్నారు. పట్టాలపై ప్రమాదాన్ని గుర్తించే సమయానికి లూప్‌లైన్‌లో కాన్పూర్ నుంచి ప్రయాగ్‌రాజ్‌కు ఒక గూడ్స్ రైలు వెళుతోంది. ఎక్స్‌ప్రెస్ రైలుకు దారి ఇచ్చే క్రమంలో దాన్ని ఆపాల్సి వచ్చింది. అప్పుడు లోకోపైలట్ సిలిండర్‌ను గమనించి తక్షణమే అధికారులకు సమాచారం ఇవ్వడంతో పెను ప్రమాదం తప్పింది. రైళ్లను పట్టాలు తప్పించి, ప్రమాదాలకు గురిచేసేలా కుట్రపూరిత ప్రయత్నాలు ఇటీవల పెరిగాయని కేంద్రం పేర్కొంది. ఆగస్టు నుంచి ఈ తరహాలో 18 ఘటనలు వెలుగుచూశాయని రైల్వేశాఖ తెలిపింది. కొందరు దుండగులు పట్టాలపై ఎల్‌పీజీ సిలిండర్లు, సైకిళ్లు, ఇనుప రాడ్లు, సిమెంట్ ఇటుకలను పెట్టి, రైలుకు ప్రమాదం తలపెట్టేలా దుశ్చర్యలకు పాల్పడుతున్న ఘటనలు ఉన్నాయని పేర్కొంది. గత ఏడాది జూన్ నుంచి ఈ తరహాలో 24 ఘటనలు జరిగాయని భారత రైల్వే నివేదిక వెల్లడించింది. అత్యధికంగా ఉత్తర్‌ప్రదేశ్, పంజాబ్, ఝార్ఖండ్, రాజస్థాన్, మధ్యప్రదేశ్, ఒడిశా, తెలంగాణలో ఈ కుట్రపూరిత యత్నాలు బయటపడ్డాయి. గత నెలలో కాన్పూర్ సమీపంలో సబర్మతి ఎక్స్‌ప్రెస్‌లో 20 బోగీలు పట్టాలు తప్పాయి. ట్రాక్‌పై ఉంచిన ఓ వస్తువు కారణమని తేలింది. ప్రాణనష్టం జరగకపోవడంపై అంతా ఊపిరి పీల్చుకున్నారు. ఇదిలాఉంటే... ఆదివారం మరోసారి కాన్పూర్, రాజస్థాన్‌లోని అజ్మీర్‌లోను ఈ ఘటనలు వెలుగుచూశాయి. ప్రయాగ్‌రాజ్ నుంచి భివానీకి వెళ్తున్న కాళింది ఎక్స్‌ప్రెస్ కాన్పూర్ సమీపంలో పట్టాలపై ఉన్న గ్యాస్ సిలిండర్‌ను ఢీకొట్టింది. ట్రాక్‌పై ఏదో అనుమానాస్పద వస్తువు ఉన్నట్లు గుర్తించిన లోకోపైలట్... వెంటనే అత్యవసర బ్రేకులు వేశారు. అయినప్పటికీ రైలు ఆ సిలిండర్‌ను ఢీకొనడంతో అది పట్టాలకు కొంత దూరంలో ఎగిరిపడింది. అయితే రైలుకు ఎలాంటి ప్రమాదం జరగలేదు. లోకో పైలట్, రైల్వే గార్డు దీనిపై పోలీసులకు సమాచారమిచ్చారు. పట్టాల సమీపంలో ధ్వంసమైన సిలిండర్‌తో పాటు ఒక పెట్రోల్ బాటిల్, అగ్గిపెట్టె, నాలుగు గ్రాముల పేలుడు పదార్థాన్ని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అజ్మీర్ సమీపంలోని పట్టాలపై సిమెంట్ బ్లాక్స్‌ను అధికారులు గుర్తించడంతో ప్రమాదం తప్పింది. ఈ పట్టాలు తప్పించే కుట్రలు ఎంతో కాలం సాగవని ఇటీవల కేంద్ర మంత్రి అమిత్‌షా హెచ్చరించారు. ఇప్పటికే వీటిపై దర్యాప్తును తీవ్రం చేశామని పేర్కొన్నారు. నిందితులను కఠినంగా శిక్షిస్తామని హెచ్చరించారు.

బంగ్లాదేశ్ నుంచి భారత్‌కు 3 వేల టన్నుల హిల్సా చేపలు

కోల్‌కతా: త్వరలో మూడు వేల టన్నుల పద్మాపులస (హిల్సా) చేపలను భారతదేశానికి ఎగుమతి చేసేందుకు బంగ్లా ప్రభుత్వం ఆమోదం తెలిపింది. బంగ్లా మాజీ ప్రధాని షేక్ హసీనా ప్రభుత్వం కూలిపోయి, తాత్కాలిక ప్రభుత్వం ఏర్పడటంతో ఈ ఏడాది భారతదేశానికి హిల్సా చేపల ఎగుమతిని నిషేధిస్తున్నట్లు ఈ నెల ప్రారంభంలో పేర్కొంది. ఇదిలా ఉండగా, పశ్చిమ బెంగాల్‌లో దేవీ నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తారు. ఈ సందర్భంగా తమ ఇళ్లలో హిల్సాను వండుకొని తింటారు. కొంత మంది బెంగాల్ ప్రజలు వీటిని పూజల్లో నైవేద్యంగా సమర్పిస్తారు. ప్రతిఏటా దుర్గా పూజ సమయానికి బంగ్లాదేశ్... భారత్‌కు హిల్సా చేపలను ఎగుమతి చేస్తుంది. సాధారణంగా కోల్‌కతా మార్కెట్లలో కిలో హిల్సా ధర దాదాపు రూ.వెయ్యి ఉంటుంది. బంగ్లాదేశ్‌లోని పద్మా నదిలో ఈ చేపలు పుడతాయి. అందుకే వీటికి పద్మా పులస అనే పేరొచ్చింది. ప్రపంచంలో దాదాపు 70 శాతం హిల్సాలు బంగ్లాదేశ్‌లో ఉత్పత్తి అవుతాయి. 2012లో తీస్తా నది నీటి భాగస్వామ్య ఒప్పందంపై భారత్‌కు, బంగ్లాకు మధ్య విభేదాలు తలెత్తడంతో ఈ చేపల ఎగుమతిపై నిషేధం విధించింది. ఈ కారణంగా పశ్చిమబెంగాల్ మార్కెట్లలో వీటి ధరలు విపరీతంగా పెరిగిపోయాయి. భారతదేశం-బంగ్లాదేశ్ సరిహద్దులో హిల్సా చేపల స్మగ్లింగ్ మొదలైంది. దీంతో 2022లో అప్పటి బంగ్లా ప్రధాని షేక్ హసీనా నిషేధాన్ని ఎత్తేశారు.

ప్రాణాంతక సూపర్ బగ్స్

25 ఏళ్లలో 4 కోట్ల మరణాలు

ఆధునిక వైద్యానికి పెద్ద సవాల్!

లాన్సెట్ అధ్యయనం

న్యూఢిల్లీ: వచ్చే 25 ఏళ్లలో డ్రగ్-రెసిస్టెంట్ (ఔషధ నిరోధక) సూపర్‌బగ్స్ మరణమృదంగం మోగిస్తాయని ఒక అధ్యయనం పేర్కొంది. ఈ సూపర్‌బగ్స్ వల్ల కలిగే ఇన్ఫెక్షన్లతో వచ్చే 25 ఏళ్లలో అంటే 2050 నాటికి నాలుగు కోట్ల మంది ప్రాణాలు కోల్పోతారని హెచ్చరించింది. ఈ విపత్తు నివారించాలంటే ప్రత్యక్ష -పటిష్ఠ చర్యలను ఇప్పుడే తీసుకోవాలని పరిశోధకులు విజ్ఞప్తి చేస్తున్నారు. సూపర్ బగ్స్ అంటే బాక్టీరియా లేక ఫాతోజెన్స్(వ్యాధికారకాల) రూపాలు. వీటిపై యాంటీబయోటిక్స్ పనిచేయవు. వీటివల్ల వచ్చే ఇన్ఫెక్షన్లకు వైద్యం కష్టసాధ్యం. ఈ పరిస్థితులు ప్రపంచ ఆరోగ్య విపత్తుకు దారి తీస్తాయి. కాలక్రమేణ సూబర్ బగ్స్ ప్రపంచాన్ని ఏ విధంగా... ఎంత మేరకు ప్రభావితం చేయగలవనే అంశమై జరిగిన తొలి అంతర్జాతీయ అధ్యయనంగా తాజా విశ్లేషణ నిలిచింది.

ఏటా 10 లక్షలకుపైగా మరణాలు

1990-2021 మధ్య కాలంలో యాంటీ మైక్రోబియల్ రెసిస్టెన్స్ (ఏఎంఆర్)గా వ్యవహరించే సూపర్‌బగ్స్‌తో ఏటా 10 లక్షలకుపైగా మరణాలు సంభవిస్తున్నట్లు 'గ్రామ్' అధ్యయనం తేల్చినట్లు లాన్సెట్ జర్నల్ తెలిపింది. సూపర్‌బగ్స్ వల్ల ఐదేళ్లలోపు పిల్లల్లో మరణాల శాతం గత మూడు దశాబ్దాల్లో 50శాతానికిపైగా తగ్గింది. పిల్లల్లో అంటువ్యాధుల నియంత్రణకు మెరుగైన చర్యలు తీసుకోవడంతోనే ఇది సాధ్యమైనట్లు అధ్యయనం వెల్లడించింది. పిల్లలు ఇప్పుడు ఇటువంటి సూపర్‌బగ్ ఇన్‌ఫెక్షన్ల బారిన పడితే వైద్యం చాలా కష్టమవుతుందని పరిశోధకులు తెలిపారు. మూడు దశాబ్దాల్లో 70ఏళ్లు పైబడిన వారిలో మరణాలు 80 శాతానికిపైగా పెరిగాయన్నారు. ఈ తరహా ఇన్ఫెక్షన్లు వృద్ధులకు ప్రాణాంతకమని అధ్యయనం పేర్కొంది. యాంటీబయాటిక్స్ నిరోధకతగల స్టాఫ్ బ్యాక్టీరియా 'ఎంఆర్‌ఎస్‌ఏ' ఇన్‌ఫెక్షన్లతో మరణాలు రెట్టింపు అయ్యాయి. 2021 నాటికి ఏటా 1,30,000 మరణాలు సంభవించాయి. పరిస్థితి ఇలాగే ఉంటే సూపర్‌బగ్ వల్ల ప్రత్యక్ష మరణాలు 67 శాతం మేర పెరిగి 2050 నాటికి ఏటా 20లక్షల మంది చనిపోయే ప్రమాదం ఉంటుందని అధ్యయనం అంచనా వేసింది. శాస్త్రవేత్తల అధ్యయన నమూనా ప్రకారం మరో 82 లక్షల వార్షిక మరణాలకూ సూపర్‌బగ్స్ కారణం కాగలవని పేర్కొంది. అంటే మరణాలు 75శాతం మేర పెరుగుతాయని తెలిపింది.

సరైన మందులుంటే తీవ్రత తగ్గించవచ్చు

ఏఎంఆర్ కారణంగా ప్రత్యక్షంగా 39 కోట్ల మరణాలు రాబోయే 25 ఏళ్లలో సంభవిస్తాయని అధ్యయనం హెచ్చరించింది. మొత్తంగా 16.9 కోట్ల మంది చనిపోతారని తెలిపింది. అయితే దీని తీవ్రతను తగ్గించేందుకు అవకాశాలు లేకపోలేదని పేర్కొంది. ప్రాణాంతక అంటువ్యాధుల నిరోధానికి మెరుగైన యాంటీమైక్రోబియల్ మందులు అందుబాటులోకి వస్తే 2050 నాటికి 9.2 మిలియన్ల కోట్ల ప్రాణాలను కాపాడుకోవచ్చని తెలిపింది. 22 పాథోజెన్స్ (వ్యాధి కారకాలు), 84 రకాల యాంటీబయాటిక్ ఔషధాలు, మెనింజైటిస్ వంటి 11 ఇన్ఫెక్షన్‌ల లక్షణాలను ఈ అధ్యయనంలో భాగంగా పరిశోధకులు పరిశీలించారు. మొత్తం 204 దేశాల్లోని 52 కోట్ల మంది వ్యక్తిగత రికార్డుల ఆధారంగా సేకరించిన డేటాతో ఈ అధ్యయనం జరిగింది.

యువజన సమస్యలపై ఉద్యమించండి

రామకృష్ణ పిలుపు

ముగిసిన ఏఐవైఎఫ్ రాష్ట్ర వర్క్‌షాప్

విశాలాంధ్ర-విజయవాడ: ఆకాశమే హద్దుగా యువత ఎదుర్కొంటున్న సమస్యలపై ఏఐవైఎఫ్ పోరాటాలు నిర్వహించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కే రామకృష్ణ పిలుపునిచ్చారు. స్థానిక గవర్నర్ పేట రెవెన్యూ అధికారుల సంఘ భవన్‌లో జరుగుతున్న ఏఐవైఎఫ్ రాష్ట్ర స్థాయి వర్క్‌షాప్‌లో 'దేశ, రాష్ట్ర రాజకీయ పరిస్థితులు - యువత ముందున్న కర్తవ్యం' అంశంపై రామకృష్ణ ప్రసంగించారు. ఏటా రెండుకోట్ల ఉద్యోగాలు ఇస్తామని నరేంద్ర మోదీ ప్రభుత్వం నిరుద్యోగులను మోసం చేసిందన్నారు. ప్రపంచంలో మూడవ అతిపెద్ద అభివృద్ధి చెందిన దేశంగా భారత్ అవతరిస్తుందని చెబుతూ యువతను మోసం చేస్తున్నారని చెప్పారు. కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న తప్పుడు విధానాలపై ఉద్యమించాలని పిలుపునిచ్చారు. రాష్ట్రం అనేక రకాల సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతోందని... రాష్ట్ర ముఖ్యమంత్రి కేంద్రం నుంచి నిధులు రాబట్టాలని చెప్పారు. ఆంధ్రప్రదేశ్ సమగ్రాభివృద్ధికి యువత పూనుకోవాలన్నారు. స్థానికంగా సమస్యలను గుర్తించి పోరాటాలు నిర్వహించాలని సూచించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎన్నికల సమయంలో విచ్చలవిడిగా హామీలు ఇచ్చారని... ఆ హామీలు నెరవేర్చడానికి కేంద్రం బడ్జెట్ కూడా సరిపోయే పరిస్థితి లేదన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఏటా 20లక్షల ఉద్యోగాలు కల్పించాలని , నిరుద్యోగులకు ఎటువంటి ఆంక్షలు లేకుండా నిరుద్యోగ భృతి ఇవ్వాలన్నారు. యువత స్థానిక సమస్యలను గుర్తించి పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహించాలని సమస్య ఎక్కడ ఉంటే అక్కడ ఏఐవైఎఫ్ జెండా ఎగరాలని పిలుపునిచ్చారు.

ఉద్యోగ, ఉపాధి కల్పనలో ప్రభుత్వాలు విఫలం: ఈశ్వరయ్య

నిరుద్యోగ యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించడంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం అయ్యాయని, ఏఐవైఎఫ్ మాజీ జాతీయ కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య విమర్శించారు. ఏఐవైఎఫ్ వర్క్‌షాప్ సందర్భంగా ఈశ్వరయ్య మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఖాళీగా ఉన్న రెండు లక్షల ముప్పై వేల పోస్టులను భర్తీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మెగా డీఎస్సీ మాటల్లో తప్ప ఆచరణలో లేదన్నారు. ఎన్నికలకు ముందు అందరికీ నిరుద్యోగ భృతి ఇస్తామన్న ప్రభుత్వం నేడు నిరుద్యోగ భృతి విషయంలో ఆంక్షలు పెట్టడం బాధాకరమన్నారు.

విశాఖ ఉక్కు పరిరక్షణకు కదం తొక్కండి: రవీంద్రనాథ్

ఏఐవైఎఫ్ రాష్ట్రస్థాయి వర్క్ షాప్‌లో ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు రావులపల్లి రవీంద్రనాథ్ మాట్లాడుతూ... త్యాగాలతో సాధించుకున్న విశాఖ ఉక్కు పరిశ్రమను నరేంద్ర మోదీ ప్రభుత్వం ప్రైవేటు వ్యక్తులకు ధారాదత్తం చేసేందుకు చేస్తున్న యత్నాలను యువత తిప్పి కొట్టాలని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షులు రావులపల్లి రవీంద్రనాథ్ పిలుపు ఇచ్చారు. వేలాదిమందికి ఉపాధి కల్పిస్తూ ప్రపంచంలోనే నాణ్యమైన ఉక్కు సరఫరా చేస్తున్న ఈ పరిశ్రమను కారు చౌకగా ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టాలన్న కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా 1300 రోజులకు పైగా కార్మిక వర్గం పోరాటం చేస్తోందని...ఇటీవల కాలంలో ఈ ఉద్యమానికి రైతు సంఘాల సమన్వయ కమిటీ మద్దతు ప్రకటించిందన్నారు. కొత్తగా ఏర్పడిన ప్రభుత్వం కూడా ఉక్కు పరిశ్రమను కాపాడటంలో తగు శ్రద్ధ చూపటం లేదన్నారు. పాలకవర్గాల కుయుక్తులకు వ్యతిరేకంగా యువత కూడా పెద్ద ఎత్తున పోరాటంలో పాల్గొనాలని రవీంద్రనాథ్ పిలుపు ఇచ్చారు. విద్యార్థులను కూడా సమీకరించి రానున్న కాలంలో యూనివర్సిటీ స్థాయిలో అన్ని విద్యార్థి సంఘాలతో పోరాట కమిటీలు ఏర్పాటు చేయాలని కోరారు. ఏఐటీయూసీ కూడా శక్తి వంచన లేకుండా ఐక్య పోరాటాలు నిర్వహిస్తుందన్నారు. ప్రభుత్వ మొండి వైఖరికి నిరసనగా అక్టోబర్ రెండవ తేదీన అన్ని కార్మిక సంఘాలు ఆయా కేంద్రాలలో నిరాహార దీక్షలు చేయాలని, మూడవ తేదీన రైతు సంఘాల సమన్వయ కమిటీలు, యువజన విద్యార్థి సంఘాలు దీక్షలు చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పరుచూరి రాజేంద్ర బాబు, నక్కి లెనిన్ బాబు, సీపీఐ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్, ఇస్కఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాగితాల రాజశేఖర్, రాష్ట్ర ఆఫీస్ బేరర్స్ సంతోష్ కుమార్, కత్తి రవి, వై.బాబి, యుగంధర్, సుభాని,తదితరులు పాల్గొన్నారు. మూడు రోజుల పాటు జరిగిన వర్క్‌షాపు ఆదివారంతో ముగిసింది.

న్యాయమూర్తుల ప్రశంసలు అందుకున్న ధన్యజీవి రాఘవాచారి

సంపాదకీయాల మూడో సంపుటి సమాలోచన సమావేశంలో వక్తలు

విశాలాంధ్ర-శేరిలింగంపల్లి: సమాజ హితం కోసం నిరంతరం పరితపించిన మహోన్నత వ్యక్తి విశాలాంధ్ర మాజీ సంపాదకులు సి.రాఘవాచారి అని వక్తలు కొనియాడారు. రాజ్యాంగంలోని అంశాలతో పాటు చట్టాలు, గవర్నర్ వ్యవస్థ, చట్ట సభలు ఇలా అన్ని వ్యవస్థలపైన ఆయన సమగ్ర అవగాహనతో, లోతైన విశ్లేషణలతో సంపాదకీయాలు రాసేవారని కొనియాడారు. న్యాయమూర్తులు, న్యాయవాదులు కూడా రాఘవాచారిని ఎంతో గౌరవించేవారని గుర్తు చేసుకున్నారు. రాఘవాచారి సంపాదకీయాల సంకలనాలు నేటి తరానికి ఎంతో ఉపయోగమని, ఆయన జీవితం నేటి తరానికి ఆదర్శమని చెప్పారు. రాఘవాచారి ట్రస్ట్, నీలం రాజశేఖరరెడ్డి పరిశోధన సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో కొండాపూర్ చంద్ర రాజేశ్వరరావు ఫౌండేషన్, ఎన్ఆర్ఆర్ సెంటర్‌లో ఆదివారం రాఘవాచారి సంపాదకీయాలు "రాజ్యాంగం- న్యాయస్థానాలు- చట్టసభలు" మూడవ సంపుటిపైన సమాలోచన సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ఎన్ఆర్ఆర్ సెంటర్ డైరక్టర్ టి.సురేష్ అధ్యక్షతవహించగా విశాలాంధ్ర సంపాదకులు ఆర్వీ రామారావ్ '3వ సంపుటి'ని పరిచయం చేయగా, సీనియర్ సంపాదకులు కె.రాంచంద్రమూర్తి, మాజీ ఎమ్మెల్యే మానం ఆంజనేయులు, ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ (ఐఎఎల్) జాతీయ ప్రధాన కార్యదర్శి బొమ్మగాని ప్రభాకర్, రాఘవాచారి ట్రస్ట్ సభ్యులు అక్కినేని చంద్రరావు హాజరయ్యారు.

రాంచంద్రమూర్తి మాట్లాడుతూ కమ్యూనిస్టు, జర్నలిస్టు, సామాజిక, అధ్యాత్మిక అంశాలపైన రాఘవాచారి స్పష్టంగా తన అభిప్రాయాలు వ్యక్తం చేసేవారని గుర్తు చేశారు. అన్ని రంగాలకు చెందినవారితో, అన్ని రకాల సిద్ధాంతాలు కలిగిన వారితో ఆయన మాట్లాడేవారని గుర్తు చేశారు. ఆంగ్లభాషపై ఎంతో ప్రావిణ్యం ఉన్నప్పటికీ ఆయన మాత్రం విశాలాంధ్ర పత్రికకే పరిమితం అయ్యారని కొనియాడారు. ఆర్వీ రామారావ్ మాట్లాడుతూ వామపక్ష ఉద్యమం తన లక్ష్యాన్ని కొంత వెనక్కి తగ్గించుకుని, రాజ్యాంగ, ప్రజాస్వామ్య పరిరక్షణను ప్రధాన బాధ్యతగా తీసుకోవాల్సిన దుస్థితిలో ఉన్నామని అన్నారు. న్యాయవాదులలో 85 శాతం మంది రాజ్యాంగాన్ని చదివిన పాపాన పోలేదన్నారు. రాజ్యాంగంలోని అనేక అంశాలను అందరికీ అర్థమయ్యేలా సులభమైన భాషలో రాఘవాచారి తన వ్యాసాల ద్వారా తెలియజేశారన్నారు. రాఘవాచారి రాసిన సంపాదకీయాలు చదివితే గవర్నర్ వ్యవస్థ ఎలా భ్రష్టు పట్టిందో అర్థమవుతుందన్నారు. రాజ్యాంగం నిర్జీవపత్రం కాదని, అదొక సజీవ పత్రం అని చెప్పారు. సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తులు పదవిలో ఉన్నప్పుడు ఇవ్వాల్సిన తీర్పులను, వ్యాఖ్యాలను పదవీవిరమణ పొందే సమయంలో చేస్తారన్నారు. అయోధ్య తీర్పును రాసిందే జస్టిస్ చంద్రచూర్ అని అన్నారు. చాలా మంది 'లిబరల్ అనే పదాన్ని వాడుతారని, కానీ లిబర్ అర్థం ఏమిటో తాను అనేక పుస్తకాలను పరిశీలిస్తే, దాని అర్థం అవకాశవాదం అని ఉన్నదని తెలిపారు. రాహుల్ గాంధీ ఈమధ్య మంచి ప్రసంగాలు చేస్తున్నారని, అందుకే బీజేపీ వెన్నులో వణుకు పుడుతున్నదన్నారు. మానం ఆంజనేయులు మాట్లాడుతూ రాఘవాచారి ఎంతో అంకితభావంతో పనిచేశారన్నారు. అన్ని విషయాలు, రంగాలపైన రాఘవాచారికి సంపూర్ణ అవగాహన ఉన్నదన్నారు. బొమ్మగాని ప్రభాకర్ మాట్లాడుతూ రాఘవా చారి న్యాయ శాస్త్రాన్ని సంపూర్ణంగా సమగ్రంగా అధ్యయనం చేసి, అర్థం చేసుకున్న మహోన్నత వ్యక్తి మహోపాధ్యాయుడు అని కొనియాడారు. ట్రస్ట్ సభ్యులు డాక్టర్ అనుపమ స్వాగతం పలుకగా, మేనేజింగ్ ట్రస్టీ జోత్స్న వందన సమర్పన చేశారు

లడ్డూ వివాదంపై నేడు వీహెచ్‌పీ చర్చ

న్యూఢిల్లీ: టీటీడీ లడ్డూ కల్తీ వివాదం, దేశవ్యాప్తంగా ఉన్న ఆలయాలను ప్రభుత్వ నియంత్రణ నుంచి విముక్తి చేయాలన్న డిమాండ్‌పై సోమవారం విశ్వహిందూ పరిషత్ (వీహెచ్‌పీ) ఉన్నతస్థాయి సమావేశంలో చర్చించనున్నారు. తిరుపతిలో సుదీర్ఘంగా జరిగే 'కేంద్రీయ మార్గదర్శక్ మండల్'లో ఆలయాల విషయంతోపాటు మత మార్పిడి అంశంపై కూడా చర్చిస్తామని ఆ సంస్థ సీనియర్ కార్యకర్త ఒకరు ఆదివారం తెలిపారు. ఈ సమావేశానికి వీహెచ్‌పీ జాతీయ సెక్రటరీ జనరల్ బజరంగ్ బగ్దా, వీహెచ్‌పీ జాతీయ సెక్రటరీ జనరల్ బజరంగ్ బగ్దా, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఇతర దక్షిణాది రాష్ట్రాల నుండి నేతలు, సీనియర్ కార్యకర్తలు హాజరవుతారని తెలిపారు. హిందూ సమాజం ముందు ప్రస్తుతమున్న సవాళ్లు, వాటిని పరిష్కరించే మార్గాలపై చర్చలు జరపనున్నట్లు బగ్దా వెల్లడించారు. ఈ సమావేశంలో ప్రభుత్వ నియంత్రణ నుంచి దేవాలయాలను విముక్తి చేయడం అనే అంశంపై సుదీర్ఘంగా చర్చించి, దానిని పరిష్కరించడానికి ప్రణాళికను రూపొందించే అవకాశం ఉందని వీహెచ్‌పి సీనియర్ కార్యకర్త ఒకరు తెలిపారు.

బహుముఖ ప్రజ్ఞాశాలి సీతారాం ఏచూరి

సంస్మరణ సభలో రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాల నేతల నివాళి

విశాలాంధ్ర-విజయవాడ: దేశంలో ప్రజాతంత్ర, లౌకిక శక్తులను ఐక్యం చేసి ప్రజాస్వామ్య పరిరక్షణకు, రాజ్యాంగాన్ని కాపాడటం కోసం సీపీఎం ప్రధాన కార్యదర్శిగా సీతారాం ఏచూరి ముందుండి చేసిన కృషి మరువలేనిదని వివిధ రాజకీయ పార్టీల నేతలు, ప్రజాసంఘాల నాయకులు అన్నారు. సీతారం ఏచూరి సంస్మరణ సభ స్థానిక ఎంబీ విజ్ఞాన కేంద్రంలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగింది. సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యులు ఎంఏ బేబి మాట్లాడుతూ మార్క్సిజం, లెనినిజాన్ని శాస్త్రీయంగా అర్థం చేసుకున్న బహుముఖ ప్రజ్ఞాశాలి సీతారాం ఏచూరి అని కొనియాడారు. ఇండియా ఐక్య సంఘటన ఏర్పాటు చేయటంలో ఆయన కృషి ఎనలేనిదన్నారు. మరో పొలిట్‌బ్యూరో సభ్యులు బీవీ రాఘవులు మాట్లాడుతూ దేశం సంక్లిష్ట పరిస్థితుల్లో ఉందన్నారు. దేశ సమైక్యత, లౌకిక రాజ్యం ఉండాలా? వద్దా, తిరుమల మొత్తాన్ని ప్రక్షాళన చేయాలా? జమిలి ఎన్నికలు అవసరం ఉందా? మతోన్మాద విధానం ఉండాలా? వంటి అనేక సమస్యలు ఉన్న సమయంలో సీతారాం ఏచూరి వంటి నాయకుడిని కోల్పోయామన్నారు. ఏచూరి స్ఫూర్తిని నేటితరం ముందుకు తీసుకెళ్లాల్సి ఉందన్నారు. రాష్ట్ర సమాచార ప్రసార శాఖ మంత్రి కొలుసు పార్థసారథి మాట్లాడుతూ ఎమర్జెన్సీ కాలంలో ఇందిరా గాంధీ గురించి మాట్లాడాలంటేనే భయపడే రోజుల్లో ఆమె పక్కన నిలబడి మీరు జేఎన్‌యూ చాన్సలర్‌గా రాజీనామా చేయాలని డిమాండ్ చేసిన ధైర్యశాలి అని కొనియా డారు. రాష్ట్ర విభజనను తీవ్రంగా వ్యతిరేకించారని గుర్తు చేశారు. తెలుగు రాష్ట్రాల అవసరాల కోసం గళం ఎత్తేవారని చెప్పారు. ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాటం చేశారని, అధికారం కోసం కాకుండా సిద్ధాంతానికి కట్టుబడి పని చేశారని కొనియాడారు.

పీసీసీ అధ్యక్షురాలు వైఎస్.షర్మిల మాట్లాడుతూ పార్లమెంట్‌లో వాస్తవిక పరిస్థితుల్ని గణాంకాలతో వివరిస్తూ ఏచూరి చేసిన ప్రసంగాలు దేశ రాజకీయాల్ని ప్రభావితం చేశాయని చెప్పారు. ఉత్తమ పార్లమెంటేరియన్‌గా గుర్తింపు పొందారని చెప్పారు. పార్టీలు, పదవులు, పైసలు ముఖ్యం కాదని, మానవతా వాదమే ప్రధానం అనే తీరుగా పని చేశారని కొనియాడారు. ఏచూరి లేనిలోటు కమ్యూనిస్టు పార్టీతో పాటు కాంగ్రెస్ పార్టీకి తీరనిదన్నారు.

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ మాట్లాడుతూ హోదా చూడకుండా అందరినీ కలుపుకుని వెళ్లే మంచి స్నేహశీలి అన్నారు. అన్ని రాజకీయ పార్టీల నేతలతో సత్సంబంధాలు కలిగి ఉన్నారని, అంతర్జాతీయంగా కమ్యూనిస్టు నాయకులతో మంచి పరిచయాలు కలిగి ఉన్నారని తెలిపారు. రైతు సంఘాల సమన్వయ సమితి కన్వీనర్ వడ్డే శోభనాద్రీశ్వరరావు మాట్లాడుతూ ఏచూరి వ్యవహార శైలి సరళంగా ఉండటం వల్ల అనేక మంది ఆదరాభిమానాలు పొందారని చెప్పారు. మాజీ మంత్రి అంబటి రాంబాబు మాట్లాడుతూ కమ్యూనిస్టు పార్టీకి ప్రపంచ స్థాయిలో కీలక పాత్ర పోషించారని చెప్పారు. కమ్యూనిస్టు సిద్ధాంతం కోసం ఎంత వరకైనా వెళ్లే వ్యక్తి అన్నారు. పార్లమెంట్‌లో ఏచూరి చేసిన ప్రసంగాలు దేశ రాజకీయాలను ఎంతో ప్రభావితం చేశారని చెప్పారు.

ఆమ్‌ఆద్మీ పార్టీ రాష్ట్ర కన్వీనర్ శీరం రమేష్, సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ కార్యదర్శి బి.బంగార్రావు, సీపీఐ(ఎంఎల్) నాయకులు జాస్తి కిషోర్, ఎంసీపీ(యూ) రాష్ట్ర కార్యదర్శి కాటం నాగభూషణం, ఆర్ఎస్‌పీ నాయకులు జానకి రాములు, ఫార్వర్డ్‌బ్లాక్ నాయకులు జయవర్ధన్, సీపీఐ(ఎంఎల్) నాయకులు డి.హరినాథ్ తదతరులు సీతారాం ఏచూరి సేవలను కొనియాడారు. వివిధ రాజకీయ పార్టీల నేతలు, ప్రజాసంఘాల నాయకులు పెద్ద సంఖ్యలో హాజరై సీతారం ఏచూరికి నివాళులర్పించారు. ముందుగా సీతారాం ఏచూరి చిత్రపటానికి నేతలు పూలమాలలు వేసి నివాళు లర్పించారు.

చెన్నై టెస్టులో టీమిండియా ఘన విజయం

బంతితోనూ మాయచేసిన అశ్విన్

చెన్నై: భారత్-బంగ్లాదేశ్ క్రికెట్ జట్ల మధ్య ఇక్కడ చెపాక్ మైదానంలో తొలి టెస్టులో టీమిండియా ఘన విజయం సాధించింది. 515 పరుగుల భారీ లక్ష్యంతో రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన బంగ్లా జట్టు 234 పరుగులకు ఆలౌటై వెనుతిరిగింది. ఓవర్‌నైట్ స్కోర్ నాలుగు వికెట్ల నష్టానికి 158 పరుగులతో నాలుగో రోజు ఆటను ఆరంభించిన బంగ్లాదేశ్... మరో 76 పరుగులు జోడించి మిగిలిన 6 వికెట్లు కోల్పోయింది. నాలుగో రోజు ఆట ఆరంభంలో బంగ్లాదేశ్ పతనాన్ని షకిబ్ అల్ హసన్‌తో కలిసి కెప్టెన్ షాంటో కాసేపు అడ్డుకోగలిగాడు. వీరిద్దరూ ఐదో వికెట్‌కు 48 పరుగులు జోడించారు. అశ్విన్ రాకతో బంగ్లాదేశ్ పని అయిపోయింది. సెంచరీతో బంగ్లాను దెబ్బతీసిన అశ్విన్ బంతితోనూ చుక్కలు చూపించాడు. దీంతో భారత్ 280 పరుగుల తేడాతో నెగ్గింది. టీమిండియా స్టార్ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ ఆరు వికెట్లు పడగొట్టాడు. రవీంద్ర జడేజా 3, బుమ్రా 1 వికెట్ తమ ఖాతాలో వేసుకున్నారు. ఇక బంగ్లాదేశ్ బ్యాటర్లలో కెప్టెన్ షాంటో 82 పరుగులతో ఒంటరి పోరాటం చేశాడు. జాకిర్ హసన్ (33), షాద్మన్ (35), షకిబ్ అల్ హసన్ (25) పరుగులు చేశారు. ఈ మ్యాచ్‌లో టాస్ ఓడి తొలి ఇన్నింగ్స్‌ను ఆరంభించిన టీమిండియా... ఆల్‌రౌండర్లు అశ్విన్, జడేజా చెలరేగి ఆడటం వల్ల తొలి ఇన్నింగ్స్‌లో 376 పరుగులకు ఆలౌటైంది. ఆ తర్వాత భారత పేసర్ల ధాటికి బంగ్లాదేశ్ తొలి ఇన్నింగ్స్‌లో 149 పరుగులకే కుప్పకూలింది. తొలి ఇన్నింగ్స్‌లో భారీ ఆధిక్యం సాధించిన టీమిండియా... రెండో ఇన్నింగ్స్‌లో శుభమన్ గిల్, పంత్‌లు సెంచరీలతో కదం తొక్కడంతో రెండో ఇన్నింగ్స్‌ను 4 వికెట్ల నష్టానికి 287 పరుగుల స్కోరు వద్ద డిక్లేర్ చేసింది. 515 పరుగుల భారీ లక్ష్యంతో రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన బంగ్లాదేశ్ భారత స్పిన్నర్ల ధాటికి 234 పరుగులకు ఆలౌటైంది. బ్యాట్‌తో, బంతితో అదరగొట్టిన అశ్విన్ ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచాడు. రెండు టెస్టుల సిరీస్‌లో రోహిత్ సేన 1-0తో ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. రెండో టెస్టు సెప్టెంబర్ 27 నుంచి కాన్పూర్ వేదికగా జరగనుంది. ఆరంభంలో కొంచెం వెనుకంజ వేసినట్లు కనిపించిన టీమ్‌ఇండియా అద్భుతంగా పుంజుకొని కేవలం మూడున్నర రోజుల్లోనే టెస్టు మ్యాచ్‌ను ముగించడం విశేషం.

త్వరలో నామినేటెడ్ పదవుల భర్తీ

కష్టపడిన కార్యకర్తలకు సముచిత స్థానం: చంద్రబాబు



విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: త్వరలో నామినేటెడ్ పదవులు భర్తీ చేస్తామని, ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నామని, 100 రోజుల్లోనే ఇది మంచి ప్రభుత్వంగా ప్రజలు అంటున్నారని టీడీపీ అధినేత, సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఇంచార్జిలు, గ్రామస్థాయి పార్టీ నేతలతో ఆదివారం ఆయన టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. సీఎం మాట్లాడుతూ, ప్రతి ఇంటికెళ్లి ప్రభుత్వం చేస్తున్న మంచిని వివరించాలని, దీపావళి నుంచి ఉచిత గ్యాస్ సిలిండర్ పథకం అమలు చేస్తామని చెప్పారు. గత ప్రభుత్వం టీటీడీ ప్రసాదంలో జంతు కొవ్వు వినియోగించి ప్రజల మనోభావాలు దెబ్బతీసిందని, దోషులను వదిలిపెట్టబోమన్నారు. గత ప్రభుత్వ తప్పులు సరిదిద్దుతూ...వ్యవస్థలను చక్కబెతున్నామని తెలిపారు. టీడీపీకి కార్యకర్తలే బలం అని, పార్టీ కోసం కష్టపడి పనిచేసిన కార్యకర్తలు, నేతల త్యాగాలను విస్మరించబోమని చెప్పారు. కార్యకర్తలకు ఇచ్చే ప్రమాద బీమాను రూ.రెండు లక్షల నుంచి రూ. ఐదు లక్షలకు పెంచామన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్, ఎంపవర్‌మెంట్ విభాగం ద్వారా యువతకు వివిధ కంపెనీలలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామని వివరించారు. ఎన్ఆర్ఐ టీడీపీ విభాగం ద్వారా విద్యార్థులకు శిక్షణను ఇచ్చి విదేశాల్లో ఉద్యోగాలు కల్పిస్తున్నామని, నామినేటెడ్ పోస్టుల భర్తీకి కసరత్తు చేస్తున్నామని చెప్పారు. పార్టీ కోసం కష్టపడిన వారికి నామినేటెడ్ పదవుల నియామకాల్లో సముచిత ప్రాధాన్యత ఇస్తామన్నారు. కూటమిలోని మూడు పార్టీల్లో కష్టపడ్డ నేతలకు ప్రాధాన్యం ఉంటుందని స్పష్టంచేశారు. ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం రూ.10 లక్షల కోట్ల అప్పులు చేసి వ్యవస్థలను సర్వనాశనం చేసిందని, నాటి వారి పాపాలే నేడు ప్రజలకు శాపాలుగా మారాయని పేర్కొన్నారు. జగన్ అసమర్థ పాలన వల్ల జరిగిన నష్టాన్ని ప్రజా క్షేత్రంలో వివరించాలని కోరారు. సంక్షేమం, అభివృద్ధిని సమాంతరంగా ముందుకు తీసుకెళ్తున్నామని, 2029 నాటికి టీడీపీని తిరుగులేని శక్తిగా మారుస్తామన్నారు. గత ప్రభుత్వం ఒక్క డీఎస్సీ కూడా నిర్వహించకుండా యువతను తీవ్ర నిరాశలో కూరుకుపోయేలా చేశారని, ఎన్నికల హామీలో ఇచ్చిన మేరకు తొలిసంతకం మెగా డీఎస్సీ దస్త్రంపై పెట్టామని గుర్తుచేశారు. రాబోయే రోజుల్లో భారీ ఎత్తున పరిశ్రమలు తీసుకొచ్చి యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని భరోసా ఇచ్చారు. ప్రజల ఇసుక కష్టాలు తీర్చడం కోసం ఉచిత ఇసుక విధానాన్ని అమల్లోకి తెచ్చానని చెప్పారు. మద్యం విధానాన్ని ప్రక్షాళన చేశాం. ప్రజల ఆరోగ్యం దృష్టిలో పెట్టుకుని కల్తీ మద్యాన్ని అరికట్టామని, గ్రామాల్లో మూడు సెంట్లు, పట్టణాల్లో రెండు సెంట్లు చొప్పున పేదలకు ఇళ్ల స్థలాలు ఇస్తామని వివరించారు. కేంద్ర బడ్జెట్‌లో అమరావతి అభివృద్ధికి రూ.15వేల కోట్ల ప్రత్యేక ఆర్థిక సాయాన్ని ప్రకటించిందని, త్వరలోనే రాజధాని పనులు మొదలుపెడతామని, అమరావతికి ప్రసిద్ధ విద్యా సంస్థలు వస్తున్నాయని వివరించారు. రాయలసీమ, ప్రకాశం, ఉత్తరాంధ్రలో వెనుకబడిన జిల్లాలకు ప్రత్యేక ప్యాకేజీతో పాటు, విశాఖ-చెన్నై పారిశ్రామిక కారిడార్లోని రోడ్లకు ప్రత్యేక సాయం, హైదరాబాద్-బెంగళూరు పారిశ్రామిక కారిడార్ అభివృద్ధికి కేంద్రం హామీ ఇచ్చిందన్నారు. మనది ప్రజా ప్రభుత్వం అని, ఆర్భాటాలు లేవు అని స్పష్టంచేశారు. చారిత్రాత్మక విజయం అందించిన ప్రజలకు మనం సంక్షేమం, అభివృద్ధి అందించాలని చంద్రబాబు అన్నారు.

లడ్డూ తయారీపై దుష్ప్రచారం

చంద్రబాబుపై మోదీకి జగన్ లేఖ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: తిరుమల లడ్డూ తయారీపై సీఎం చంద్రబాబు చేసిన ఆరోపణల్లో నిజానిజాలు వెలికి తీయాలని, ఈ వ్యవహారాన్ని జాగ్రత్తగా చూడకపోతే పరిస్థితులు దిగజారే ప్రమాద ముందని మాజీ సీఎం, వైసీపీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. టీటీడీ లడ్డూ వ్యవహారంపై ప్రధాని నరేంద్ర మోదీకి ఆదివారం లేఖ రాశారు. చంద్రబాబు పాలనా సమర్థ్యంపై ప్రజలు నమ్మకాన్ని కోల్పోయారని, ప్రజల దృష్టిని మరల్చడానికి అబద్ధాలు ప్రచారం చేశారన్నారు. తిరుమల లడ్డూ తయారీలో కల్తీ నెయ్యి వాడారని ఆరోపిస్తున్నారని, రాజకీయ ప్రయోజనాల కోసమే చంద్రబాబు ఈ దుష్ప్రచారం చేశారని తెలిపారు. కోట్లాది మంది భక్తుల మనోభావాలు దెబ్బ తిన్నాయని, టీటీడీలో ధృఢమైన విధానాలు, పద్ధతులు ఉన్నాయని, కొన్ని దశాబ్దాలుగా ఈ పద్ధతులు అమలవుతున్నాయని తెలిపారు. పరీక్షల్లో కచ్చితత్వంపై నిర్ధారణ లేకుండా చంద్రబాబు దిగ్భ్రాంతి కలిగించే ఆరోపణలు చేశారని, కేఎంఎఫ్ నందిని నెయ్యిపై అబద్ధాలే చెబుతున్నారని తెలిపారు. తిరుమల తిరుపతి దేవస్థానాల పవిత్రతను, ప్రతిష్టను కోలుకోలేని విధంగా దెబ్బ తీసేందుకు చంద్రబాబు యత్నిస్తున్నారన్నారు. వెంకటేశ్వరస్వామికి ప్రపంచవ్యాప్తంగా భక్తులు ఉన్నారని, ఈ వ్యవహారాన్ని జాగ్రత్తగా చూడకపోతే భవిష్యత్తులోనూ తీవ్ర పరిణామాలు తప్పకపోవచ్చని హెచ్చరించారు. ఆలయంలో వినియోగించే నెయ్యితో సహా సరుకుల స్వచ్ఛత, నాణ్యతలపై పరీక్షలు జరపడానికి ప్రయోగశాలలను బలోపేతం చేశామన్నారు. నవనీత సేవను ప్రారంభించడమే కాదు, శుద్ధ నెయ్యి సరఫరా కోసం తిరుమలలో గోశాలను స్థాపించామని, టీటీడీ అర్చకుల జీతాలు రెట్టింపు చేశామని గుర్తుచేశారు. టీటీడీ ఉద్యోగులకు వైసీపీ హయాంలో ఇంటి స్థలాలు ఇచ్చినట్లు తెలిపారు. జమ్మూలో వైష్ణో దేవి సమీపంలో టీటీడీ ఆలయ నిర్మాణం, ప్రారంభోత్సవాన్ని గుర్తుచేశారు. ముంబై, రాయ్‌పూర్, అహ్మదాబాద్‌లో బాలాజీ కొత్త ఆలయాల నిర్మాణాన్ని ప్రస్తావించారు. ముఖ్యమంత్రి స్థాయిని మాత్రమే కాకుండా ప్రజా జీవితంలో ఉన్న ప్రతి ఒక్కరి స్థాయిని దిగజార్చిన చంద్రబాబును తీవ్రంగా మందలించాల్సిన అవసరముందన్నారు. నిజానిజాలు వెలుగులోకి తేవడం అత్యవసరమని, చంద్రబాబు సృష్టించిన అనుమానాలను నివృత్తి చేయడం ముఖ్యమని లేఖలో జగన్ పేర్కొన్నారు.

'లడ్డూ'పై సుప్రీంలో మరో పిటిషన్

న్యూఢిల్లీ: తిరుమల లడ్డూ ప్రసాదం వ్యవహారానికి సంబంధించి సుప్రీంకోర్టులో మరో పిటిషన్ దాఖలైంది. వెంకటేశ్వరస్వామి లడ్డూ ప్రసాదంలో కల్తీ నెయ్యి ఉపయోగించారనీ, ఇందులో జంతువుల కొవ్వులతో చేసిన నెయ్యిని వాడినట్లు ల్యాబ్ నివేదికలు రాష్ట్ర ప్రభుత్వం బయటపెట్టింది. లడ్డూలో కల్తీ నెయ్యి వాడడంపై భక్తులు, అనేక ధార్మిక సంస్థలతో పాటు ఆధ్యాత్మికవేత్తలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ వ్యవహారంపై సుప్రీంకోర్టులో ఆదివారం మరో పిటిషన్ దాఖలైంది. ఆరోపణలపై విచారణ కోసం ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్)ని ఏర్పాటు చేయాలని కోరుతూ హిందూసేన అధ్యక్షుడు సుర్జిత్ సింగ్ యాదవ్ సుప్రీంకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలు చేశారు. లడ్డూ వ్యవహారంపై ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.

ఏడీజీపీ ఇచ్చింది తప్పుడు నివేదిక

త్రిస్సూర్ పూరం ఘటనపై కాంగ్రెస్, సీపీఐ

త్రిస్సూర్: ప్రతిష్ఠాత్మక త్రిస్సూర్ పూరం-2024కు విఘాతం కలిగించడంలో బయటవారి ప్రమేయం లేదని ఏడీజీపీ ఎంఆర్ అజిత్‌కుమార్ తప్పుడు నివేదిక ఇచ్చారని కాంగ్రెస్, సీపీఐ పేర్కొన్నాయి. మే 19న జరిగిన త్రిస్సూర్ పూరంకు విఘాతం కలిగింది. దీంతో నగర పోలీసు కమిషనర్, అసిస్టెంట్ కమిషన్‌పై కేరళ ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఈ వ్యవహారంలో సమగ్ర నివేదిక ఇవ్వాలని రాష్ట్ర డీజీపీకి సీఎం విజయన్ ఆదేశించారు. దర్యాప్తు నివేదికను సీల్డ్ కవర్‌లో డీజీపీకి ఏడీజీపీ అజిత్‌కుమార్ తాజాగా సమర్పించారు. బాహ్య జోక్యం లేదని అందులో పేర్కొన్నారు. సూత్రధారే దర్యాప్తు నివేదిక సమర్పించారా అని కాంగ్రెస్ దుయ్యబట్టింది. ఇది తప్పుడు నివేదికని ప్రతిపక్ష నేత వీడీ సతీశన్ అన్నారు. 'వారంలోగా నివేదిక ఇవ్వాలని డీజీపీకి సీఎం ఆదేశించారు. నాలుగు నెలలు గడిచినా దర్యాప్తు నిర్వహించలేదని నివేదికలు వచ్చాయి. నిందితుడే స్వయంగా దర్యాప్తు నివేదిక సమర్పించారు. అది కూడా తప్పుడు నివేదిక' అని సతీశన్ ఒక ప్రకటనలో వ్యాఖ్యానించారు. సీపీఐ సీనియర్ నేత వీఎస్ సునీల్ కుమార్ స్పందిస్తూ 'నివేదికలో ఏముందో తెలియదు కానీ త్రిస్సూర్ పూరం విఘాతానికి బయట వారే కారణమని, ఇందులో కుట్ర కోణం ఉన్నదనడంలో అనుమానం లేదు' అని అన్నారు. ఈ వ్యవహారంలో జుడిషియల్ విచారణకు కాంగ్రెస్ సీనియర్ నేత కె.మురళీధరన్ డిమాండ్ చేశారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2024-26, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.